

హంస వాహనంపై వెంకయ్య

- వేడుకగా గ్రామోత్సవం • పోటెత్తిన భక్తులు
- నేడు సూర్యప్రభ, గజ వాహన సేవలు

16

రుణాల కోసం నకిలీ ధ్రువీకరణలు

- విజయా బ్యాంకులో 49 ఖాతాలు హోల్డ్
- వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌పై నకిలీ మరకలు ?
- ఎస్సీ కార్పొరేషన్‌లో వెలుగు చూస్తున్న అక్రమాలు
- లబ్ధిదారుల్లో ఆందోళన

- వివరాలు 11లో..

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
సోమవారం 21 ఆగస్టు 2017 | 16

- క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో కీలక మలుపు
- రేపు విచారణకు రండి
- వైసీపీ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, అనిల్‌కు నోటీసులు
- నంద్యాలలో అందజేసిన పోలీసులు

ఇక ఎమ్మెల్యేల వంతు

- త్వరలో మరో ఇద్దరు ఎమ్మెల్యేలకు కూడా..
- అరెస్టులూ ఉండే అవకాశం

ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి



నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లు, బుకీల వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఇప్పటి వరకు బుకీలు, బెట్టింగ్ రాయుళ్లపై దృష్టి పెట్టిన పోలీసులు ఇప్పుడు ఏకంగా వైసీపీ ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకుని విచారణ సాగించేందుకు సిద్ధపడ్డారు. ఆదివారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సిటీ ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌కు నోటీసులు జారీ చేశారు. నాలుగు రోజుల క్రితమే ఈ నోటీసులు సిద్ధమైనా వారు అందుబాటులో లేకపోవడంతో ఆదివారం ఉదయం నంద్యాలలో వాటిని అందించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎస్పీ కార్యాలయానికి హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. విచారణతోపాటు అరెస్టులు ఉంటాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అలాగే అదే పార్టీకి చెందిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేస్తారని సమాచారం. వైసీపీ ఎమ్మెల్యేలే లక్ష్యంగా క్రికెట్ బెట్టింగ్‌ల కేసులు నడుస్తున్నాయని ముందుగానే ఆంధ్రజ్యోతి చెప్పింది. ఇప్పుడు అదే అక్షర సత్యమైంది.





8

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

పడకేసిన పర్యవేక్షణ

- వైద్య కళాశాలలో పాలన అస్తవ్యస్తం
- విద్యార్థులపై కొరవడిన నిఘా
- చదువులు వదిలి ఘర్షణ దిశగా మెడికోలు
- సగం రోజులు కనిపించని వార్డెన్‌లు
- కఠినంగా వ్యవహరించకుంటే భారీ మూల్యం

7 లో..

అధికారుల పర్యవేక్షణ లోపం నెల్లూరు వైద్య కళాశాలకు శాపంగా మారుతున్నది. విద్యార్థులపై నిఘా కరువవడంతో వారు వీధి రౌడీల్లా రోడ్లపై కొట్టుకునే స్థాయికి దిగజారుతున్నారు. హాస్టల్ వార్డెన్‌లో సగంరోజులు కూడా విధుల్లో కనిపించరు. ఈ క్రమంలో సీనియర్, జూనియర్ల మధ్య భగ్గుమనే స్థాయిలో వివాదాలు నడుస్తున్నాయి. శనివారం జరిగిన ఘటన ఇందుకు నిదర్శనం. పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్‌లో గొడవలు మరింత ముదిరే అవకాశాలున్నాయి. వందల కోట్లు ఖర్చు చేసి వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తే, ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యపు వైఖరి కారణంగా చెడ్డపేరు వచ్చే దుస్థితి దాపురించింది. ఈ వివాదాలను ఆదిలోనే తుంచకపోతే భవిష్యత్‌లో మరిన్ని పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని జిల్లావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నెల్లూరు : ప్రభుత్వ వైద్య కళాశాల



కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న డీఐజీ గోపాలరావు, ఎస్పీ రామకృష్ణ తదితరులు

నేరస్థుల పట్ల కఠిన వైఖరి

- ఎంతటివారైనా ఉపేక్షించవద్దు
- బెట్టింగ్ కేసుల్లో పనితీరు భేష్ !
- టెక్నాలజీని సద్వినియోగం చేసుకోండి
- పెండింగ్ కేసులను పరిష్కరించండి
- డీఐజీ గోపాలరావు

6

ఆ విగ్రహాలతో

అనర్థం

- పర్యావరణానికి ముప్పుగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ప్రతిమలు
- గర్భస్థ పిండానికి ఇబ్బందులే
- మేలుకోవాలంటున్న వైద్యులు, పర్యావరణ వేత్తలు

8వ పేజీలో

నో పర్మిషన్..

- జూనియర్ కళాశాలల హాస్టళ్లకు లేని అనుమతులు
- ఇంటర్‌బోర్డు నోటీసులు
- వివరణ ఇచ్చిన యాజమాన్యాలు
- స్పష్టత ఇవ్వని అధికారులు

6



స్నేహ పూర్వక వాతావరణంలో పిల్లలు పెరిగితే తమ ప్రాంతమంతా గొప్పదనే భావన వారిలో నాటుకుంటుంది. అయ్యో పాపం అనే వాతావరణంలో పెరిగితే తమపై తామే జాలి పడుతూ ఉంటారు. పిన్నలు ద్వేషంతో చూసే వాతావరణంలో పెరిగితే పోట్లాడే మనస్థత్వాన్ని అలవరుచుకుంటారు. గుర్తింపు పొందే వాతావరణంలో పెరిగితే మంచి లక్ష్యాలను ఏర్పరచుకుంటారు. భయంతో పెరుగుతూ వస్తే భవిష్యత్తు వారికి అభద్రతగా గోచరిస్తుంది. అందువలనే బాల్యంలోనే పిల్లలను ప్రేమతో చేరదీయాలి... ఆరోగ్యంగా పెంచాలి...యుక్త వయసులోకి వచ్చేసరికి వారితో స్నేహపూర్వకంగా మెలగాలి. ఇది కేవలం తల్లిదండ్రుల బాధ్యతే కాదు. బాల్యంలోనే పాఠశాలలో అడుగు పెడుతున్నందు వలన పాఠశాలల బాధ్యత కూడా కొంత ఉంటుంది. ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకన్నా రెట్టింపు బాధ్యత ఉంటుంది అంటారు ప్రముఖ కవి, రచయిత అవ్వారు శ్రీధర్‌బాబు. కవిత్వాన్ని పాఠాలుగా, పాఠ్యాంశాలను కవిత్వంగా బోధిస్తూ పిల్లలకు తెలుగు భాషనే కాకుండా విలువల గురించి చెబుతూ కవిత్వపు ముక్కలను రుచి చూపిస్తూ గేయాలుగా ఆలపిస్తూ తనకంటూ ఒక కొత్త సాహితీ లోకాన్ని సృష్టించుకుంటున్న శ్రీధర్‌బాబు తన అనుభవాలను ఇలా పంచుకున్నారు.

- (నెల్లూరు, సాంస్కృతిక ప్రతినిధి)

ఆదర్శం

పాఠ్యాంశాలే కవిత్వం

● అవ్వారు శ్రీధర్‌బాబు

మాది ఫత్తేఖాన్‌పేట. మా అమ్మ వెంకమ్మ, నాన్న సుబ్బయ్య. మా నాన్నది వస్త్ర వ్యాపారం. చిన్నతనం నుంచి ఆయన ఒక మాట చెబుతూ వచ్చారు. "ఇలాంటి వ్యాపారాలు నాతోనే అంతం కావాలి. నా పిల్లలు బాగా చదువుకోవాలి. ఉద్యోగాలు చేయాలి" అనే వారు. నా విషయంలో "నా కొడుకు ఉపాధ్యాయుడు కావాలి. మంచి అయ్యవారుగా అందరికి పాఠాలు చెప్పగలగాలి" అనే వారు. అదే తారక మంత్రంలా నాపై పని చేసిందేమో. బడిలో చేరిన రోజు నుంచే నేను కాబోయే అయ్యవారుని అన్న బీజం బలంగా మనస్సులో నాటుకుంది. మొలకెత్తింది. అదే నన్ను అయ్యవారుగా తీర్చిదిద్దింది. ఇదేదో మంత్రదండం కథ కాదు. కాని మా నాన్న వేసిన బీజమే నన్ను ఆ లక్ష్యంవైపు అడుగులు వేయించింది. ఆ గమనమే నన్ను ఈ స్థాయిలో నిలిపింది. ఇంటి చుట్టూ ఉన్న రామయ్యబడి నుంచి హైస్కూల్, సీఏఎం, డిగ్రీ సర్వోదయ కళాశాలలో పూర్తి చేయటంతో చదువు తప్పించి మరో ప్రపంచం నాకు తెలియదు. ఇల్లు, చదువు, ఆటలు అంత వరకే నా 21 ఏళ్ల జీవితం. ఆ తరువాతనే పీజీ చేయాలనే కోరిక తిరుపతి యూనివర్సిటీకి ప్రయాణం కట్టించింది. అదే నా జీవితంలో ఒక పెద్ద మలుపు. ఆ మలుపుతోనే అనేక కుదుపులకు లోనైనప్పటికీ ఏంఏ ఎకనమిక్స్, ఎంఏ ఇంగ్లీషు, ఎంఈడీ లైబ్రరీ సైన్స్ పూర్తిచేసి ఉపాధ్యాయ వృత్తిలోనే ప్రవేశించా. తోటపల్లిగూడూరు మండలం కృష్ణారెడ్డిపాళెం ఎంపీపీఎస్‌లో పని చేస్తున్నా.

సాహిత్యం వైపు

రామయ్యబడిలో చదువుతున్నప్పుడే తెలుగు భాషపై కొంచెం అవగాహన ఏర్పడింది. దానికి కారణం అక్కడ మా అయ్యవారు చిన్నతనంలోనే పద్యాలు అప్ప చెప్పటం, వారు చెప్పినవి వెంటనే తిరిగి చెప్పటం నాలో అయ్యవార్లకు కూడా నచ్చిన అంశమైంది. సీఏఎం హైస్కూల్‌లో కూడా మహా పండితులు ఉండడంతో ప్రతి విద్యార్థి నాడిని కనిపెట్టి ఆయా రంగాల వైపు వారిని తీర్చిదిద్దేవారు. నా విషయంలో కూడా తెలుగుభాషపై, వ్యాకరణం, కథలు చెప్పటం, పాఠాలను తిరిగి చెప్పించడం తదితర ప్రయోగాలు ఎక్కువగా చేయించేవారు. అవన్నీ కూడా నాలో మార్పుని తీసుకువచ్చినప్పటికీ డిగ్రీలో కాళిదాస పురుషోత్తం, గిరిజ, వెంకటేశ్వరరావు, శివరామప్రసాద్ లాంటి మహా మహులు ఉన్న సర్వోదయ కళాశాలలో చదవటం కూడా నాకు సాహిత్యపరంగా కలిసొచ్చిన అంశం. కాని తిరుపతిలో పీజీ చేస్తున్నప్పుడే పూర్తిగా సాహిత్యం వైపు వడివడిగా అడుగులు పడ్డాయి. డిగ్రీ వరకు పాఠ్యాంశాలు మాత్రం చదివినప్పటికీ కవిత్వం రాయాలనే తపన ఉన్నప్పటికీ చదువులు, మార్కులు మధ్య నలుగుతూ కలాన్ని కేటాయించలేకపోయా. కాని తిరుపతిలో మాత్రం సాహిత్యంపై ఉన్న మక్కువ ఆవేశంగా పెల్లుబుకింది. శ్రీశ్రీ, గురజాడ, తిలక్, అప్పట్లో యువకవులు ఆకు రాజేంద్ర తదితరుల కవితా పుస్తకాలను విపరీతంగా చదివేవాడిని. అదే నా కవిత్వానికి పునాది, బలం కూడా. అప్పటి నుంచి రాయటం కన్నా చదవటంపైనే ఎక్కువ ఆసక్తి చూపుతూ వచ్చా. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తరువాత పిల్లలకి పాఠాలు కొత్త తరహాలో చెబితే ఎలా ఉంటుందనే ఆలోచన బయటకు వచ్చింది. అదే నన్ను కొత్త అంశాలను ప్రయోగాత్మగంగా మలిచి పాఠాలుగా చెప్పటం వైపు మళ్లించింది. వారికి ఏ అక్షరాన్ని అయితే పరిచయం చేస్తున్నానో అ అక్షరంతో నాలుగు పాదాలుగా మొదలుపెట్టి గేయాలుగా రాసి చెప్పేవాడిని. పాడుతూ పిల్లలకు చెప్పటంతో వారు ఒక పాటలాగా సంతోషంగా వింటూ ఆలపిస్తూ సులభంగా వంటపట్టించుకునే వారు. ఆ సమయంలోనే నా ప్రవృత్తి రీత్యా కవిత్వం, కథలు రాస్తూ పత్రికలకు పంపటం, ప్రోత్సాహం లభించటం, రాసింది రాసినట్లు ప్రచురణ కావడంతో కొద్ది కాలంలోనే కవిగా, రచయితగా గుర్తింపు పొందా. ఆ తరువాతనే పిల్లలకి ఉపయోగపడే పాఠ్యాంశాలను రాయాలనే ఆలోచన కలిగింది. పలు పాఠ్య పుస్తకాలను కూడా రచించా. నేను చెప్పే పాఠాలన్నీ కవిత రూపాలుగా, అభినయంతో బోధించడంతో పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరిగింది. దీని గుర్తించిన సహోధ్యాయులు అభినందిచటం నాకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఆ ఉత్సాహమే నన్ను రచయితగా నిల బెట్టింది. ఇప్పటికి దాదాపు వందకు పైగా కవితలు, 45 కథలు రాసి గుర్తింపు పొందా. రాష్ట్ర, రాష్ట్రేతర సాహిత్య సభల్లో పాల్గొంటూ అనేక బహుమతులు అందుకోగలిగా.




వృత్తి -ప్రవృత్తి

సాహిత్యపరంగా కాకుండా ఉపాధ్యాయ వృత్తి పరంగా సరికొత్తగా ఏదైన అందించాలన్న ప్రయత్నంతోనే క్లాప్స్ మాడ్యూల్ అభివృద్ధి, పాఠశాల సముదాయం, పిల్లల పుస్తకం, అభినయ గేయాలు, అభినయ కథలతో కూడిన పలు పుస్తకాలు వెలువరించా. వీటితోపాటు పిల్లల పుస్తకం ఒకటి, రెండు అనే ధారా వాహికలు కూడా ప్రత్యేకంగా రచించి వెలువరించా. ఇంగ్లీషు సులభతరం చేయాలని ముఖ్యంగా గ్రామీణ పిల్లలు ఆంగ్లంలో వెనుకపడుతున్నారని ఈజీ ఇంగ్లీషు గ్లామర్‌ను రచించి బోధించా. వారికి ఉచితంగానే ప్రతులు వివిధ పాఠశాలలకు కూడా అందించా. సాహిత్య పరంగా కూడా మంచు బిందువులు, నానీల సంపుటి, పూల తివాచి కవితల సంపుటి, జీవన చిత్రాలు కథల సంపుటి, చందమామ పదాలు మాతృఛందస్సును వెలువరించా. ప్రస్తుతం పెన్నా రచయితల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతూ సాహిత్య పరంగా కృషి చేస్తున్నా, విద్యార్థులకు పాఠాలను కవిత్వంగా వినిపించాలనేదే నా తపన. ఎందుకంటే ప్రేమాభిమానాలతో పెంచ గలిగితే పరిపూర్ణ వ్యక్తులుగా పిల్లలు తయారవుతారు. విశ్వాసం కలిగించే స్థితిలో పెంచగలిగితే వివేచన నేర్చుకుంటారు. పిల్లలు గేలిచేసే వాతావరణంలో పెరిగితే సిగ్గుతో కుంచుకుపోతారు. అందుకని పిల్లలను విలువలతోనూ, కవిత్వంతోనూ, ప్రేమతోనూ, స్నేహంతోనూ పెంచటమే కాకుండా పాఠాలు కూడా అలాగే చెప్పాలని, తెలుగుభాషపై, కవిత్వం మీద మక్కువ కలిగించే విధంగా నా వంతు కృషి చేస్తున్నా, ఆ బాటలోనే చివరి వరకు పయనించాలనేది నా కోరిక అని ఆయన ముగించారు.

నారాయణ - మాతృదేవోభవ

నెల్లూరు (సాంస్కృతిక ప్రతినిధి) : దేవుడిని ప్రేమిస్తూ రూ. వేలు, లక్షలు ఖర్చు చేస్తూ గుళ్లు, గోపురాలు ప్రదక్షణాలు చేస్తూ పుణ్యం మూటకట్టు కోవాలని ఎంతో మంది చేస్తోన్న ప్రయ త్నాలు కేవలం బూటకమేనని అంటారు కొంత మంది. కాని యువ కవి ముసులూరు నారాయణ అమ్మని ప్రేమించటం గొప్ప వరమని అదే గొప్ప సమాజ సేవని అంతకు మించిన దైవత్వం లేదని తన కవితా సంపుటి ప్రధాన ఉద్దేశాన్ని వెలువరించారు. అమ్మా, నాన్నలను, ఇంట్లో వృద్ధులను ప్రేమించి వారికి సకల పరిచర్యలు చసినట్టయితే అదే గొప్ప దైవ కార్యమంటారు. అందుకనే వీరు కవితా సంపుటికి మాతృదేవోభవ అని పేరు పెట్టారు. దొరవారిసత్రం మండలం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఈయన గొప్ప సాహిత్య అభిలాషి. కవిత్వం రాయటం, ఆస్వాదించటం, ప్రకృతి ఆరాధన ఈయన ప్రవృత్తి. ఆ దిశగానే వీరు రచించిన తొలి కవితా సంపుటి మాతృదేవోభవను మాతృమూర్తికే అంకితం చేశారు. 88 పేజీలు ఉన్న ఈ కవితా సంపుటిలో 50 కవితలు వివిధ అంశాలతో పూమాలగా అందించారు. చూడగలిగిన మనసు ఉంటే అణువణువులోనూ కవిత్వం కనిపిస్తుంది. జగమంతా కవితా మాయమే అంటూ తన అనుభూతులు, ఆలోచన లకు చక్కని అక్షర



రూపం ఇచ్చారు. శిశువు జననం కోసం తల్లిపడే కష్టాల నుంచి నాన్నకు నాన్నగా మారి అవసరాలు తీర్చే యువకుడి వరకు కవిత్వం అందించారు. వీరి కవిత్వంలో ప్రకృతిని ఆరాధించటమే కాకుండా మనసు, హృదయం, అమ్మానాన్న విలువలు, నీతి, నిజాయితీ అనే అంశాలపై దాదాపు 50 కవితలు శర వేగంగా చదివిస్తాయి. కవిత్వానికి అవసరమైన పరిపక్వత, భాష, వస్తువు అన్ని సమపాళ్లలో ఉండడంతో తొలి సంపుటి అయిన వీరి కవిత్వం పఠితులను చదివింప చేస్తూ అలరిస్తుంది. ఆలోచింప చేస్తుంది. మంచి కవిత్వం చదివామన్న పాఠకుల ఊపిరి చల్లబరుస్తుంది. అలాంటి కవిత్వం ఆస్వాదించాలంటే మాతృదేవోభవ ను చదవాల్సిందే. రూ. 60 ధర ఉన్న ఈ సంపుటి కావాలంటే కవి నెం.9492934826 ను సంప్రదించి పొందవచ్చు.

ఉద్యోగపర్వం

ఉపాధ్యాయులందరికీ పదోన్నతి కల్పించాలి

● యూ.ప్రసాద్, ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి



"జిల్లాలోని అన్ని క్యేడర్లలో ఉన్న ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు ఇచ్చి తద్వారా ఏర్పడిన ఖాళీలను డీఈవో పూల్ ఉన్న టీచర్స్ ద్వారా భర్తీ చేయాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలకు వెంటనే విద్యావలంటీర్లను నియమించాలి. ఏకీకృత సర్వీసు రూల్స్‌ను అమలు చేయాలి. డీఈవో పూల్‌లోని టీచర్స్‌ను బోధనేతర పనులకు వినియోగించరాదు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలి."

- వింజమూరు



ఒకే రోజు శ్రావణ సోమవారం, అమావాస్య, సూర్యగ్రహణం

● మేళ్లచెరువు శివకుమార్‌శర్మ, శివాలయం ప్రధానఅర్చకుడు, ఆత్మకూరు



"శ్రావణ సోమవారం, సూర్యగ్రహణం, అమావాస్య, ఒకే రోజు రావడం అరుదు. ఈ రోజున శివుడికి అభిషేకం చేయడం ద్వారా పాపాలు హరించుకుపోతాయి. ఈ అమావాస్యను సోమావతి అమా వాస్య అంటారు. ఈ రోజు మహాశివరాత్రి కంటే ఉత్తమమైనదని, నవగ్రహాలు, సప్తరుషులు, ముక్కోటి దేవతలు ఎదురు చూస్తారని, ప్రతీతి. ఈ నేపథ్యంలో శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. "

- ఆత్మకూరు



ప్లాట్లు కొనబడును
కొత్తూరు వద్దగల వసుధ, విజయలక్ష్మి, పోలీస్ కాలనీ మరియు ఇస్కాన్ సిటి కావేరి, కొండాయపాళెం ప్రాంతంలోని కనుపర్తిపాడు వసుధ, విజయలక్ష్మి, ఆర్.కె., పడారుపల్లిలోని అన్ని లేఅవుట్ లోని ప్లాట్లు కొనబడును. సంప్ర: 9989063239.
AJR - 399547

PLOT FOR SALE
ఆత్మకూరు బస్టాండ్ నుండి 10 కి.మీ.లో కొడవలూరు మం.లో హైస్కూల్, ఇళ్ళ ప్రక్కనే ఇళ్ళు నిర్మించుటకు అన్ని సౌకర్యాలతో ప్లాట్ కే. 2,50వేలు స్పాట్ రిజిస్ట్రేషన్‌తో Bangkok Trip Free. సం.ప్ర.:88868 88843.
AJR-399548

PLOT FOR SALE
90వేలకే ప్లాట్. ఇంటర్నేషనల్ స్టేడియం, నగరవనం, ఇండస్ట్రీయల్ పార్క్ అతి దగ్గరగా ప్లాట్స్ కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ & ఫ్రీ. EMI సౌకర్యం, ఈ నెల ఆఖరు వరకు మాత్రమే. సం.ప్ర.:9491502699.
AJR-399539

PLOT FOR SALE
అంకణం 35,000/-లకే నెల్లూరు కార్పొరేషన్‌లో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు 20 అడుగులలో త్రాగునీరు, తారు రోడ్లు కలిగిన DTCP ప్లాట్లు 75% బ్యాంక్‌లోనుతో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక రాయితీ కలదు. సం.ప్ర. 9966737316.
AJR -399652

PLOT FOR SALE
శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మన నెల్లూరు సిటీలో, విక్రమ సింహపురి యూనివర్సిటీకి, NH5 కి దగ్గరగా మరియు సింహపురి, నారాయణ హాస్పిటల్‌కి చేరువలో ఇల్లు మధ్యలో 25 అం.ల ప్లాట్లు కలవు.. సం.ప్ర.:90146 84958.
AJR-386439

HOUSE FOR SALE
★ 2 B/R East Facing New 2 Deluxe Houses 15.5 Ank Site, 14 Ank Mini byepass, Vedayapalem, Nellore, Contact - 9032887292 AJH-2891

సర్వీసెస్

పశువుల దానా
➻ అత్యధిక పాల దిగుబడి కోసం, చేపలు త్వరగా పెరుగుదల కోసం, హై ప్రోటీన్, హై ఫ్యాట్ కలిగిన రాఘవేంద్ర ఆయిల్ & ఆగ్రో ప్రొడక్ట్స్, చేబ్రోలు, గుంటూరు జిల్లా వారి ప్రత్తిగింజల చెక్కనే వాడండి. ఫోన్ : 9246524659
AJG-400671

పుట్టగొడుగుల పెంపకం (ఫ్రెష్ మష్రూమ్స్ డీలర్ షిప్)
➻ పుట్టగొడుగుల పెంపకం ద్వారా ఇంట్లో గంట పనిచేస్తూ 10,000/- ఆపై ఆదాయం. శిక్షణ ఇచ్చి పుట్టగొడుగులను మేము కొంటాము. మష్రూమ్స్ విత్తనాలు (స్పాన్) లభించును. ఫంక్షన్లకు, శుభకార్యాలకు ఫ్రెష్ మష్రూమ్స్ సప్లయ్ చేయబడును. 9966158007
AJA-397517

PLOT FOR SALE
25% డిస్కౌంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ డాక్టర్స్, ఆఫీసర్స్‌కు మాత్రమే. NH5 మెయిన్ రోడ్డుకు ఫాంహౌస్‌లకు, స్కూల్స్, ఇళ్ళకు అనువైన ప్లాట్స్ NUDA స్పాట్ రి. తో కలవు. సం.ప్ర.:83095 88817.
AJR-399545

PLOT FOR SALE
ఆత్మకూరు బస్టాండ్ నుండి 6 కి.మీ దూరంలో 4 రోడ్ల జంక్షన్‌కు, నరుకూరు సెంటర్ గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్ అనుకూలమైన ధరలో లభించును. 80% బ్యాంకు లోన్ . సం.ప్ర. సెల్ : 80086 15946.
AJR-399541

BUSSINESS OFFER
కేవలం రూ.2లక్షలు పెట్టుబడితో నెలకు 12 వేలు నుండి 20 వేలు ఇన్‌కం పొందుతూ 1సం.లో 10లక్షలు సంపాదించు కొనే సువర్ణావకాశం. Age : 25 to 35 Qul: డిగ్రీ. మొదటి 100 మందికి మాత్రమే 2లక్షలు పెట్టుబడి పెట్టగలవారు మాత్రమే కాల్ చేయండి. సం.ప్ర.:70977 40099.
AJR-386142

క్యాండిల్స్
శ్రీనివాస క్యాండిల్స్ వారి అచ్చులు, మైనం లభించును. రోజుకు 700/- వరకు సంపాదించుకొనె అవకాశము కలదు. కోవూరు. సెల్: 79971 35959.
AJR-386440

బంగారు కొనబడును
బ్యాంకు, ఫైనాన్స్ కంపెనీలలో కుదువ పెట్టిన బంగారం విడిపించి కొనబడును. గ్రా॥ ధర రూ. 2,900/- వివరాలకు సంప్రదించండి : 97003 12403.
AJT - 5200

GOLD FINANCE
☞ బంగారం బ్యాంకులలో, ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. సెల్ : 81421 30517
AJB-385950

LOANS
★ DHILLON HERE PURCHASE PVT. LTD. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (R.O.C. & RBI అప్రూవ్డ్) ద్వారా అన్ని రకముల లోన్స్ తక్కువ వడ్డీతో పొందగలరు. బ్యాంక్ రిజక్ట్ చేసిన / సివిల్ ప్రాబ్లమ్స్ వారికి కూడా లోన్స్ ఇవ్వబడును. Ph: 7087000606 AJH-281

SPOT ADMISSIONS
University Campus regular courses. B.Tech (Mining & Cement Technology), D-Pharmacy, LLB, Bed, Med, Bped, Mped, M.A. Edu., M.Phil, Phd, Agricultural in Diploma, BSC, MSC. Contact Maruthi Academy, Cell : TPT- 90320 30146/147, NLR- 90320 30145/147.
AJT - 393259

BUSINESS OFFER
✶ గ్లోబల్ కంపెనీలో పనిచేయుటకు మీ ఏరియాలో ఉంటు వారం వారం ఫుల్ టైం, ఆఫ్ టైం చేసి అధిక ఆదాయం సంపాదించే సువర్ణావకాశం అందరూ అర్హులు సం.ప్ర: 9705847111, 9705843111
AJM -393667

కళ్యాణమస్తు మ్యారేజ్ బ్యూరో
యాదవ కులస్తుల 1వ, 2వ, లేట్ మ్యారేజ్ సంబంధాలకై సంప్రఇంచండి: దేగా సునీల్‌కుమార్ యాదవ్. వాట్సాప్ : 99486 17156.
AJR - 399540

శ్రీ చెంగాళమ్మతల్లి జ్యోతిష్యాలయం
ప్రేమ, పెళ్ళి, చదువు, ఉద్యోగం, వ్యాపారం, కుటుంబం, ఆరోగ్యం, రాజకీయ సమస్యలు లక్ష్మి శాంతి, గృహశాంతి, నరఘోష వాస్తు దోషం ఎటువంటి సమస్యలకైనా ముఖం చూసి జ్యోతిష్యం చెప్పబడును. కొండాయపాళెం గేటు. సం.ప్ర : S లక్ష్మణరాజు 98494 75006.
AJR - 277349

టైలరింగ్
మీకు టైలరింగ్ వచ్చా! అయితే మీ ఇంటివద్దనే వుంటూ నెలకు 10,000/- నుంచి 20వేలు సంపాదించుకొనే అవకాశం కల్పిస్తుంది మా ఫ్యాక్టరి. సంప్ర : 9440640514, 0861-2330514.
AJR -386322

కావలెను
నెల్లూరులో ఆఫీసు నందు పని చేయుటకు స్త్రీ / పు. కావలెను. ఎటువంటి చదువు, అనుభవం, వయస్సు అవసరం లేదు. జీతం:10,000/-. సంప్ర:9502316019, 9502276048.
AJR -6861

WANTED
ప్రముఖ Govt. Reg. గల APEX కంపెనీ నందు బ్రాంచి మేనేజర్‌గా పర్మినెంట్‌గా పనిచేయుటకు 10th- డిగ్రీ P/F అయిన యువకులకు ఉచిత శిక్షణ. శిక్షణాకాలంలో 6500 స్టైఫండ్ + రూంఫ్రీ, తర్వాత మా సంస్థలోనే పర్మినెంట్ చేసి 18000 జీతం, సంప్ర: 9121379515.
AJC-397145

శ్రీ సమ్మక్క సారక్క జ్యోతిష్యాలయం
☞ జరిగింది, జరగబోయేది, జరగబోతుంది, ప్రేమ, కోర్టు, కుటుంబ ఏ సమస్యలు ఉన్న ముఖం చూసి జ్యోతిష్యం చెప్పబడును. సంప్ర. రాజు కోయదొర, సిరిమల్టీ ప్లెక్స్ ప్రక్కన, నెల్లూరు. సెల్ : 99599 23006
AJB-0008

మూలికా వైద్యం
☞ అంగస్థంబన లేకపోవడం, సెక్సులో ఎక్కువ సేపు చేయలేకపోవడం, అంగం లావుగా, ధృడంగా, బలంగా ఉండుటకు అద్భుతమైన వనమూలికా ఔషదం. వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చును. సెల్: 84650 56299
AJB-398702

సినిమాఛాన్స్
● 6 చిత్రాలు నిర్మించిన మా సంస్థ 7వ చిత్రం కొరకు నూతన నటీనటులు, క్యారక్టర్, ఆర్టిస్టులు, హీరో, హీరోయిన్, ఫ్రెండ్స్ కావలెను. ఇంట్రస్ట్ ఉన్నవారే కాల్ చేయండి ఫోన్: 7032399111 AJH-11866

పాఠకులకు సూచన:
క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు.
ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.
పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
- మేనేజర్

ఉపాధి హామీ పనుల్లో భారీ అవినీతి

● రూ.83,45,281 రికవరీకి ఆదేశం ● ప్రజావేదికలో వెల్లడి

సీతారామపురం: మండలంలో గత మార్చి 2016 నుంచి జూన్ 2017 వరకు సుమారు రూ.16.67 కోట్ల నిధులతో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో 14 గ్రామ పంచాయతీల్లో రూ.83,45,281 దుర్వినియోగమైనట్లు సామాజిక తనిఖీ బృందం నిర్ధారించింది. పనులకు సంబంధించిన రికార్డులు అప్పజెప్పనందుకుగాను, గతంలో ఈసీగా పని చేసి సస్పెన్షన్‌కు గురైన వెంకటేశ్వరరెడ్డి నుంచి రూ.25,06,690లు రికవరీ చేయాలని ఆదేశించారు. ప్రస్తుత ఈసీ, టీఏ, ఎఫ్ఏల నుంచి రూ.34,03,380లు, లబ్ధిదారుల నుంచి రూ.85,786లు, కూలీల నుంచి రూ.4,80,793లు, సప్లయర్స్ నుంచి రూ.11,07,462లు, ఫారెస్ట్ శాఖకు సంబంధించి రూ.14,77,000లు, ఇరిగేషన్‌కు సంబంధించి రూ.2.84 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు 42 పనులను తిరిగి పరిశీలించాలని స్పష్టం చేశారు. ఏపీడీ ఆరు, ఎంపీడీవో 102 మరుగుదొడ్లపై పునర్విచారణ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నాజర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ డీఈ శ్రీనివాసులరెడ్డి, విజయకుమార్, ఎస్ఆర్పీ నారాయణరావు, ఎంపీడీవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న క్షేత్ర సహాయకులు

మనిషిని సన్మార్గంలో పెట్టేదే సాహిత్యం

రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ గానుగపెంట హనుమంతరావు



సూళ్లూరుపేట : పెడదోవ పట్టిన మనిషిని సన్మార్గంలో నడిపే శక్తి సాహిత్యానికి ఉందని భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కడపకు చెందిన కవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. ఒక సాహితీ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం విచ్చేసిన ఆయన ఆదివారం ఆంధ్రజ్యోతితో కొద్దిసేపు ముచ్చటించారు. ఉత్త సాహిత్యం సమాజానికి ఎప్పుడూ మంచే చేస్తుందన్నారు. సమాజ రుగ్మతులపై కవులు, రచయితలు స్పందించి వాటిని నిర్మూలించే దిశగా రచనలు చేయాలన్నారు. సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయుల కాలంలో కవులకు, కళలకు, మన సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో ఆదరణ, పోషణ లభించిందన్నారు. నేడు కవులు శ్రమించి మేధస్సుతో రచించిన కావ్యాలు వెలుగు చూడాలంటే వారే వాటిని ముద్రించుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం సమాజానికి మంచి చేసే కవుల రచనలను గుర్తించి ముద్రించాలని హనుమంతరావు విజ్ఞప్తి చేశారు.

కవులు, కళలకు కాణాచి నెల్లూరు

నెల్లూరు కవులు, కళలలకు కాణాచి అని హనుమంతరావు పేర్కొన్నారు. తిక్కన మహాకవి, అమరజీవి పొట్టిశ్రీరాములు, దీపాల పిచ్చియ్యశాస్త్రి, మరుపూరు కోదండరామిరెడ్డి, ఆచార్య ఆత్రేయ, ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం, ఏసీ సుబ్బారెడ్డి, బెజవాడ గోపాల్‌రెడ్డి తదితర మహోన్నతుల పాదధూళిలో పునీతమైన ప్రాంతం నెల్లూరు అని కొనియాడారు. ఆచార్య ఆత్రేయ జన్మ స్థలమైన సూళ్లూరుపేట మండలంలో ఆయన శిలావిగ్రహాన్ని నెలకొల్పాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఎంతైనా ఉందన్నారు.

తెలుగుభాష పరిరక్షణకు ప్రతిన బూనాలి

ప్రతి తెలుగు బిడ్డా మాతృభాషను పూజించాలని, తర్వాతే అన్యభాషలు నేర్చుకోవాలని హనుమంతరావు అభిప్రాయపడ్డారు. భాషా ద్రోహంచేస్తే అది తల్లికి ద్రోహం చేసినట్లే నని చెప్పారు. ఈ నెల 29వ తేదీ గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా నిర్వహించే మా తృభాషా దినోత్సవం రోజైన తెలుగు రాష్ట్రాలలోని ప్రతి ఒక్కరూ తెలుగురక్షణకు ప్రతిన బూనాలని హనుమంతరావు కోరారు.

Ag.B.Sc., Nellore
- UGC Recognised University
Duration 4 years - Valid For Govt. Jobs,
9642310800, 7032266004



మీ చిన్నారులకు... చిరుకానుక...
జన్మదినం జరుపుకుంటున్న మీ చిన్నారులకు
ఆంధ్రజ్యోతి ద్వారా
జన్మదిన శుభాకాంక్షలు
తెలియజేయండి.



5% GST is Applicable on Bill Amount
4x3 స్క్వేర్ సె.మీ. కలర్ 10 సం॥రాల లోపు వయస్సు వారికి రూ 300/-
4x6 స్క్వేర్ సె.మీ. కలర్ 10 సం॥రాల లోపు వయస్సు వారికి రూ 500/-
వివరములకొరకు సంప్రదించండి
నెల్లూరు: 99854 11013 మోహన్: 9985420777 వెంకటయ్య: 9985404646 కిషోర్: 9985404780
వెంకటేశ్వర్లు: 9490853354 జాకీర్: 9985411434 (కావలి) శేఖర్: 9985491777 కిరణ్: 9985402921 (నాయుడుపేట)
వెంకటరావు: 9985921383 కిషోర్‌కుమార్: 998540 1179 భాస్కర్: 9985403920

కమాండ్ కంట్రోల్ భవనాన్ని పరిశీలించిన డీఐజీ

కావలి(క్రైం): కావలి ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ భవనాన్ని ఆదివారం సాయంత్రం డీఐజీ గోపాల్‌రావు పరిశీలించారు. నెల్లూరు నుంచి గుంటూరుకు వెళ్తూ మార్గ మధ్యంలో కావలిలో ఆగిన ఆయన కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. భవన నిర్మాణం అద్భుతంగా ఉందని స్థానిక అధికారులను ప్రశంసించారు. నాణ్యతాప్రమాణాలలో రాజీ పడవద్దని ఆయన అధికారులకు సూచించారు. త్వరలో భవన ప్రారంభోత్సవం చేస్తారని ఆయన తెలిపారు.

• ఇంటర్వ్యూ



వాహనచోదకుల వెంట ధ్రువీకరణలు తప్పనిసరి

ఒకటో పట్టణ ఎస్ఐ గుంజి అంకమ్మ

? : వాహనచోదకుల నుంచి అధికంగా అపరాధ రుసుము వసూలు చేస్తున్నారంటున్నారు.

! : వాహనచోదకులు వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణలు, డ్రైవింగ్ లైసెన్సు తమవద్ద ఉంచుకోవాలి. నిబంధనలు పాటించని వారి నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకు అపరాధ రుసుము వసూలు చేస్తున్నాం.

? : మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై తీసుకుంటున్న చర్యలేంటి.

! : కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నాం.

? : బంగారు బిస్కెట్ పేరుతో మోసం చేసిన ఘటనపై మీ స్పందన.

! : ఇటువంటి ఘటనలపై మహిళలు అవగాహన కలిగి అప్రమత్తతతో వ్యవహరించాలి.

? : పట్టణంలో శాంతి భద్రతల పరిస్థితి ఎలా ఉంది.

! : పటిష్టంగానే ఉంది. రాత్రి పూట నిఘా పెంచాం. దీంతో దొంగతనాలు కొంత మేరకు తగ్గుముఖం పట్టాయి.

? : జూదం నిర్వాహకులపై మీరు తీసుకుంటున్న చర్యలేంటి.

! : పట్టణంలో జూదం నిర్వాహకులను అదుపులోకి తీసుకొని పూచికత్తుపై వదలిపెట్టాం. నిరంతర నిఘా కొనసాగిస్తున్నాం.

- కావలి(క్రైం)

సినిమా గైడ్

కావలి

మానస : ఫిదా
లత ఏ/సీ : ఆనందో బ్రహ్మ
స్రవంతి: జయ జానకీ నాయకా
ఎస్వీ వెంకటేశ్వర నేనే రాజు నేనే మంత్రి

ఎన్ఐవోఎస్ పరీక్షలు

కావలిరూరల్: కావలి రూరల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఆదివారం ఎన్ఐవోఎస్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్) పరీక్షలు నిర్వహించారు. మండలంలో ఈ పరీక్షలకు 696 మందికి గాను జిల్లా నుంచి 663 మందికి ప్రశ్న పత్రాలు ఇచ్చి పరీక్షలు రాయించామని సాక్షర భారత్ మండల కో-ఆర్డినేటర్ ప్రభాకర్ తెలిపాడు. మండలంలోని ఆముదాలదిన్నె, మన్నంగిదిన్నెలో పరీక్షలు జరుగుతున్న విధానాన్ని స్టేట్ అబ్జర్వర్ అప్పలరాజు, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎంవీ నారాయణమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా వారి వెంట ఏపీవో వెంటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎన్ఎంయూ ఆవిర్భావ దినోత్సవం

కావలిటౌన్: ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆవిర్భావదినోత్సవం ఆదివారం స్థానిక డిపో ఆవరణలో జరిగింది.. ఎన్ఎంయూ కావలి డిపో కార్యదర్శి ఎస్‌కెమస్తాన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎన్ఎంయూ గౌరవ అధ్యక్షుడు అమరా వేదగిరి కేక్ కట్ చేసి కార్మిక నాయకులకు తినిపించారు. రాష్ట్ర కార్యదర్శి రమణరావు ఎన్ఎంయూ జెండా ఆవిష్కరించారు. అమరా వేదగిరి మాట్లాడుతూ 1967 లో పీ. రామ్మోహన్‌రావు ఎన్ఎంయూ వ్యవస్థాపించారని 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. కార్మికులందరు కుటుంబసభ్యులుగా కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఆర్టీసీ మనుగడను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఏఎన్ రావు, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎఎస్‌పీ కుమార్, గ్యారేజ్ కార్యదర్శి ఎస్‌కె కలాం, ఎస్‌కె మని, ఎస్‌కె వలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమరా వేదగిరి

అమరా సుబ్బారావు సత్కారం

ఆల్ఇండియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన అమరా సుబ్బారావును ఆదివారం అన్నపూర్ణ క్లాత్ మార్కెట్‌లో సత్కరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు బొట్లగుంట శ్రీహరినాయుడు, టీడీపీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దావులూరి దేవకుమార్‌ల ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో సుబ్బారావును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ వస్త్రవ్యాపారుల సమస్యల పరిష్కారంలో అమరా సుబ్బారావు చూపిన చొరవ అభినందనీయమన్నారు. పని చేసేవారికి పదవులు రావడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు అమరా వేదగిరి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కటకం రాము, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వెల్లూరి కిరణ్, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డి వెంకటరావు, ఖమర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి పరామర్శ



బాషాను పరామర్శిస్తున్న మాల్యాద్రినాయుడు

కావలిటౌన్: కావలి వెంగళరావునగర్‌కు చెందిన షేక్ జిలాని ఇటీవల ప్రమాదంలో అంగవైకల్యం చెందారు. ఆదివారం దివ్యాంగుల సేవా సంస్థ అధ్యక్షుడు టీసీ మాల్యాద్రి నాయుడు తదితరులు జిలాని బాషను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరుపున అన్ని విధాల ఆదుకుంటామని పించన్ ఇప్పిస్తామని నెల్లూరుకు తీసుకుని వెళ్లి సదరన్ సర్టిఫికెట్ మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సలహాదారుడు సయ్యద్ మనీబాష, ఎస్‌కె జమీర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా బాట ఏర్పాటు

కావలిరూరల్: కావలి రూరల్ మండలం కొత్తపల్లి దళితవాడ సమీపంలోని సిరిపురం డొంక ఆక్రమణలు రైతులు తొలగించారు. ఆదివారం పొలాలోకి బాట ఏర్పాటు చేసుకున్నారు. ఆక్రమణల తొలగింపు విషయమై రెవెన్యూ అధికారులకు విన్నవించుకోవడంతో అధికారులు బాటకు హద్దులు ఏర్పాటు చేశారని రైతులు తెలిపారు. దీంతో రైతులు ఎకరాకు రూ. 700 చొప్పున చందాలు వేసుకొని పొలాలోకి బాట ఏర్పాటుకు శ్రీకారం చుట్టి అందరికి ఆదర్శనీయమయ్యారు. ఈ కార్యక్రమంలో రైతులు పొంగుళూరి శ్రీనివాసులు, యర్రా మాధవరావు, మాలి, చెంచు నాయుడు, చినకొండయ్య, సిద్దయ్య, పెద్దకొండయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసుకున్న బాటవద్ద రైతులు

చవితి ఏర్పాట్లలో యువత

కావలిరూరల్: కావలి రూరల్ మండలంలోని గ్రామాల్లో వినాయక చవితికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నెల 25న జరుగనున్న వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అనేక గ్రామాల్లో యువత తాత్కాలిక మండపాల ఏర్పాటులో తలమునకలయ్యారు. పెద్దలకు పోటీగా చిన్నారులు చిన్నచిన్న మండపాలు ఏర్పాటు చేసుకుంటూ స్వామి భక్తిని చాటుకుంటున్నారు.

కలిగిరి: ఈనెల 25న జరగనున్న వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వ్యాపారులు వినాయక ప్రతిమలను మండలంలో ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వినాయక విగ్రహాల వద్ద తల్లిదండ్రులు, సోదరులతో చిన్నారులు సందడి చేయడం కనిపించింది. ఒక్కొక్క విగ్రహం ఎత్తు, సైజును బట్టి నాలుగువేల రూపాయల నుంచి రూ.20 వేలవరకు ఉన్నట్లు వ్యాపారులు తెలిపారు. చుట్టుప్రక్కల గ్రామాల నుండి వచ్చిన యువకులు విగ్రహ విక్రయదారుల నుంచి తమకు అవసరమైన విగ్రహాలను ఎన్నుకోవడంలో నిమగ్నమయ్యారు. తమకు నచ్చిన విగ్రహానికి కొంతమొత్తం ముందుగానే చెల్లించి వినాయకచవితి పర్వదినాన తమ గ్రామానికి తరలిస్తామని చెబుతున్నారు. విద్యుత్ దీపాలు, పూల అలంకరణలో పండపాలు తీర్చి దిద్దుతామని వారు తెలిపారు.



కావలి వైకుంఠపురంలో తాత్కాలిక మండపం ఏర్పాటులో యువత



కలిగిరిలో విగ్రహాన్ని ఎంపిక చేస్తున్న చిన్నారులు

ఎల్ఎల్ఆర్ మేళాకు అనూహ్య స్పందన

కావలి(క్రైం): రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం కావలిలో నిర్వహించిన ఆటోడ్రైవర్ల బాడ్జీ ఎల్ఎల్ఆర్ మేళాకు అనూహ్య స్పందన వచ్చిందని కావలి మోటారు వాహనాల తనిఖీ అధికారి కె.మురళీ మోహన్ తెలిపారు. ఈ మేళాలో 285 మంది ఆటో డ్రైవర్లు విద్యార్హతతో సంబంధం లేకుండా బాడ్జీ నెంబరు కోసం ఎల్ఎల్ఆర్ పొందారన్నారు. ఆదివారం మేళాలో సాంకేతిక కారణాల వలన ఎల్ఎల్ఆర్ పొందని వారికి సోమవారం ఇస్తామన్నారు. వాహనచోదకులందరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ జీ భాస్కర్ రావు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు ఎల్ఎల్ఆర్ అందిస్తున్న ఎంవీఐ మురళీమోహన్

ఇబ్బంది లేకుండా బొట్లగుంట అభివృద్ధి చేపట్టాలి



బొట్లగుంట అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్ సీతారావమ్మ తదితరులు

కావలి: కావలి 25వ వార్డులో సుమారు కోటి నిధులతో నిర్మించనున్న బొట్లగుంటను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేపట్టాలని కౌన్సిలర్ సీతారావమ్మ పేర్కొన్నారు. బొట్లగుంట అభివృద్ధి విషయం గతంలో కావలి ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి అనేక పర్యాయాలు తీసుకెళ్లగా ఎట్టకేలకు అధికారులు స్పందించడం అభినందనీయమన్నారు. బొట్లగుంట బ్యూటిఫికేషన్ చేస్తు దాని చుట్టూ వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేసి గుంటలో నీరు నింపితే ఆ ప్రాంతంలో భూగర్భ జలమట్టం పెంపొందడమే కాకుండా పర్యాటక కేంద్రంగా ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నెల్లూరు వెంకటేశ్వర్లరెడ్డి, సూరె సుబ్బారెడ్డి, షైరసూల్ నాయుడు, వెంకటేశ్వరనాయుడు, కాశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కలిగిరి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 23న ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో కే నర్మద తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు రేషను కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నకళ్లను తమ వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. ధ్రువీకరణల పరిశీలన, ఇంటర్వ్యూ అనంతరం లబ్ధిదారుల ఎంపిక జాబితా తయారు చేస్తారన్నారు.

ఘనంగా రాజీవ్ జయంతి

జలదంకి: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జలదంకిలో నిర్వహించారు. జలదంకి చల్లాయానాదుల కాలనీలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వీ శివశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ పేదలకోసం పనిచేసే పార్టీ అన్నారు. రాజీవ్‌గాంధీ భారత ప్రధానిగా విశేషసేవలు అందించారని ప్రస్తుతం అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ ఆయన కాలంలోనే రూపుదిద్దుకున్నదేనన్నారు. ప్రస్తుతం ఆయన మన మధ్య లేకున్నా జయంతిని జరుపుకోవడం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మకు విశేష పూజలు

అల్లూరు: శ్రావణమాసం చివరి రోజులు కావడంతో మండలంలోని ఇస్కపల్లిలో వెలసిన గంగమ్మకు ఆదివారం భక్తతలు విశేష పూజలు చేశారు. బీద గిరిధర్ కుటుంబీకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లలిత సహస్రనామం, హోమాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు 200 మంది మహిళలు సామూహిక ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

కొండాపురం: మండలంలోని సాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెంలో వెలసిన పోలేరమ్మతల్లికి గ్రామస్థులు ఆదివారం పొంగళ్లు పెట్టారు. వెల్లటూరివారిపాలెం, ఇస్కపాలెం, మక్కెనవారిపాలెం గ్రామాలు ఉమ్మడిగా పోలేరమ్మతల్లి గుడి నిర్మించుకున్నారు. రెండువారాలుగా భక్తిశ్రద్ధలతో మూడు గ్రామాల ప్రజలు అమ్మవారికి చల్దీ నివేదించారు. మూడోవారం మహిళలు పొంగళ్లు వండి అమ్మవారికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మకు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకుంటే దుష్టశక్తులు గ్రామంలో ప్రవేశించవన్నది భక్తుల నమ్మకం.

నేడు గణితావధానం

కొండాపురం: స్థానిక ఆదర్శపాఠశాలలో నేడు గణితావధానం ఉంటుందని ప్రిన్సిపల్ శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి నిష్ణాతులయిన గణిత ఉపాధ్యాయుల హాజరవుతారని ఆయన అన్నారు. అభ్యసనకృత్యాలపై ఉపాధ్యాయులకు వివరిస్తారన్నారు. మండల పరిధిలోని అన్నిపాఠశాలల గణిత ఉపాధ్యాయులు హాజరుకావాలనిఆయన కోరారు.

వెలగని వీధి దీపాలు

కావలిరూరల్: కావలి రూరల్ మండలం సర్వాయపాలెం పంచాయతీ పెద దిన్నెపాలెం కొత్తూరులో వీధి దీపాలు వెలగక 50 కుటుంబాలు అంధకారంలో మగ్గుతున్నారు. సంక్రాంతికి వేసిన దీపాలు పగలు రాత్రి వెలిగి కాలిపోయాయి. చుట్టూ పొలాలు కావడంతో విషసర్పాల బారిన పడతామని రాత్రిళ్లు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడంలేదు.

వానలు కురవ్వు. అరక సాగదు. పొలం పనులకు పిలిచేవోడే లేదు. పట్టెడన్నం దొరకని బతుకు భారమై వలస బాట పట్టిస్తోంది. కల్లు గంజి తాగుదామని ఉపాధి కూలికి పోతే పనిచేసినా పైసా రాలదాయె.. ఏం తినాల ఎట్ల బతకాల అని కూలీలు వాపోతున్నారు.

– కావలి రూరల్

'ఉపాధి' కష్టాలు

- నగదు చెల్లింపులో జాప్యం
- కసురుకుంటున్న బ్యాంకర్లు
- ఆందోళనలో కూలీలు
- పట్టించుకునేవారు కరువు



పెదపట్టపుపాలెంలో పనిచేస్తున్న కూలీలు



నగదు కోసం ఉపాధి కూలీల పడిగాపులు (ఫైల్)

కావలి రూరల్ మండలం 18 పంచాయతీల్లోని 73 గ్రామాల ప్రజల్లో 16 వేల మంది ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు పొంది ఉన్నారు. వీరిలో 4,606 మంది ఉపాధి పనులు చేస్తున్నారు. వీరికి నగదు సకాలంలో అందక నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. చేసిన పనికి చేతికి డబ్బులు అందడం లేదని కూలీలు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తమను గాలికొదిలేశారని గగ్గోలు పెడుతున్నారు.

పేస్లిప్‌ల బదులు పే ఆర్డర్లు

ఇంతకు ముందు ఉపాధి పని చేసిన కూలీకి వారానికి ఒకసారి పే స్లిప్‌లు ఇస్తారు. ఆ సిప్‌లతో తపాలా కార్యాలయాల్లో కూలీ నగదు పొందేవారు. ప్రస్తుతం కొత్తగా గ్రూపు సభ్యుల మొత్తానికి పే ఆర్డర్లు ఇస్తు కూలీల బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేస్తున్నారు. అయితే కూలీలు ఇచ్చిన బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం సక్రమంగా జరిగిన వారికి వారివారి ఖాతాల్లో నగదు జమ అవుతోంది. ఆధార్ అనుసంధానం కాని కూలీల బ్యాంకు ఖాతాలలో నగదు జమ కావడంలేదు. అంతేగాకుండా గతంలో ఆధార్ అనుసంధానం చేసిన ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతోంది. నగదు ఏ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందో తెలియక కూలీలు కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అడిగేవాడు లేడని ఉపాధి కూలీలతో పనులు చేయిస్తూ వారికి సక్రమంగా నగదు అందేలా చూడాల్సిన క్షేత్ర సహాయకులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఐసీఐసీఐ బ్యాంకు సీఎస్‌పీతో నగదు చెల్లింపులలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కూలీలకు నగదు అందేలా చూడాల్సి ఉంది.

కాళ్లరిగేలా తిరుగుతున్నాం



రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు మావి. ఉపాధి పనికి పోతున్నాం. మూడువారాలైనా చేసిన పనికి నగదు ఇవ్వడం లేదు. రావాలసిన నగదు కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగనే సరిపోదోంది. ఇంత వరకు ఒక్క రూపాయ కూడ రాలేదు.

– కాకి రమణమ్మ, పూలదొరువు

పంచాయతీల్లోనే కూలి ఇవ్వాలి



పనులు మానుకొని బ్యాంకుల చుట్టూ తిరిగినా ఆటోలో చార్జీలు వదులుతున్నాయే తప్ప కూలి నగదు చేతికి రావడంలేదు. దీంతో పనిచేసి రోజుల తరబడి పస్తులుండాల్సి వస్తోంది. అధికారులు పంచాయతీ కార్యాలయాల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– పాలకీర్తి సుబ్బారావు, సిరిపురం

బ్యాంకర్లు కసురుకుంటున్నారు



గతంలోలాగా పోస్టాఫీసు ద్వారా నగదు చెల్లించాలి. చేసిన పనికి నగదు బ్యాంకుల్లో పడిందని అధికారులు చెబుతున్నారు. బ్యాంకుకు వెళ్లి అడిగితే కసురుకుంటున్నారు. అవహేళన చేస్తున్నారు. ఏ బ్యాంకులో జమైందో వెతుక్కోండి. మాకు తెలీదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు.

– రామయ్య, పాముగుంటపాలెం

ఆధార్ అనుసంధానం చేయిస్తున్నాం



కూలీల బ్యాంకు ఖాతాలలో నగదు జమ అయ్యేందుకు ఆధార్ అనుసంధానం చేయిస్తున్నాం. ఈ పని పూర్తయితే కూలీలకు నగదు చెల్లింపులో ఇక ముందు జాప్యం జరగదు. ఈ ప్రక్రియకు కూలీలు కూడా సహకరిస్తే తొందరగా పూర్తి చేస్తాం.

– శ్యామల, ఉపాధి హామీ ఏపీవో, కావలి

బస్టాండు ఆవరణ బురదమయం

జలదంకి: జలదంకి ఆర్టీసీ బస్టాండు నాటి టీడీపీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి రూ.5లక్షలతో నిర్మింపజేయించారు. ఆర్టీసీ యాజమాన్యం ఇటీవల దీని పర్యవేక్షణ మరిచింది. బస్టాండులో ప్రయాణికులు కూర్చునే వీలులేకుండా పోయింది. మరుగుదొడ్ల నిర్వహణ లేదు. బస్టాండు ఆవరణ అధ్వానంగా తయారైంది. ఆవరణంతా గుంతలుపడి వర్షం నీరు అందులో చేరి బురదమయమైంది. ఆర్టీసీ బస్సులు ఆవరణలోకి రాకుండా రోడ్డుపైనే నిలపడంతో ప్రయాణికులు బస్సులకోసం అక్కడే నిరీక్షించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితులతో జలదంకిలో బస్టాండు ఉన్నా లేనట్టేనని మండల ప్రజలు ఆగ్రహిస్తున్నారు.



జలదంకి బస్టాండ్ ఆవరణలో బురద గుంతలు

తప్పిన ప్రమాదం

బిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లి జాతీయ రహదారిపై నెల్లూరు నుంచి కావలివెళ్తున్న కారు అదుపుతప్పి జాతీయ రహదారి నుంచి 30 అడుగుల దూరానికి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఎన్ రాజు, ప్రేమస్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటనా స్థలానికి 108 సిబ్బంది చేరుకొని బాధితులను కావలికి తరలించారు.



బాధితులను తరలిస్తున్న 108 సిబ్బంది

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ జయప్రకాష్ తదితరులు



ఎన్ఐవోఎస్ పరీక్ష కేంద్రాల తనిఖీ

దగదర్తి: మండలంలో వివిధ పంచాయతీల్లో ఆదివారం వయోజన విద్యా కేంద్రాల్లో ఎన్ఐవోఎస్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాల్లో ఎస్‌ఆర్‌సీ నుంచి వచ్చిన అప్పలరాజు, డిప్యూటీ డైరెక్టర్ నారాయణమ్మ, తహసీల్దార్ జయప్రకాష్, ఏపీవో దానియల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, మండల కో-ఆర్డినేటర్ రాము, గ్రామ కో-ఆర్డినేటర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

బిట్రగుంట: బిట్రగుంట సెక్షన్ పరిధిలోని అల్లూరు-బిట్రగుంట స్టేషన్‌ల ఎగువమార్గంలో రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించామని జీఆర్‌పీ పోలీసులు ఆదివారం తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించామన్నారు. బోగోలు అరవపాలెంకు చెందిన పీహెచ్ చార్లెస్‌గా తెలిసిందని, బహిర్భూమికి వెళ్లి వస్తూ గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో మృతి చెంది ఉంటాడని జీఆర్‌పీ ఎస్‌ఐ భాస్కర్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి..?

● భర్తే హంతకుడని బంధువుల ఆందోళన



శాంతికుమారి మృతదేహం

నెల్లూరు (క్రైం) : నెల్లూరుకు చెందిన శాంతి కుమారి(25) అనే వివాహిత హైదరాబాద్‌లో అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. భర్తే ఆమెను హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని శాంతి బంధువులు ఆరోపిస్తుండగా ఈ వ్యవహారంపై నెల్లూరు ఐదో నగర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుచ్చిమండలం నాగాయగుంట పంచాయతీ అనంత నారాయణపురం గ్రామానికి చెందిన శాంతికుమారి (25)కి నెల్లూరు విక్రమ్ నగర్‌కు చెందిన మహేష్‌తో ఈ ఏడాది మార్చి 1వతేదీన పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. పెళ్లి సందర్భంగా మూడు సవర్ల బంగారం, ఖర్చులకు రూ.2లక్షలు, సారె కింద రూ.40వేలు ఇచ్చారు. పెళ్లైన నెలరోజులకే శాంతికి అత్తింటి వేధింపులు ప్రారంభమయ్యాయి. మహేష్ తల్లిదండ్రులు, సోదరి కలిసి ఆమెను సూటిపోటి మాటలతో వేధించే వారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు బ్యాంకులో మార్కెటింగ్ విభాగంలో పనిచేసే మహేష్ అక్కడి చందానగర్‌లోని సుభద్ర నిలయం అపార్ట్‌మెంట్‌లోకి కాపురాన్ని మార్చాడు. కొన్ని రోజులు సక్రమంగానే కాపురం చేసిన మహేష్ ఆ తర్వాత తన కుటుంబ సభ్యుల మాటలు విని భార్యని వేధించడం ప్రారంభించాడు. ఈ విషయాన్ని శాంతి పలుమార్లు పుట్టింటి వారికి తెలియచేసింది. వారు సర్దుకుపోవాలని చెప్పడంతో తన బాధను దిగమింగుకుని కాపురం చేసేది. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారు జామున శాంతికుమారి మృతదేహాన్ని తీసుకుని ఆమె భర్త మహేష్ అంబులెన్స్‌లో నెల్లూరులోని తన ఇంటికి వచ్చాడు. ఈ విషయాన్ని శాంతి పుట్టింటి వారికి తెలియజేయలేదు. చుట్టుపక్కల వారు ఈ సమాచారాన్ని ఆమె బంధువులకు చేరవేశారు. దీంతో శాంతిని కన్నవారు విక్రమ్ నగర్‌కు చేరుకుని రోదించారు. అంబులెన్స్ డ్రైవర్‌ను ప్రశ్నించగా శాంతికుమారి గుండెపోటుతో మరణించిందని చెప్పడంతో మృతదేహాన్ని నెల్లూరుకు తీసుకు వచ్చినట్లు తెలిపాడు. దీంతో శాంతి బంధువులు మహేష్‌ను నిలదీశారు. శనివారం మధ్యాహ్నం తాను ఇంటికి వచ్చేసరికి ఉరివేసుకుని మృతి చెందిందని తెలిపాడు. అయితే, శాంతిని ఆమె భర్తే హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడంటూ మహేష్ కుటుంబంపై దాడికి యత్నించారు. చుట్టుపక్కల వారు సర్ది చెప్పడంతో శాంతి సోదరుడు వల్లెపు బీమారావు నెల్లూరు ఐదో నగర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహేష్‌కు గతంలోనే పెళ్లై భార్యకు విడాకులు ఇచ్చి ఉన్నాడని, ఇప్పుడు తన సోదరిని హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. సీఐ మంగారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న పందుల కాల్చివేత

కావలి(క్రైం): కావలిలో పందుల కాల్చివేత ఆదివారం కొనసాగింది. 60 పందులను కాల్చివేశారు. దీంతో ఇప్పటి వరకు కాల్చివేసిన పందుల సంఖ్య 91కి చేరింది. పెంపకదారులనుంచి తీవ్రవ్యతిరేకత ఎదురవుతున్నప్పటికి మున్సిపల్ కమిషనర్ అన్నవరపు వెంకటేశ్వర్లు కాల్చివేతను కొనసాగిస్తున్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

పందుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బీబీజాన్‌ను ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అలేఖ్య, కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు, డీఈ మదర్‌సాఆలీ పరామర్శించి 15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుబ్బారావు, మేనేజర్ సత్యనారాయణ, టీపీఎస్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నో పర్మిషన్..

● జూనియర్ కళాశాలల హాస్టళ్లకు లేని అనుమతులు
● ఇంటర్‌బోర్డు నోటీసులు
● వివరణ ఇచ్చిన యాజమాన్యాలు
● స్పష్టత ఇవ్వని అధికారులు
● తొలగించాలంటే పరిస్థితి ఏంటి?

నెల్లూరు (క్యాంపస్) : మన జిల్లా విద్యా బోధనకు పెట్టింది పేరు. అందుకే ఇతర జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు జిల్లాలోని కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతారు. ప్రధానంగా ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఎక్కువ మంది చేరతారు. వీరంతా కూడా ఆ కళాశాలలో ఉన్న హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటారు. అయితే జిల్లాలో ఉన్న జూనియర్ కళాశాల హాస్టళ్లకు 75 శాతం అనుమతులు లేవు.

● అనుమతులు లేకుండానే..

ఇంటర్ బోర్డు నుంచి హాస్టళ్లకు అనుమతులు తీసుకోకుండానే జిల్లాలోని పలు జూనియర్ కళాశాలలు హాస్టళ్లను ఏర్పాటు చేశాయి. జిల్లాలో 35కు పైగా జూనియర్ కళాశాలల్లో హాస్టళ్లు ఉండగా, 26 కళాశాలలకు చెందిన హాస్టళ్లకు అనుమతులు లేవు. మే నెలలోనే ఇంటర్‌బోర్డు అనుమతులు లేకుండా హాస్టళ్లు నడుపుతున్నా కళాశాలల వివరాలను సేకరించి నోటీసులు పంపింది. ఆ కళాశాలల యాజమాన్యాలు ఇందుకు వివరణ పంపాయి. కానీ ఇంటర్ బోర్డు నుంచి ఇప్పటి వరకు ఎటువంటి హామీ రాలేదు. అయినా ఈ 26 కళాశాలలు ఏమాత్రం అనుమతులు లేకుండానే హాస్టళ్లను యథావిధిగా కొనసాగిస్తున్నాయి.

● అనుమతి ఇవ్వాలంటే..

జూనియర్ కళాశాలల్లో హాస్టళ్లకు ఇంటర్ బోర్డు అనుమతులు ఇవ్వాలంటే నిర్ణీత ప్రదేశం, ఆట స్థలం, ఫైర్, విశాలమైన గదులు, మరుగుదొడ్లు.. ఇలా ఎన్నో నిబంధనలు పాటించాల్సి ఉంది. అయితే ఈ నిబంధనలన్నీ సక్రమంగా పాటించలేమని తెలుసుకున్న ప్రైవేటు జూనియర్ కళాశాలలు అనుమతులకు దరఖాస్తు చేసుకోకుండానే అనధికారికంగా హాస్టళ్లను నిర్వహిస్తున్నాయి. కళాశాల ఫీజులో పోల్చుకుంటే హాస్టల్ ఫీజు రెండింతలకు పైగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ హాస్టళ్లలోనూ ఇరుకు గదులు, పదుల సంఖ్యలో విద్యార్థులకు ఒకటి, రెండు మరుగుదొడ్లు, ఇలా వసతులు ఏమాత్రం ఉండవంటూ తల్లిదండ్రులు కళాశాల యాజమాన్యాలతో వాగ్వివాదాలకు దిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

● అనుమతులు ఇవ్వకుంటే..

ఒకవేళ హాస్టళ్లకు అనుమతులు ఇచ్చేది లేదని చెబితే ప్రస్తుతం హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్థకం. ఈ 26 హాస్టళ్లలో 20 వరకు నగరంలోనే ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి చదువు కోసం నెల్లూరు వచ్చిన ఈ విద్యార్థులు హాస్టళ్లకు అనుమతి రాకుంటే అద్దెకు గదులు తీసుకుని చదడమో లేక టీసీలు తీసుకుని ఇళ్లకు వెళ్లడమో చేయాలి.

● నిద్రావస్థలో అధికారులు

ఏళ్ల తరబడి అనుమతులు లేకుండానే ప్రైవేటు జూనియర్ కళాశాలలు హాస్టళ్లు నిర్వహిస్తున్నా, దీనిపై అధికారులు ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. బోర్డు నోటీసులు పంపిన తర్వాత మళ్లీ అనుమతులు ఇచ్చామంటూ ప్రకటన ఇవ్వకపోయినా ప్రైవేటు కళాశాలల యాజమాన్యం యథావిధిగా హాస్టళ్లను నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బోర్డు నిర్ణయం మేరకు నడుచుకుంటాం



జిల్లాలో హాస్టళ్లకు అనుమతులు లేని కళాశాలల వివరాలను ఇంటర్ బోర్డుకు పంపాం. బోర్డు వారు ఆ కళాశాలలకు నోటీసులు అందజేశారు. దానిపై ఆ కళాశాలలు వివరణ ఇచ్చాయి. అయినా బోర్డు నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. బోర్డు ఆదేశాల మేరకు మేం నడుచుకుంటాం.

- ఆర్ఐవో బాబూజాకబ్

● ఎంతటివారైనా ఉపేక్షించవద్దు
● బెట్టింగ్ కేసుల్లో పనితీరు భేష్ !
● టెక్నాలజీని సద్వినియోగం చేసుకోండి
● డీఐజీ గోపాలరావు

నేరస్థులపై కఠినంగా వ్యవహరించండి

నెల్లూరు (క్రైం) : నేరస్థులపై కఠినంగా వ్యవహరించండి, వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించవద్దంటూ గుంటూరు రేంజ్ డీఐజీ కేవీవీ గోపాల్‌రావు జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఆదివారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర పోలీసు సమావేశ మందిరంలో జిల్లా పోలీసు అధికారులతో డీఐజీ సమీక్షించారు. నేరాల సంఖ్య గణనీయంగా తగ్గాలని, నేరస్థులను కట్టడి చేయడంలో ఎంతటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవాలని సూచించారు. పోలీసుశాఖలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టామని, ప్రజల్లో పోలీసులపై ఉండే అపోహలను తొలగించి వారికి స్నేహపూరితమైన వాతావరణంలో సేవలందించాలన్నారు. పెండింగ్ కేసులన్నీ త్వరగా పూర్తి చేయాలని, దొంగతనాలను పూర్తిగా నియంత్రించాలని ఆదేశించారు.

బెట్టింగ్‌లపై ఎస్పీ పనితీరు భేష్...

క్రికెట్ బెట్టింగ్‌పై ఎస్పీ రామకృష్ణ ఉక్కుపాదం మోపడం అభినందనీయమని డీఐజీ కొనియాడారు. ఎంతోమంది జీవితాలను చిన్నాభిన్నం చేసే బెట్టింగ్‌ను కూకటి వేళ్లతో పెకలించేందుకు పోలీసుశాఖ శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే కీలక బుకీలతోపాటు, పంటర్‌లు, బెట్టింగ్ రాయుళ్లు సుమారు 200 మందిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రూ.50 లక్షల నగదు, బంగారం రికవరీ చేశామన్నారు. ఈ దర్యాప్తు ఇలానే కొనసాగుతుందని, నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు కూడా పోలీసులకు సమాచారం అందించి నేరాల కట్టడికి సహకరించాలని కోరారు..

టెక్నాలజీ సద్వినియోగం..

పెరిగిన ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని నేరాల నియంత్రణకు కృషి చేయాలని అధికారులకు డీఐజీ సూచించారు. టెక్నాలజీ వినియోగంలో మిగిలిన జిల్లాల కంటే నెల్లూరు ముందుందని చెప్పారు. ఉన్నతాధికారులు వారి వద్ద ఉండే పెండింగ్ కేసులతోపాటు శాఖాపరమైన విచారణలు పూర్తి చేసి త్వరతగతిన నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ రామకృష్ణ జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డీఐజీకి వివరించారు. అనంతరం కమాండ్ కంట్రోల్‌ను, నూతనంగా నిర్మిస్తున్న డీపీవోను డీఐజీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శరత్‌బాబు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న డీఐజీ గోపాలరావు

2,178 మందికి బ్యాడ్జీలు

● ఎల్‌ఎల్‌ఆర్ మేళాకు పోటెత్తిన డ్రైవర్లు
● రూ.5.66 లక్షల ఆదాయం



ఆటో డ్రైవర్‌కు బ్యాడ్జీ అందిస్తున్న డీటీసీ శివరామ ప్రసాద్

నెల్లూరు (క్రైం) : ఆటో బ్యాడ్జీల కోసం రవాణాశాఖ ఆదివారం నిర్వహించిన ఎల్‌ఎల్ఆర్ మేళాకు డ్రైవర్లు పొటెత్తారు. లైసెన్స్ కలిగిన డ్రైవర్లు ఈ బాడ్జీలను పొందాలంటే గతంలో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దీంతో రవాణాశాఖ కమి షనర్ బాలసుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు డీటీసీ శిమరామ ప్రసాద్ ఎల్‌ఎల్‌ఆర్ మేళాకు శ్రీకారం చుట్టారు. లైసెన్స్‌లు కలి గిన వేలాది మంది డ్రైవర్లు జిల్లాలోని అన్ని రవాణాశాఖ కార్యా లయాలకు చేరుకున్నారు. వారి అర్హత పత్రాలను అధికారులు పరిశీ లించారు. గతంలో ఎనిమిదో తరగతి పాస్ సర్టిఫికెట్ ఉం టేనే బాడ్జీలు ఇస్తుండగా ప్రస్తుతం తెల్లకాగితంపై డ్రైవర్ వ్యక్తి గత అఫిడవిట్ తీసుకుని బ్యాడ్జీలు జారీ చేశారు. నెల్లూరులో 1108 మందికి, గూడూరులో 373, కావలిలో 284, ఆత్మకూరులో 236, సూళ్లూరు పేటలో 177 మందికి కలిపి మొత్తం జిల్లా వ్యాప్తంగా 2,178 మంది ఆటోడ్రైవర్‌లకు బాడ్జీలు అందించినట్లు డీటీసీ శివరామ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేళా ద్వారా రవాణా శాఖకు రూ.5,66,280 ఆదాయం సమకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో కిషోర్, ఎంవీఐలు సీతారామిరెడ్డి, బాల మురళి, ఆదినారాయణ, ఏఎంవీఐలు రవి కుమార్, పూర్ణచంద్రరావు, రాఘవరావు, శ్రీనివాస్, ఏవోలు విజయ్‌కుమార్, సాయి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం ముంచుతోంది !

● రియల్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం

● ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

నెల్లూరు (వేదాయపాళెం) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచుతోందని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆరోపించారు. విభజన చట్టం అమలు - నవ్యాంధ్ర అభివద్ధి - యువత అనే అంశంపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసించారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు 2019 ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి కానీ విభజన చట్టం అమలుకు కృషి చేయడం లేదన్నారు. ప్రత్యేక రైల్వే జోన్, పారిశ్రామిక కారిడార్, ఉక్కు కార్మాగారం, దుగరాజపట్నం ఓడరేవు వంటివి చట్టంలో పొందుపరిచినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. అభివృద్ధి, నూతన రాజధాని పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. ఏపీలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకు పెరుగుతున్నా పాలకులు మాత్రం ప్రకటనలతో యువతను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ అంశాలపై డీవైఎఫ్ఐ మహాసభల్లో చర్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం బాలసుబ్రహ్మణ్యం, పీ కిరణ్, ఒంగోలు సుధీర్, నాగార్జున, యూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హుందాతనం కోల్పోతున్న వైఎస్ జగన్

● మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆనం రామనారాయణరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అనంతసాగరం: ముఖ్యమంత్రిపై అనుచిత ఆరోపణలు చేస్తూ, వైఎస్ జగన్ హుందాతనం కోల్పోతున్నారని మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విమర్శించారు. ఆదివారం అనంతసాగరంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రతిపక్షనేత ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడడం సరికాదన్నారు. ముఖ్యమంత్రిపై ఆయన చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయంఖాయమన్నారు. ఈ ఫలితాలు రాబోయే ఎన్నిక ఫలితాలకు నాంది పలుకుతాయని స్పష్టం చేశారు. అనంతరం ఆయనను లింగంగుంట, సోమశిలకు చెందిన టీడీపీ నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శాకమూరి సుబ్బారావు, టీడీపీ నేతలు అల్లంపాటి జనార్దన్‌రెడ్డి, ఉప్పల విజయ్‌కుమార్, రోశిరెడ్డి, సడ్డా రవీంద్రరెడ్డి, కాసా చిన్నసూరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మన్నారుపోలూరు చెంగాళమ్మకు

గిరిజనుల పొంగళ్లు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట చెంగాళమ్మతల్లికి అక్కగా కొలిచే మన్నారుపోలూరు చెంగాళమ్మతల్లికి ఆదివారం ఆ గ్రామానికి చెందిన గిరిజనులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గిరిజనపాళెం నుంచి తప్పెట్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరి పూజలు చేశారు.

పడకేసిన పర్యవేక్షణ

● వైద్య కళాశాలలో పాలన అస్తవ్యస్తం

● విద్యార్థులపై కొరవడిన నిఘా

● చదువులు వదిలి ఘర్షణ దిశగా మెడికోలు

● సగం రోజులు కనిపించని వార్డెన్‌లు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి): ఏళ్ల పోరాటం తర్వాత 2011లో జిల్లాకు వైద్య కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. కాలేజీతో పాటు ఆసుపత్రిని రూ.362 కోట్లతో రెండేళ్లలో నిర్మించారు. 2013 నుంచి ఇక్కడ తరగతులు ప్రారంభమయ్యాయి. మొత్తం 150 సీట్లు భర్తీ చేసుకునే అవకాశం కలిగింది. ఇప్పటి వరకూ ఒక్క బ్యాచ్ కూడా పూర్తి కాలేదు. మొదటి బ్యాచ్ విద్యార్థులు ప్రస్తుతం నాలుగో సంవత్సరం చదువుతున్నారు. ఈ క్రమంలో కాలేజీలో అప్పుడే గొడవలు ప్రారంభమయ్యాయి. అది కూడా సీనియర్, జూనియర్ల మధ్య కావడం ఆందోళన కలిగిస్తోంది. కొంత కాలంగా వైద్య కాలేజీలో విద్యార్థుల మధ్య వివాదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పలు సందర్భాల్లో ఒకరినొకరు దూషించు కోవడం కూడా జరిగినట్లు సమాచారం. ఇలా నడుస్తున్న గొడవులు రోజులు గడిచే కొద్దీ పెద్దవవుతూ వచ్చాయి. అయితే శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. చిన్న విషయంలో సీనియర్, జూనియర్‌లు రోడ్లపైకి చేరి కొట్టుకున్నారు. మెస్‌లో మూడో సంవత్సరం విద్యార్థి రెండో సంవత్సరం విద్యార్థిని 'రేయ్' అని సంబోధించడంతో వివాదం మొదలైంది. ఇక్కడ ఆ ఇద్దరు విద్యార్థుల్లో ఏ ఒక్కరూ తగ్గకపోవడంతో గొడవ కాస్తా సీనియర్, జూనియర్ల గొడవగా మారిపోయింది. సుమారు ముప్పై మందికి పైగా విద్యార్థులు కొట్లాటకు దిగారు. చొక్కాలు, పాంట్లు చిరిగిపోయేలా ఘర్షణ పడ్డారు. ఈ ఘటన కాలేజీలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది.

● **పర్యవేక్షణ ఎక్కడ ?**

ఈ విద్యాసంవత్సరానికి గానూ అడ్మిషన్‌లు కూడా పూర్తయ్యాయి. ఇప్పుడు కాలేజీలో సుమారు 600 మంది వరకూ ఉన్నారు. వీరందరికీ బాలురు, బాలికలు, సీనియర్, జూనియర్‌లకు విడివిడిగా హాస్టల్ సదుపాయం ఉంది. అయితే ఇక్కడ విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడడంతో అక్కడ ఏం జరుగుతుందో తెలియడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ హాస్టల్‌లకు ఇద్దరు వార్డెన్‌లు ఉన్నారు. వీరిద్దరు అకడమిక్, అడ్మిన్ వైస్ ప్రిన్సిపాల్‌లు కూడా వ్యవహరిస్తున్నారు. అయితే వీరు సక్రమంగా వార్డెన్ విధులు నిర్వహించరన్న ఆరోపణలున్నాయి. ఒకరి ది గుంటూరు, మరొకరిది తిరుపతి అని, వీరు వారంలో మూడు రోజులు ఇక్కడ ఉండరని కాలేజీ వర్గాలే చర్చించుకుంటు న్నాయి. ఆ సమయంలో హాస్టల్‌లో విద్యార్థులు ఇష్టారీతిన వ్యవహరిస్తారన్న ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ర్యాగింగ్ విషయమే సీనియర్, జూనియర్‌లకు మధ్య చిచ్చుకు కారణమని తెలుస్తోంది. అయితే వీరి మధ్య చిన్న చిన్నవిగా ఉన్న వివాదాలు క్రమేణా పెరుగుతూ వస్తున్నాయి. శనివారం ఘటనలో గొడవ ప్రారంభమైన వెంటనే అక్కడకు ముప్పై మందికి పైగా సీనియర్ విద్యార్థులు వచ్చేశారంటే కాలేజీలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అంటే సీనియర్ విద్యార్థులు కావాలనే గొడవ పెట్టుకున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. కాగా హాస్టల్‌లలో పొగాకు వాడకం కూడా ఎక్కువగా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పర్యవేక్షించేవారు లేకపోవడంతోనే ఇవన్నీ జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

● **కఠినంగా వ్యవహరించకుంటే కష్టమే**

ఈ పరిస్థితుల్లో వైద్య కాలేజీ అధికా రులు కఠినంగా వ్యవహరించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకసారి తీవ్ర చర్యలు తీసుకుంటే రెండో సారి ఏ విద్యార్థి కూడా వివాదాల జోలికి పోరని పలువురు అంటున్నారు. కాగా విద్యార్థుల మధ్య గొడవలు జరుగుతుంటే కాలేజీకి చెడ్డ పేరు వచ్చే ప్రమాదం ఉందని జిల్లా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా శనివారం నాటి ఘటనలో ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారన్న దాని పై వివరణ అడిగేందుకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకుంటుంది



ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులు ఘర్షణలకు దిగడం సరి కాదు. జూనియర్లపై సీనియర్ల దాడిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం కూడా దీన్ని సీరియస్‌గా తీసుకుంటుంది. ఇందుకు కారణమైన విద్యార్థుల తల్లి దండ్రులతో ప్రిన్సిపాల్ త్వరలో మాట్లాడుతారు. మరోసారి ఇలాంటి సంఘటనలు వెలుగు చూడకుండా గట్టిచర్యలు చేపడతాం.

- చాట్ల నరసింహారావు, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్

వార్డన్‌ల పర్యవేక్షణ లేకనే సమస్యలు



వైద్య కళాశాలలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. వార్డెన్లు అందుబాటులో లేకపోవడం, విద్యార్థులను నియంత్రించక పోవడంతో విద్యార్థులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పైగా ఇక్కడ ఉన్న హాస్టల్, వైద్యులు ఉంటున్న నివాస గృహాలు కూడా దూరంగా ఉండడంతో విద్యార్థులను పట్టించేకునే పరిస్థితి లేదు. ఇందువల్లే ఇలాంటి ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి.

- డాక్టర్ ఎంఏవీవీ ప్రసాద్, ఐఎంఏ జిల్లా మాజీ అధ్యక్షుడు

రాష్ట్రంలోనే ఉత్తమ వైద్య కళాశాల



నెల్లూరులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల ఉత్తమంగా నిర్మించారు. ఎంతో విస్తీర్ణం ఉన్న ప్రాంతంలోనే ఈ వైద్య కళాశాలను సుందరంగా నిర్మించారు. అయితే ఇందులో చదువుతున్న మెడికోలను సక్రమైన మార్గంలో పెట్టేందుకు అధి కారులు సరైన కృషి చేయడం లేదు. విద్యార్థుల మధ్య జరుగుతున్న ఘర్షణలను నియంత్రించక పోతే వైద్యకళాశాలకే కాకుండా జిల్లాకు కూడా చెడ్డపేరు వచ్చే ప్రమా దం ఉంది.

- కొండా శివారెడ్డి, సామాజిక వేత్త



ఎంపికైన క్రీడాకారులు

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు (క్యాంపస్) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ జూనియర్ జిల్లా జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మలిరెడ్డి కోటారెడ్డి, సీహెచ్ .రవికుమార్ మాట్లాడుతూ జిల్లా జట్లకు ఎంపికైన వారు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఒంగోలులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.



సాఫ్ట్‌బాల్ ఎంపికల్లో క్రీడాకారులు

ఉత్తమ టీచర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

కలువాయి : 2017వ సంవత్సరానికి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కోసం ఈనెల 25లోపు దరఖాస్తులు అందజేయాలని మండల విద్యాశాఖాధికారి జీ.సుధార్‌బాబు కోరారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు అందజేసిన దరఖాస్తులు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపుతామని తెలిపారు.

Screen-1 | సిరి మల్టిప్లెక్స్ | Screen-2

నక్షత్రం — ప్రదర్శన వేళలు: 11-55AM, 3-10 PM, 6-55 PM, 10-00 PM

నేనేరాజు - నేనే మంత్రి — ప్రదర్శన వేళలు: 12-00AM, 3-00 PM, 7-00 PM, 10-00 PM

నేనేరాజు - నేనే మంత్రి

నర్తకి A/c dts — ప్రదర్శన వేళలు: 11-40AM, 2-40 PM, 6-40 PM, 9-40 PM

అడ్వాన్సు బుకింగ్ కలదు



నెల్లూరు - సిరిమల్టిప్లెక్స్

రేపు విచారణకు రండి..

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నెల్లూరు కేంద్రంగా సాగుతున్న క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసులు దాడులు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో జాతీయ క్రికెట్ బుకీ కృష్ణసింగ్ ప్రధాన సూత్రధారి అని తేలింది. ఆయనతోపాటు అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కిన్నెర రమేష్‌కుమార్, ఎస్‌కే షంషేర్, ఊటుకూ రు వెంకటరమేష్ (డీటీఎస్), గుర్రం వెంకటేశ్వర్లు, నంద్యాల అరుణ్‌కుమార్, మన్నెం శ్యాంప్రసాద్, దాసరి సుశాంత్ లను ప్రధాన జాతీయ బుకీలుగా గుర్తించారు. వీరు కాకుండా మరో 21 మంది సబ్ బుకీలుగా పేర్కొన్నారు. ఇక పంటర్లు, బెట్టింగ్ రాయుళ్లు మరో 85 మంది ఉన్నట్టు గుర్తించారు. ఈనెల 3న వీరిని అరెస్టు చేసి వీరి వద్ద ఉన్న రూ. 44.24 లక్షల నగదు, 27.5 సవర్ల బంగారు, 96 సెల్‌ఫోన్లు, 10 ల్యాప్‌టాప్‌లు, మూడు కమ్యూనికేటర్లు, కార్లు, టీవీలు స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందే ప్రధాన బుకీల నుంచి పూర్తి స్థాయి సమాచారం సేకరించగా, ఇందులో టీడీపీ, వైసీపీ ముఖ్య నేతలు పాత్ర కూడా ఉందని తేలింది. ఆ తరువాత ప్రధాన బుకీలను కస్టడీకి తీసుకుని విచారించి వివరాలు సేకరించారు. ఈ విచారణలో సూత్ర, పాత్రధారులెవరన్నది తెలుసుకున్నారు. ఇందులో పోలీసుల పాత్రపై సీరియస్‌గా తీసుకుని ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలను వీఆర్‌కు పంపారు. రెండు రోజులుగా బెట్టింగ్ రాయుళ్లపై దాడులు నిర్వహిస్తూ శనివారం 85 మందిని అరెస్టు చేశారు. కాగా మొదటి నుంచి వైసీపీ ఎమ్మెల్యేలపై అనుమానాలు వ్యక్తమవుతూ వచ్చాయి.

- ● కోటంరెడ్డి, అనిల్‌కు నోటీసులు
- ● నంద్యాలలో అందుకున్న ఎమ్మెల్యేలు
- ● క్రికెట్ బెట్టింగ్‌ల వ్యవహారంలో కీలక మలుపు
- ● త్వరలో మరో ఇద్దరు ఎమ్మెల్యేలకు కూడా..



● ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి

జిల్లాలో సాగుతున్న క్రికెట్ బెట్టింగ్‌లు, బుకీల వ్యవహారంలో వైసీపీ ఎమ్మెల్యేల ల క్ష్యంగా కేసులు దర్యాప్తు జరుగుతున్నా యని ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో ' మరింతగా బిగిస్తున్న ఉచ్చు... వైసీపీ ఎమ్మెల్యేలే లక్ష్యమా..' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అది నేడు నిజమైంది. ఈ వ్యవహారంలో మరో ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. త్వరలో వారికి నోటీసులు జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

● నాలుగు రోజుల క్రితమే సిద్ధం

కోటంరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్న బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి కృష్ణసింగ్‌ను పోలీసులకు సరెండర్ చేయడంలో కీలకంగా వ్యవహరించారు. సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్‌కు ముఖ్య అనుచరుడు రూపుకుమార్ యాదవ్ ఈ వ్యవహారంలో అరెస్టు అయ్యారు. వీరే కాకుండా మరి కొందరు అరెస్టు అయిన వారిలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉన్నవారేనని తేలింది. దీంతో ఎమ్మెల్యేలను కూడా విచారించాలని పోలీసులు భావించారు. ఈనెల 16న నోటీసు అండర్ సెక్షన్ 160 సీఆర్‌పీఎస్‌ను ఏఎస్పీ శరత్‌బాబు సిద్ధం చేశారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు నంద్యాల ప్రచారంలో అక్కడే ఉండడంతో నోటీసులు అందించలేకపోయారు. దీంతో నాయుడుపేట సీఐ రత్నయ్య ప్రత్యేకంగా నంద్యాలకు వెళ్లి ఆదివారం ఉదయం ఎమ్మెల్యేలను కలిసి నోటీసులు అందించా రు. ఈనెల 22న ఉదయం 11 గంటలకు ఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

● అండర్ సెక్షన్ 160 సీఆర్‌పీఎస్ అంటే...

నోటీసు అండర్ సెక్షన్ 160 సీఆర్‌పీఎస్ అస్త్రాన్ని పోలీసులు కీలక సమయాల్లో వినియోగిస్తారు. ఒక కేసులో సాక్ష్యాలు సేకరించేందుకు ఈ నోటీసులు జారీ చేసి ఎవరినైనా విచారణ జరిపే అవకాశం ఉంది. విచారణ అనంతరం పోలీసుల వద్ద ఉన్న పక్కా సమాచారం మేరకు ఆ కేసుల్లో ముద్దాయిలుగా చేర్చి అరెస్టు చేసే అవకాశం కూడా ఉంది. అందుకనే కీలక కేసుల్లో పోలీసులు ప్రజా ప్రతినిధుల హాజరు కోసం అండర్ సెక్షన్ 160 సీఆర్‌పీఎస్‌ని ఉపయోగిస్తుంటారు.



● నోటీసులో ఏముందంటే..

జాతీయ బుకీలైన కృష్ణసింగ్ మరో ఎనిమిది మందిపై నమోదు చేసిన కేసుల ను ఆ నోటీసులో ప్రస్తావించారు. నెల్లూరు 4వ నగర పోలీసుస్టేషన్‌లో క్రైమ్ నెం. 185/2017 అండర్ సెక్షన్ 3 అండ్ 4, ఏపీ గేమింగ్ యాక్టు సెక్షన్ 20 (బీ)సీ మాదవ ద్రవ్యాల నిరోధక చట్టం (ఎన్‌డీపీఎస్) సెక్షన్లు ఉన్నాయి. ఇదే పోలీసుస్టేషన్‌లో క్రైమ్ నెం. 191/2017 3 అండ్ 4 గేమింగ్ యాక్టు 109, 213 ఐపీసీ నమోదు చేశారు. కావలి 1వ నగర పోలీసుస్టేషన్‌లో క్రైమ్ నెం. 146/2017 అండర్ సెక్షన్ 3 అండ్ 4 ఆఫ్ ఏపీ గేమింగ్ యాక్టు సెక్షన్‌లు కింద కేసులు పెట్టారు. నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని క్రైమ్ నెం. 308/2017 కింద 307 ఐపీసీ 3 అండ్ 4 ఏపీ గేమింగ్ యాక్టు కింద కేసులు పె ట్టారు. ఈ కేసులన్నీ కృష్ణసింగ్ మరో ప్ర ధాన ఎనిమిది బుకీలపై పోలీసులు నమో దు చేశారు. ఈ కేసులకు సంబంధించి పోలీసుల విచారణలో భాగంగా కావాల్సిన సమాచారం కోసం నోటీసు అండర్ సెక్షన్ 160 సీఆర్‌పీఎస్ క్రికెట్ బెట్టింగ్‌ల నేరాలకు సంబంధించి విచారణ రాబట్టే నిమిత్తం ఈనెల 22న ఉదయం 11 గంటలకు ఎస్పీ కార్యాలయానికి హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

ఆశ్చర్యానికి గురయ్యా

నోటీసు చూసి ఆశ్యర్యానికి గురయ్యా. ఎస్పీ స్వయంగా ఎమ్మెల్యేల ప్రమేయం లేదని ప్రకటించారు. ఈ రోజు ఈ నోటీసు జారీ చేయడం నాకు అర్థం కావడం లేదు. పోలీసుల విచారణకు ఖచ్చితంగా హాజరవుతా. నాకు తెలిసిన విషయాలు అన్ని కూడా వివరిస్తా. ఇందులో దాపరికం ఏమీ లేదు.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

హాజరవుతా..

నోటీసు అందింది. పోలీసుల విచారణకు హాజరవు తా. నేను ఏ తప్పు చేయలేదు. బుకీని, పంటర్‌ని కాదు, బెట్టింగ్ రాయుడిని అంతకంటే కాదు. ఆర్థిక లావాదేవీలన్నవి అసలు జరగలేదు. పోలీసులు ఎందు కు నోటీసు పంపారో విచారణ తరువాత మాట్లాడతా.

- పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు నగర ఎమ్మెల్యే



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారైన వినాయక విగ్రహాలు

ఆరోగ్యంపై ప్రభావం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాల వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయి. విగ్రహాలను నీటిలో కలపటం వల్ల అందులో ఉన్న రసాయనాలు నీటిలో కలసి పోతాయి. దీని వలన ఊపిరితిత్తుల వ్యాధులు సంక్రమిస్తాయి. జీవరాశు లకు ఈ రపాయనాల నీటి వల్ల ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి ఏర్పడుతుంది.

- డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి ,సింహపురి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి

గర్భస్థ శిశువుపై ప్రభావం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల నిమజ్జనం చేసిన నీటిని తాగడం వలన గర్భవతులు తీవ్ర అనారోగ్యానికి గురవుతారు. గర్భంలో ఉన్న గర్భస్థ శిశువు అవయవ లోపం లేకపోయినా ప్రభావం మాత్రం ఉంటుంది. విగ్రహాల నిమజ్జనం నీటిని తాగటం వల్ల అనారోగ్యం తప్పదు.

- డాక్టర్ సుశీల, గర్భకోశ వ్యాధి నిపుణురాలు.జీజీహెచ్ ఆసుపత్రి

ఆ విగ్రహాలతో అనర్థం

- ● పర్యావరణానికి ముప్పుగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్
- ● ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం ● గర్భస్థ పిండానికి ఇబ్బందులే
- ● మేలుకోవాలంటున్న వైద్యులు, పర్యావరణ వేత్తలు

నెల్లూరు (వైద్యం): వినాయకచవితి మరో నాలుగు రోజులే ఉంది. ఈ పండుగ ప్రకృతికి ఏమాత్రం ఇబ్బంది కలిగించని విధంగా ఉండాలి. బొజ్జగణపయ్య విగ్రహాలను పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేయడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సి ఉంది. జలాశయాల్లో సున్నం, విగ్రహాలు కరగక జలచరాలకు ముప్పు కలిగిస్తున్నాయి. పెద్ద ఎత్తున రసాయనాలు ఉపయోగించడం వల్ల నీరు, భూమి కలుషితమవుతుంది.కాబట్టి మట్టి విగ్రహాలను వాడాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

● ఆధునిక విధానాలతో ప్రమాదం

పూర్వీకులు అనుసరించిన సాంప్రదాయాలను, అలవాట్లను విడనాడి ఆధునిక విధానాలను పాటిస్తూ నేటి మానవుడు తన ఉనికికే ప్రమాదం తెచ్చుకుంటున్నాడు. పూర్వం మట్టి వినాయకుడిని తయారు చేసి పూజించే విధానానికి స్వస్తి చెప్పి, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీటి వలన పర్యావరణానికే కాకుండా ఆరోగ్యానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇలాంటి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను పూజించరాదని వైద్యులు, పర్యావరణ వేత్తలు పదేపదే చెప్తున్నా పట్టించుకునే పరిస్థితి లేదు.

● ఎన్నో అనర్థాలు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలలో పలు రసాయనాలు మిళితమై ఉంటాయి. ఇందులో ప్రమాదకరమైన లెడ్, పాదరసం, సీసం, జీయోగ్యాస్ వంటి రసాయనాలు ఉంటాయి. వినాయక చవితి పూర్తైన అనంతరం విగ్రహాలను నదులలో కాని, చెరువుల్లో కాని కలుపుతారు. ఇందువల్ల విగ్రహాలలో ఉన్న ప్రమాదకరమైన రసాయనాలు దాదాపు నెలపాటు ఆ నీటిలోనే ఉంటాయని వైద్యులు చెప్తున్నారు. దీని వలన భూ ఉపరితలంపై రసాయనాలు పేరుకుపోయి భూగర్భ జలాలు ఇంకి పోయే అవకాశం ఉంది. అలాగే ఈ విగ్రహాలకు వాడే వివిధ రంగులు కూడా ప్రమాదకరమైనవే. ఇందులో వినియోగించే జిప్సం 150 డిగ్రీలు ఉంటుంది. విరిగిన ఎముకలకు దీన్ని వినియోగిస్తున్నారు. నీటిలో ఆక్సిజన్ కూడా కరిగిపోయి జలజీవాలు మరణించే పరిస్థితి వస్తుంది. కాల్షియం, మెగ్నీషియం, సిలికాన్ వంటి భారీ లోహాలు నీటిలో కలిసి మానవ మనుగడను ప్రశ్నిస్తున్నాయి.

● నీటిలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను కలపడం వలన మూడు రోజులపాటు ఆ నీటిలో రసాయనాలు మిళితమై ఉంటాయి.

● ఈ పరిస్థితుల్లో శ్వాసకోశ వ్యాధులు ప్రబలి తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది.

● అలాగే ఈ రసాయనాల వల్ల చర్మం దెబ్బతిని చర్మ వ్యాధులు వస్తాయి.

● ఈ విగ్రహాల వలన ప్రధానమైన గుండె, మూత్రపిండాలు, నాడీ వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది.

● దీంతోపాటు శరీరంలోని రక్తకణాలు కూడా దెబ్బతినే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెప్తున్నారు.

● ఈ కలుషిత నీరు తాగడం వలన డయేరియా(అతిసారా)కు గురై ప్రాణాపాయానికి దారి తీసే అవకాశం ఉంది.

● 3వేల విగ్రహాలకు పైగానే..

జిల్లా వ్యాప్తంగా వీధి వీధిన విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. పోటీతో పెద్ద పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 98 శాతం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలే. జిల్లా వ్యాప్తంగా 3వేలకు పైగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను పెడుతుండడంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడే అవకాశం ఉంది.

వీటిని విడనాడాలి



వినాయక చవితిలో మట్టి విగ్రహాలనే వాడాలి. లేదంటే పర్యావరణానికి ఇబ్బందులు తప్పవు. ఈవిగ్రహాలను వాడవద్దని ఎందరో మేధావులు పదేపదే చెప్తున్నారు. వాటిని తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకించి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలపై పూర్తి అవగాహన కల్పించాలి.

- కొండా శివారెడ్డి, పర్యావరణ వేత్త

పర్యావరణంపై తీవ్ర ప్రభావం



ఈ విగ్రహాలు వలన పర్యావరణానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. నీటిలో ఈ విగ్రహాలు కలపడం వల్ల నెలరోజులపాటు పూర్తిగా నీటిలో కలిసే అవకాశం లేదు. రసాయనాలు కూడా భూమి పొరల్లో చేరి పర్యావరణానికి చేటు కలిగిస్తుంది. భూగర్భ జలాలు కూడా కలుషితమయ్యే అవకాశం ఏర్పడుతుంది.

- బుజ్జయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు

స్ఫూర్తి

అనగనగా ఓ భిక్షగాడు..

యాచన చేస్తున్న ఎవరైనా మన ఇంటికి యాచించడానికి వస్తే అబ్బా ఈ టైములోనా అని విసుక్కుంటాం.. కొందరైతే జాలి చూపి అంతో ఇంతో అన్నం పెడుతుంటాం.. లేదా చేతిలో ఉన్న పదో పరో ఇస్తుంటాం.. బస్సుల్లోనూ, రైళ్లల్లోనూ వికలాంగులూ, వృద్ధులు అడుక్కోవడం మనం చూస్తుంటాం.. ఆత్మభిమానం చంపుకోని గానీ ఈ వృత్తిని చేపట్టలేం.. ఆయన మాత్రం యాచిస్తే ఆత్మభిమానానికి భంగం వాటిల్లదని నిరూపించాడు. ఆశ్చర్యం ఏమిటంటే వారానికోసారి ఆయన ఆ వృత్తిని ఎంచుకుంది పేద విద్యార్థుల కోసం.. పేదలకు ఏదో ఒక రూపంలో సహాయం చేయాలని ఈ యాచక వృత్తికి దిగాడు విలేఖరి రియాజ్.. -తడ


యాచనకు బయలుదేరిన రియాజ్


రైలులో ప్రయాణికులను యాచిస్తున్న రియాజ్

చిత్తూరు జిల్లా వరదయ్యపాళెంకు చెందిన షేక్. మస్తాన్, హసీనా దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో చిన్నవాడు రియాజ్. మస్తాన్ సామాన్య టైలర్. ఆయన తెచ్చే అర కొర సంపాదన కుటుంబపోషణకు సరిపోయేదికాదు. రియాజ్ ఏడు నుంచి 8వ తరగతిలోకి వెళ్లే సమయంలోనే కష్టాలను చవిచూసాడు. పాఠశాలలో చేరేందుకు వంద రూపాయల ఫీజు తన తండ్రి వద్ద లేక ఎంతో ఇబ్బంది పడ్డాడు. విద్య ద్వారానే మంచి భవిష్యత్తు ఉందనుకున్నాడు. పదో తరగతి చదువుతున్న సమయంలో డబ్బుకు ఇబ్బంది వచ్చింది. దాంతో ఆయన బేల్దారు పనికి వెళుతూ పదో తరగతిని పూర్తి చేశాడు. ఆర్థిక ఇబ్బందులు పూర్తిగా ఆవహించడంతో పై తరగతులకు వెళ్లలేక పోయాడు. చదువుపై ఆసక్తి పోలేదు. ప్రైవేటుగా పట్టాలు సాధించాలని అనుకున్నాడు. ఒక వైపు పిల్లలకు ట్యూషన్లు చెబుతూనే మరోవైపు అలా వచ్చిన డబ్బులతోనే ఇంటర్, డిగ్రీ వరకూ చదివాడు. 1999లో తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో చేరి పట్టా సాధించాడు. ఈ క్రమంలోనే ఓ పత్రికలో గ్రామీణ విలేకరిగా చేరాడు.

- ఆత్మభిమానానికి అడ్డురాని యాచక వృత్తి
- పేద విద్యార్థుల కోసం పెద్ద మనసుతో..
- వచ్చిన నగదుతో విద్యా సామగ్రి అందజేత

● పేద విద్యార్థులకు సాయం

చదువు కోసం తాను పడ్డ కష్టాలు మరో పేద విద్యార్థి పడకూడదని భావించాడు. వారికి ఏ విధంగానైనా సహాయం చేయాలనుకున్నాడు. తన సంపాదనలో కొంత సొమ్ము అలాంటి పేద విద్యార్థులకు పెట్టసాగాడు. ఈ క్రమంలోనే స్నేహితుల సహకారంతో బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్ అనే సంస్థను స్థాపించాడు. దాని ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే తలారీ ఆదిత్య, సీఐ...

● యాచించేందుకు వెనుకాడక

రియాజ్ ఎంత పోగుచేసినా ఒకటి, రెండు పాఠశాలల విద్యార్థులకే ఆ సొమ్ము సరిపోయేది. మిగతా విద్యార్థుల సంగతి ఎలా అని ఆలోచించాడు. డబ్బు వచ్చేందుకు ఎలాంటి మార్గం ఎంచుకోవాలని అనుకున్నాడు. అందుకు యాచకవృత్తే సరైన మార్గం అనుకున్నాడు. ఆ విషయాన్ని స్నేహితులతో చర్చించాడు. గౌరవనీయమైన వృత్తిలో ఉంటూ యాచిస్తే ఆత్మాభిమానం దెబ్బతింటుందని స్నేహితులు చెప్పారు. అంతకుమించిన మార్గం లేదని ఆ దారిలోనే వెళ్లాలనుకున్న రియాజ్ అందు కోసం రైళ్లను ఎంచుకున్నాడు. రైలులో తడ నుంచి నెల్లూరుకు, అక్కడ నుంచి శ్రీకాళహస్తి వరకు వెళ్లి యాచించాలని అనుకున్నాడు. అనుకున్నదే తడువుగా పక్కరోజే తడ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. మెము రైలు ఎక్కాడు. అక్కడ నుంచి నెల్లూరుదాక వెళ్లినా మొదట్లో యాచించేందుకు ధైర్యం చాలలేదు.


తల్లిదండ్రులతో రియాజ్..

ఆత్మాభిమానం ఆ క్షణం అడ్డువచ్చింది. తిరిగి ఇంటికి చేరుకున్నాడు. మరుసటి రోజు అలాగే వెళ్లి తిరిగి వచ్చేశాడు. ఇక కుదరదనుకొని ధైర్యం కూడకట్టుకొని తన ఆత్మాభిమానాన్ని సైతం పక్కనబెట్టి మూడోరోజు యాచనకు దిగాడు. ప్రతి ప్రయాణికుని వద్దకు వెళ్లి పేద విద్యార్థులకు మీవంతు సాయం చేయండని అంటూ యాచించడంతో మొదటిరోజు గడిచిపోయింది. ఇలా వారం గడిచిన తరువాత అలవాటైపోయింది. ఒక రోజు రైలులో తడ నుంచి నెల్లూరుకు, నెల్లూరు నుంచి శ్రీకాళహస్తి వరకూ యాచిస్తే రూ. 500 నుంచి రూ. 700 వచ్చాయి. దాంతో వారానికి ఒక రోజు చొప్పున ఇలా యాచనకు వెళ్లాలని నిర్ణయించుకుని 8 నెలలుగా నిర్విరామంగా చేస్తున్నాడు. అలా సేకరించిన డబ్బుతోపాటు స్నేహితులు అందించే డబ్బును కూడబెట్టి ప్రతి నెలా ఒక్కో పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, సామగ్రి, ఫీజులు కట్టలేని విద్యార్థులకు నగదు సాయం చేస్తున్నాడు. ఇలా గౌరవమైన వృత్తిలో ఉంటూ తన తోటి పేద విద్యార్థుల కోసం తాపత్రయం పడుతూ వారి కోసం బిక్షగాడుగా మారిన గ్రామీణ విలేకరికి అభివందనలు చెప్పక తప్పదు.

కొందరు వ్యంగ్యంగా మాట్లాడేవారు

రైల్లో యాచిస్తుంటే కొందరు వ్యంగంగా మాట్లాడేవారు. ఆ క్షణంలో కొంత బాధ అనిపించింది. ఆ బాధకన్నా పేద విద్యార్థికి సాయపడాలన్న తపన ఆ బాధను మరచిపోయేలా చేసింది. ఆ తరువాత అలవాటైపోయింది. రైల్లో కొందరు స్నేహితులు సైతం పరిచయం అయ్యారు. వారి ప్రోత్సాహం మరువలేనిది. పేద విద్యార్థులకు సాయం చేస్తున్నాన్న తృప్తిగా ఉంది. **- షేక్ రియాజ్**


వెంగారెడ్డిపాళెంలో కుమ్మరులు తయారు చేసిన వినాయక మట్టి విగ్రహాలు

పర్యావరణ హితులు

- మట్టితో వినాయక ప్రతిమల తయారీ

బంక మన్నుతో చేసిన వినాయక ప్రతిమల స్థానాన్ని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమలు ఆక్రమించాయి. దీంతో వంశపారంపర్యంగా మట్టితో ప్రతిమలు తయారు చేస్తున్నవారు ఉపాధి కోల్పోయారు. పర్యావరణ స్పృహ కలిగిన పలు సంస్థలు పీవోపీతో చేసిన విగ్రహాలను వినియోగించరాదని హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో ఈ మధ్య కాలంలో మట్టి ప్రతిమలపై ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఏళ్ల తరబడి మట్టి ప్రతిమలు తయారు చేస్తున్న వెంగారెడ్డి పాళెం కుమ్మరులు ఈ పరిస్థితులపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - సంగం


మట్టి విగ్రహానికి తుది మెరుగులుదిద్దుతున్న మహిళ

కుల వృత్తే దైవంగా..

వెంగారెడ్డిపాళెంలో సుమారు 25 కుటుంబాల వారు కుమ్మరి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరు వినాయకచవితికి నాలుగు నెలల ముందు నుంచి మట్టి వినాయక ప్రతిమల తయారీలో నిమగ్నమవుతారు. అవసరమైన బంకమట్టిని దూర ప్రాంతం నుంచి తెచ్చుకుని, బొమ్మల తయారీకి అనువుగా సిద్ధం చేసుకుంటారు. అర అడుగు నుంచి ఒకటిన్నర అడుగు ఎత్తు ఉండే ప్రతిమలను అచ్చుల సాయంతో తయారు చేస్తారు. వారం రోజులుపాటు నీడలో ఆరబెట్టి, సహజమైన రంగులతో తీర్చిదిద్దుతారు. పండుగకు ముందు రోజు నెల్లూరు, బుచ్చి, కోవూరు తదితర పట్టణాలకు తరలించి విక్రయిస్తారు. ప్రతిమల తయారీ గిట్టుబాటు కాకున్నా, సాంప్రదాయాన్ని కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నారు.


రంగులు దిద్దుతున్న మహిళ

మట్టి గణపతులు తయారు చేయడంలో సంతృప్తి



మట్టి ప్రతిమల తయారీ సంతృప్తినిస్తోంది. కొన్నేళ్లుగా మట్టి గణపతులను తయారుచేస్తున్నాం. ఏటా మా గ్రామం నుంచి 25 నుంచి 30 వేల విగ్రహాలు జిల్లా నలుమూలలకు తరలిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం అందడంలేదు.

- మాచారం కామేశ్వరి, వెంగారెడ్డిపాళెం

గిట్టుబాటు కావడం లేదు



విగ్రహాల తయారీకి కావాల్సిన మట్టిని దూరప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి ఉంది. దీంతో ఖర్చులు అధికమై, గిట్టుబాటు కావడం లేదు. అయినా వచ్చే ఆదాయంతోనే సంతృప్తి చెందుతూ విగ్రహాలు చేస్తున్నాం

- మన్నేపల్లి శ్రీనయ్య, వెంగారెడ్డిపాళెం

దాతలు కొనుగోలు చేయాలి



పలువురు మట్టి ప్రతిమలు కొనుగోలు చేసి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. దీంతో మా ప్రతిమలకు గిరాకీ ఉండడంలేదు. దాతలు వెంగారెడ్డిపాళెంలో తయారు చేస్తున్న ప్రతిమలను కూడా కొనుగోలు చేస్తే మాకు కూడా జీవనోపాధి దొరుకుతుంది.

- సుబ్బరామయ్య, వెంగారెడ్డిపాళెం


ఎత్తివేసిన సాంఘిక సంక్షేమ వసతిగృహం

పేదలకు విద్య దూరం

పేద, బడుగు, బలహీన వర్గాల వారికి విద్య నానాటికీ దూరమవుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యాలయాల సంఖ్య పెంచాల్సిందిపోయి ఉన్నవాటిని ప్రభుత్వం తగ్గిస్తున్నది. గ్రామాల్లో ఉండే పాఠశాలలను, వసతి గృహాలను ఎత్తివేస్తుండటంలో విద్యార్థులు పనిబాట పడుతున్నారు. ఎత్తివేసిన వసతిగృహాలలోని విద్యార్థులను గురుకుల పాఠశాల, కళాశాలల్లో సర్దుబాటు చేస్తున్నారు. అయినా అక్కడ వసతులు లేక బోధనా సిబ్బంది పెంపుదల లేకపోవడంతో వారిపై పనిభారం మోపుతున్నారు.

\- నాయుడుపేట

- మధ్య తరగతికి పెనుభారం
- గురుకులాల్లో రద్దీతో పనిభారం



● గురుకులాల్లో పనిభారం

2014-15 నుంచి జిల్లాలోని వసతిగృహాలను రద్దు చేస్తున్నది. మొదట విడతగా 24 వసతిగృహాలను రద్దు చేసి అందులో ఉన్న 2,050 మంది విద్యార్థులను 14 గురుకుల పాఠశాలలో సర్దుబాటు చేశారు. రెండో విడతలో 29 వసతిగృహాలను రద్దుచేసి అందులో ఉన్న 2,500 మంది విద్యార్థులను కూడా గురుకుల పాఠశాలలో సర్దుబాటు చేశారు. గురుకుల పాఠశాలల్లో ఎలాంటి వసతులు, అదనపు తరగతి గదులు లేవు. అదనపు బోధన సిబ్బంది లేరు. అదే సమయంలో గురుకులాల సిబ్బందిపై కూడా భారం పడుతున్నది.

● పెనుభారంగా విద్య

మధ్యతరగతి వారు, చిరుద్యోగులకు విద్య పెనుభారంగా మారిపోతుంది. ప్రైవేట్ విద్యాసంస్థల్లో సాధారణ తరగతిలో 5వ తరగతి రెసిడెన్షియల్‌కు ఫీజు రూ. 40వేలు, పుస్తకాలు, ఇతర ఖర్చులకు 10వేలు, 6వ తరగతికి 55వేలు, ఇతర ఖర్చులకు 10వేలు, 7వ తరగతికి 55వేలు, ఇతర ఖర్చులకు 10వేలు, 8వ


సామర్థ్యానికి మించి అధిక విద్యార్థులతో కిటకిటలాడుతున్న తరగతి గది

తరగతికి 65వేలు, ఇతర ఖర్చులకు 12వేలు, 9వ తరగతికి 70వేలు, ఇతర ఖర్చులకు 12వేలు, 10వ తరగతి 80వేలు, ఇతర ఖర్చులకు 20వేలు, ఇంటర్మీడియట్‌కు లక్ష రూపాయలు, ఇతర ఖర్చులకు 20వేలు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం 1.15 లక్షలు, ఇతర ఖర్చులకు 25వేలు ఖర్చుచేయాల్సి వస్తున్నది. దీంతో వారికి విద్య పెనుభారంగా మారింది.

● గురుకులాలను ఏర్పాటు చేయాలి

విద్యార్థుల సంఖ్య లేదంటూ ఉన్న వసతిగృహాలను ఎత్తివేస్తు న్నారు. పెరుగుతున్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సీట్ల డిమాండ్ దృష్ట్యా ప్రతి మండలాలలో గురుకులాల పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేస్తే పేదలకు విద్య వారి దరిచేరుతుంది.

గురుకుల పాఠశాల, కళాశాల

గురుకుల పాఠశాలలో మంచి విద్య, ఉచిత వసతి సదుపాయాలు ఉండటంతో ఆసక్తిగా గురుకులంలో చేరా.

\- వెంకటలక్ష్మి (నెల్లూరు)

విద్య బాటుందని..



ప్రైవేట్ చిరుద్యోగి అయిన తండ్రికి నా చదువు భారంగా మారింది. గురుకుల పాఠశాలలో విద్య బాగా ఉండటంతోపాటు వసతి సదుపాయాలు ఉండటంతో అక్కడ చేరా.

\- ప్రత్యూష (కండలేరు)

తల్లిదండ్రులకు భారమని..



రైతు కూలీలుగా ఉన్న తల్లిదండ్రులకు నా చదువులు కష్టంగా మారాయి. దాంతో

200 ఏళ్లనాటి చింతచెట్టు



జీగురాళ్ల చెట్టు

చిట్టమూరు మండలం గునపాడు గ్రామంలో సుమారు 200 ఏళ్ల నాటి చింతచెట్టు ఉంది. ఆ చెట్టుపై ఏళ్ల తరబడి వందలాది జీగురాళ్లు నివసిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అవి రాత్రిపూట మాత్రమే ఆహార సేకరణకు వెళ్లి, తెల్లవారుజాముకంతా మళ్లీ గూటికి చేరతాయి. కేవలం పండ్లను మాత్రమే తీసుకుని ఈ పక్షులు, ఆహారాన్ని కూడా తలకిందులుగా ఉండే తింటాయి. వీటిని దేవతాపక్షులుగా భావించి, గ్రామస్థులు వాటికి ఎలాంటి హాని తలపెట్టరు. **\- నాయుడుపేట**


చింతచెట్టుపై తల కిందులుగా వేలాడి ఉన్న జీగురాళ్లు



ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం అవ్వాలి

ఈ విద్య సంవత్సరం జంబ్లింగ్ విధానంలోనే ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయి. అందుకు విద్యార్థులు సన్నద్ధమవ్వాలి. ప్రైవేటు కళాశాలలో కచ్చితంగా విద్యార్థులచే ప్రాక్టికల్స్ చేయించాలి. కళాశాలల్లో ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహిస్తున్నారా, లేదా అన్న దానిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

\- ఆర్ఐవో బాబుజాకబ్

ప్రాక్టికల్స్ ఫీవర్!

- ఇంటర్ విద్యార్థులలో వణుకు..
- గతేడాది హడావుడిగా పరీక్షలకు..
- జంబ్లింగ్‌పై 'ప్రైవేటు' నిర్లక్ష్యం
- పైసలు ఇస్తే చాలంటున్న యాజమాన్యాలు
- అడ్మిషన్లప్పుడే విద్యార్థుల నుంచి వసూలు
- చూసీచూడనట్లు అధికారులు

నెల్లూరు (క్యాంపస్) : అప్పుడే ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఫీవర్ పట్టుకుంది. ఈ ఏడాదీ జంబ్లింగ్ విధానమైతే ఎలాగంటూ ఆలోచనలో పడ్డారు. ఇందుకు కారణం ప్రైవేటు కళాశాలల్లో ప్రాక్టికల్స్‌పై నిర్లక్ష్యంగా ఉండడమే. గత విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జంబ్లింగ్ విధానంలో జరిగిన విషయం తెలిసిందే. గతేడాది పరీక్షల వరకూ నిమ్మకు నీరెత్తినట్టు ఉండి చివరిలో హడావిడి చేశారు. విద్యార్థులచేత సరిగా ప్రాక్టికల్స్ చేయించకుండానే పరీక్షలకు పంపారు. దానిని ఆసరా చేసుకున్న కొందరు యాజమానులు, అధ్యాపకులు పాస్ చేయిస్తామంటూ విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేశారు. ఇలాంటి పరిస్థితే మళ్లీ పునరావృతం అవుతుందేమోనని విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. అసలు ప్రాక్టికల్స్ పరీక్షలో ఉత్తీర్ణులు కాగలమా అని సందేహం వెలిబుచ్చుతున్నారు.

ఈ ఏడాది కఠినంగా జంబ్లింగ్

గత విద్యా సంవత్సరం ముందు ఆయా కళాశాలల్లోనే ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించే వారు. ఎగ్జామినర్లను ఏదో ఒక విధంగా మ్యానేజ్ చేసుకొని తమ కళాశాలల విద్యార్థులను మంచి మార్కులతో పాస్ చేయించుకునే వారు. గత విద్యా సంవత్సరం నుంచి జంబ్లింగ్ విధానం ప్రారంభమైంది. తొలి సంవత్సరం జంబ్లింగ్ విధానం కావడంతో ఎగ్జామినర్లు కూడా కొంత మేర చూసీ చూడనట్టు పోయారు. కొందరైతే విద్యార్థుల



నుంచి డబ్బులు వసూలు చేశారు. దాంతో విద్యార్థులు ఎలాగోలా గట్టెక్కారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పబ్లిక్ పరీక్షల తరహాలో ఇంటర్ ప్రాక్టికల్స్‌లనూ కఠినంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.ఈ పరిస్థితిల్లో విద్యార్థులు ప్రాక్టికల్స్‌పై దృష్టి సారించకపోతే కచ్చితంగా ఫెయిలయ్యే అవకాశం ఉంది.

అడ్మిషన్ల అప్పుడే ప్రాక్టికల్స్ ఫీజు వసూలు

కొన్ని ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్లు అప్పుడే విద్యార్థుల నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు పాస్ చేయించేందుకు డబ్బు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. పైసలిస్తే తాము విద్యార్థులను పాస్ చేయిస్తామంటూ కొన్ని ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులతో అంటున్నాయి. ప్రాక్టికల్స్‌పై ప్రైవేటు కళాశాలలు దృష్టి సారించకపోవడాన్ని గమనించిన తల్లిదండ్రులు ప్రశ్నించడంతో యాజమాన్యాల నుంచి ఈ సమాధానం వస్తోంది. జంబ్లింగ్ విధానంలోనే ప్రాక్టికల్స్ జరుగుతాయని తెలిసినా యాజమాన్యాలు అందుకు క్లాసులు నిర్వహించబోరని తెలుస్తోంది. దీనిని బట్టి ఆయా యాజమాన్యాల కనుసైగలలో పరీక్షలు జరిగే అవకాశం ఉంది.

మార్కులు, ర్యాంకులపైనే

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ల్యాబ్‌లలో ఉన్న పరికరాల మేరకు విద్యార్థులకు తరచూ ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు.ప్రైవేటు జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ గురించి పూర్తిగా పట్టించుకోవడం లేదు. ర్యాంకులు, మార్కులపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు సిలబస్, ఎంసెట్, ఐఐటీ, నీట్ ఇలా ప్రత్యేక కోచింగ్‌లపైనే దృష్టి సారిస్తున్నారు. దాంతో విద్యార్థులు తెలియకుండానే ప్రాక్టికల్స్‌పై భయాందోళనలో ఉన్నారు.

చూసీ చూడనట్లు అధికారులు

ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ తరగతులను నిర్వహించడం లేదని ఇంటర్ అధికారుల దృష్టికి వెళ్లినా వారు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రాక్టికల్స్ పరీక్షలపై అధికారలతో చర్చించామని, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రైవేటు కళాశాల యాజమాన్యం తెలుపుతున్నట్లు కొందరు విద్యార్థులు చెబుతున్నారు. అధికారులు కూడా ప్రాక్టికల్స్ తరగతులు కళాశాలల్లో నిర్వహిస్తున్నారా.. లేదా.. అన్న దానిపై తనిఖీలు చేయకపోవడం చూస్తుంటే విద్యార్థులు చెబుతున్న మాటలు వాస్తవాలే అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

రుణాల కోసం నకిలీ ధ్రువీకరణలు


ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

- విజయా బ్యాంకులో 49 ఖాతాలు హోల్డ్
- వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌పై నకిలీ మరకలు ?
- ఎస్సీ కార్పొరేషన్‌లో వెలుగుచూస్తున్న అక్రమాలు
- లబ్ధిదారుల్లో ఆందోళన

దళితులకు స్వయం ఉపాధి కల్పించి, వారు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు ఏటా వందల కోట్ల నిధులు కేటాయిస్తున్నది. అయితే 2016-17 సంవత్సరానికి బ్యాంకుతో సంబంధం లేకుండా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నేరుగా అందించే రుణాలలో అప్పటి ఈడీ చేతివాటం ప్రదర్శించారు. దీంతో రుణాలు పక్కదారి పట్టి ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది.

- నెల్లూరు (వేదాయపాళెం)

● అన్నీ నకిలీ ధ్రువీకరణలే..

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలకు సంబంధించి రూపాయల వరకు ఒక ప్రభుత్వ ఉద్యోగి, అంతకు మించి ఉన్న రుణాలకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు హామీ సంతకాలు చేసి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి. దళారులు చెప్పిన వారికే రుణాలు మంజూరు చేసిన గత ఈడీ జయరాం హామీ ధ్రువీకరణ పత్రాలపై కనీసం విచారణ చేయకుండా వచ్చిందే తడవుగా రుణాల మంజూరు చేశారు. అదే విధంగా ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ కింద రుణాలకు సంబంధించి మున్సిపల్ అధికారి నుంచి కానీ, మండల స్థాయిలో ఈవో గానీ సదరు లబ్ధిదారుడు పనిచేస్తున్నాడనో, లబ్ధిదారుడి తండ్రి లేదా తల్లి పనిచేశారనో ధ్రువీకరిస్తూ ఓ పత్రం ఇవ్వాలి. ఈ ధ్రువీకరణ పత్రాలను ఒకటికి రెండు పర్యాయాలు విచారణ చేసినట్లు చూపిన గత ఈడీ కనీసం ఒక్కసారి కూడా విచారణ చేపట్టలేదని సమాచారం. వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ సైతం పనిచేయని వారికి కూడా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నట్లు తెలుస్తున్నది.

● 49 ఖాతాల హోల్డ్

విజయా బ్యాంకు ద్వారా అర్హత లేని లబ్ధిదారులకు రుణాల పేరిట నిధులు బదలాయించి ఈడీ జయరాం భారీగా ముడుపులు తీసుకున్నట్లు సమాచారం. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన ప్రస్తుత ఈడీ అంబేద్కర్ కలెక్టర్ అనుమతితో 49 బ్యాంకు ఖాతాలను హోల్డ్ చేసినట్లు తెలిసింది. ఇప్పటికే భూమి కొనుగోలు పథకానికి కమిటీ అనుమతులు లేవని, కోట్లు చేతులు మారినట్లు ప్రాథమికంగా తేలడంతో కలెక్టర్ ఆ ఫైల్‌ను వెనక్కు పంపారు. దీంతో పాటు దీనిపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి తరువాత కొత్తగా ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ కింద కలెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ అనుమతి లేకుండా మంజూరు చేసిన 43 యూనిట్లను కూడా రద్దు చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌లో జయరాం ఎఫ్ఏసీ ఈడీగా ఉన్న మూడు నెలల కాలంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు సమాచారం.

● లబ్ధిదారుల ఆందోళన

2016-17 సంవత్సరానికి ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలకు సంబంధించి లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దళారుల ద్వారా లక్షల్లో ముడుపులు తీసుకుని ఈడీ జయరాం రుణాలు మంజూరు చేయడం, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల నేపద్యంలో అసలు ఏం జరుగుతుందో అర్థం కాక ప్రతి నిత్యం ప్రస్తుత ఈడీ వద్దకు లబ్ధిదారులు వచ్చి తమ గోడును చెప్పుకుంటున్నారు. అసలు విషయం చెప్పకున్నా తమకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు ఆందోళన చెందుతున్నారు. జాయింట్ కలెక్టర్ 2 వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న రెండు విచారణలు పూర్తయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని, రుణాల రికవరీ చేస్తారన్న నేపథ్యంలో ఏం చేయాలో తోచక లబ్ధిదారులు తాము ముడుపులు ఇచ్చిన దళారులను నిలదీస్తున్నట్లు సమాచారం. దళారులు ఎస్సీ కార్పొరేషన్‌లో జరుగుతున్న అసలు విషయం లబ్ధిదారులకు చెప్పకుండా ప్రస్తుత ఈడీపై లేనిపోని మాటలు చెబుతున్నట్లు తెలుస్తున్నది. ఏది ఏమైనా ఎస్సీ కార్పొరేషన్‌లో ప్రతి రోజూ ఏదో ఒక కుంభకోణం వెలుగుచూస్తుండడంతో అటు అధికారుల్లో, ఇటు దళిత సంఘాల నేతల్లో ఆందోళన నెలకొంది.

జిల్లాలో ఎక్సైజ్ తనిఖీలు

- 21 దుకాణాలపై కేసులు
- 5 బెల్టు దుకాణాల సీజ్

నెల్లూరు (క్రైం) : ఎక్సైజ్ అధికారులు ఆదివారం జిల్లావ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాలపై తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చెన్నకేశవరావుల బృందం చేపట్టిన ఈ తనిఖీల్లో పలు దుకాణాలు నిబంధనలకు విరుద్దంగా నిర్వహిస్తున్నారని గుర్తించారు. ఇష్టానుసారంగా మద్యం విక్రయాలతో పాటు బార్‌ల మాదిరిగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేయడం, తినుబండారాలు విక్రయించడం తదితర నిబంధనల ఉల్లంఘనలను ఉల్లంఘించడాన్ని గుర్తించారు. దీంతో నెల్లూరు నగరంలో 10, రూరల్‌లో 3, సూళ్లూరుపేటలో 3, కావలి, ఇందుకూరుపేట, వాకాడు, గూడూరు, రాపూరులలో ఒక్కోదుకాణంపై కేసులు నమోదు చేశారు. అలాగే రూరల్ 2, బుచ్చిలో 2, ఇందుకూరుపేటలో 1 నిర్వహిస్తున్న మొత్తం ఐదు బెల్టు దుకాణాలను సీజ్ చేశారు. సంబంధిత దుకాణాలపై నివేదికలు సిద్ధం చేసి కమిషనర్‌కు పంపించారు. కమిషనర్ ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

మైనారిటీ కార్పొరేషన్ ఈడీగా నారాయణ



నెల్లూరు (వేదాయపాళెం) : మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీగా కందగడ్ల నారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు విజయనగరం ఈడీగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఈడీ(ఎఫ్ఏసీ)గా ఉన్న సబీహా పర్వీన్ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు వెళ్లారు.

సాగులో ఉన్న వరి పైరు



రైతులకు 'కార్పొరేట్' వల

- అన్నదాతల అయోమయం
- అధికంగా పురుగుమందుల వాడకం
- చివరికి మోసపోతున్న వైనం
- పత్తాలేని వ్యవసాయశాఖాధికారులు

నెల్లూరు (వ్యవసాయం):

'మీ పంటకు ఆకుముడత సోకిందా.. పురుగులు కాండాన్ని విరిచేస్తున్నాయా... వేసిన నారుమళ్లు బలహీనంగా ఉన్నాయా.. అయితే మా కంపెనీ మందునే వాడండి. పురుగులు నాశనం కావడంతో పాటు ఊహించని దిగుబడులు మీసొంతం'...

'నెల రోజుల్లో చేతికందిన మీపంట చేజారుతుందనే ఆందోళన కలుగుతుందా.. ఎర్రతెగులు సోకుతుందా.. నారుమళ్ల నుంచి ఆకుమచ్చ అలాగే ఉందా.. ఎన్ని మందులు వాడిన మోముపిప్పి పోవడంలేదా... ఇట్టే మీ సమస్యకు పరిష్కారం చూపుతాయి మా కంపెనీ మందులు. ఎందరో రైతులు నమ్మకాన్ని నిలబెట్టిన మా మందు వాడండి... కీటకాలను తరిమికొట్టండి'...

ఇవి.. రైతులకు ఎరవేస్తూ ప్రైవేట్ కంపెనీలు చెబుతున్న మాటలు. అన్నదాతలకు పూర్తిగా అవగాహన లేకపోవడం తో వారు చెప్పే మాటలు నమ్ముతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలలో తొలిదశ పంట వేశారు. ఇప్పటికే సాగులో ఉన్న నెల్లూరు పెద్ద జిలకర, (బీపీటీ 5204), నెల్లూరు చిన్న జిలకర్లు (ఎన్ఎల్ఆర్ 34449) బుడ్డలు (ఎంటీయూ 1010,) రకాల పంట కొద్దిరోజులకు చేతికందుతుంది. అక్కడక్కడ మరో నెల రోజుల్లో పంట చేతికొస్తుంది. ఈ దశలో వైరస్ వ్యాధులు పంటను ఆశించాయి. దీంతో రైతులు ఇష్టానుసారంగా పురుగుమందులు వాడేస్తున్నారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా దోమపోటు, ఆకు పుసుపుగా మారడం, బీపీటీలకు ఎర్రతెగుళ్ళ, కాండం కుళ్ల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. వీటి పరిష్కారానికి ఆలోచిస్తున్న రైతులు వెంటనే వ్యాధులు తగ్గుముఖం పట్టేందుకు ప్రైవేట్ కంపెనీలు సూచనల మేరకు మందులు వాడుతున్నారు. అవి ఎక్కువగా నకిలీలు రావడంతో రైతులు నష్టపోతున్నారు.

పురుగుమందు పిచికారి చేస్తున్న వ్యవసాయ కూలీ



● అధికంగా యూరియా వినియోగం

ఎకరాలకు రెండు బస్తాలు మాత్రమే యూరియా వాడాల్సి ఉండగా 10 బస్తాలకుపైగా వాడుతున్నారు. రోగాలను నియంత్రంచడంలో భాగంగా కార్పొరేట్ కంపెనీల ఏజెంట్ల తాకిడికి రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దుక్కిలో రసాయనిక ఎరువులను కలుపుతూనే పంట తొలి దశ నుంచి మలిదశ వరకు రసాయనిక మయం చేస్తున్నారు.

● అధికారులు ఎక్కడ..?

ఖరీఫ్‌లో 18 వేల హెక్టార్లలో వరి సాగైంది. నెల పైరులో వర్షాలు, ఎండలకు వైరస్ వ్యాధులు సోకుతున్నాయి. వీటిపై ఎప్పటికప్పుడు రైతుల్లో అవగాహన పెంచాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు ప్రస్తుత సీజన్‌లో పత్తాలేకుండా పోయారు.

● ఇతర పంటలది అదే స్థితి

ఖరీఫ్‌లో వరి పైర్ల పైనేకాకుండా వరి ప్రత్యామ్నాయ పంటలపైనా ప్రైవేటు కంపెనీలు ప్రతాపం చూపుతున్నాయి. పత్తికి దోమల బెడద ఎక్కువగా ఉండటంతో వ్యాధుల నివారణ మందుల పేరిట రూ. కోట్ల సొమ్మును ఈ కంపెనీలు కొల్లకొడుతున్నాయి. మొక్కజొన్న, మినుము, పెసర, రాగులు, కూరగాయలు, చెరకు, పూల తోటలకు రోగాలు చుట్టుముడుతుండడంతో నివారణ మార్గాల అన్వేషణలో రైతులు కార్పొరేట్ కంపెనీల మాయలో పడి విచ్చలవిడిగా మందులు కొనుగోళ్లు చేస్తున్నారు. చివరకు నకిలీవని తెలిసి మోసపోతున్నారు.



మక్కాకు చేరిన జేసీ ఇంతియాజ్

- సంప్రదాయ దుస్తుల్లో ప్రార్థనలు

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మక్కాకు చేరుకున్నారు. సంప్రదాయ దుస్తులలో ప్రార్థనలు చేశారు. 40రోజుల హజ్ యాత్రలో భాగంగా ఇంతియాజ్ మక్కాకు వెళ్లారు. బక్రీద్ పండుగను అక్కడే జరుపుకోనున్నారు. వచ్చేనెల 6న నెల్లూరుకు తిరిగి వస్తారని, 7న విధులకు హాజరవుతారని తెలిసింది.

ఆలయాలే గ్రామాల సంపద

ఇందుకూరుపేట : తీర ప్రాంతంలో ఆలయాలు నిర్మించేందుకు సమరసత సిద్ధంగా ఉందని నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం గంగపట్నం గిరిజన కాలనీలో నిర్మిస్తున్న రామమందిరం నిర్వాహణ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో దళిత, గిరిజన తీర ప్రాంత వాడల్లో ఆలయాలు లేని ప్రతి చోటా టీటీడీ ఆర్థికసాయంతో ఆలయాలు నిర్మిస్తామని తెలియజేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న రామమందిరం పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, సమరసత సభ్యులు పాల్గొన్నారు.

వాళ్లు ఆడిందే ఆట..పాడిందే పాట


కోవూరు కాలువ వద్ద లోడు చేస్తున్న ధాన్యం

- మిల్లర్లు దళారులు మిలాఖత్
- పెరగని ధాన్యం ధరలు
- నష్టపోతున్న అన్నదాతలు

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: ధాన్యం ధరల విషయంలో దళారులు, మిల్లర్లు ఆడిందే ఆట..పాడిందే పాటగా మారింది. రెండోపంట ధాన్యంకూడా వారు నిర్ణయించిన ధరలకు రైతులు అమ్ముకోవాల్సి వస్తోంది. రెండో పంట నాట్లు వేసినప్పటినుంచి నాలుగు నెలలుగా రేయనక, పగలనక కంటిమీద కునుకులేక అష్టకష్టాలు పడి పంటలు పండించుకుంటే తీరా అమ్ముకునే సమయానికి గిట్టుబాటు ధరల్లేక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వర్షాభావంతో చెరువులు ఎండిపోవడం, భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయబోర్లుతో సైతం నిలచిపోయిన బాధతో పంటలు ఎలా చేతికొస్తాయిరా దేవుడా అని రైతులు విలపిస్తుంటే దళారులు, మిల్లర్లు మిలాఖత్‌తో వచ్చిన అరకొర ధాన్యం ధరలు తగ్గిపో యాయి. రూ.15వేలకు పైగా ధరలు పలకాల్సిన నెల్లూరు జిలకర్ర 14వేలు, రూ. 13,900 ధరలకే రైతన్నలు అమ్ముకోక తప్పడంలేదు. జిల్లాలో రెండోపంట సాగుచేసుకునేది ఎక్కువగా బుచ్చిరెడ్డిపాళెం. కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరుతోపాటు మరో 5,6 మండలాల్లో మాత్రమే జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల ఎకరాల్లో రైతులు రెండో పంట సాగుచేసుకునే అవకాశం ఉంది. రెండో కారు వరి అతి తక్కువ మంది రైతులు సాగుచేశారు. సాధారణంగా సాగు తక్కువగా ఉంటే ధరలు పెరగాల్సింది పోయి తగ్గిపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరికోతలు మొదలైనప్పటి నుంచి నెలరోజులుగా పుట్టి నెల్లూరు జిలకర్ర ధాన్యం రూ.14వేలకు మించి ధర లేదు. పైగా ఇంకా రూ.100, 200లు తగ్గుతుండడంతో రైతన్న దిగాలు పడుతున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధాన్యా నికి కొంత గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఈసారి రెండోపంట నష్టమే



చెరువులు, బోర్లు ఎండిపోవడంతో రెండో పంట దిగుబడులు కూడా చాల వరకు దిగజారాయి. కోవూరు కాలువ సమీపంలో ఏడెకరాల్లో రెండో కారు వరి వేశాను. నీరులేక పంటలు దెబ్బతిన్నాయి. దినికితోడు పుట్టి ధాన్యం రూ.14వేలకు మించడంలేదు. రైతులు ఎక్కువ మాట్లాడితే మరో వంద రూపాయలు తక్కువగానే అడుగుతున్నారు. మిల్లర్లు అడిగిన ధరలకు అమ్మకోక తప్పలేదు.

సుప్రసాద్‌రెడ్డి, రైతు, పొట్టేపాళెం.

పెట్టుబడులొస్తే చాలు



పెట్టుబడులైనా చేతికొస్తే చాలురా దేవుడా అనుకుంటున్నా. రెండెకరాల్లో రెండోపంట వేస్తే నీళ్లులేక దిగుబడి తగ్గిపోయింది. గత సీజన్‌లో కనీసం మొదట్లో నెలరోజులకు పైగా పుట్టి ధాన్యం రూ. 15వేలు పలికింది, రెండో కారులో కనీసం తొలినుంచే రూ.14వేలకు మించలేదు, ఇంకా రూ.100 తక్కువగానే ఉంది. మిల్లర్లు చెప్పిందే ధర. రైతుల గిట్టుబాటు ధర గురించి పట్టించుకునే అధికారులే కరువయ్యారు.

- టీ. కృష్ణారెడ్డి, రైతు, పెనుబల్లి

గిరిజనులపై ఎక్సైజ్ కానిస్టేబుల్ దౌర్జన్యం


ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను గిరిజనులు ముట్టడించారు. ఆదివారం గంగపట్నం, ఇందుకూరుపేటకు చెందిన గిరిజనులు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో బైఠాయించి వారికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. గంగపట్నంలో ఆక్వా కయ్యల్లో పనిచేస్తున్న గిరిజన కూలీలు కొందరు 11 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి వెళుతుండగా ఎక్సైజ్ కానిస్టేబుల్ బెల్టు షాపుల కోసమేనని వారిని అడ్డుకున్నారు. బెల్టుషాపులకు కాదని గిరిజనులు చెప్పినా పోలీసులు పట్టించుకోలేదు. ఒక గిరిజనుడిని బలవంతంగా గంగపట్నం నుంచి ఇందుకూరుపేట ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై గంగపట్నం, ఇందుకూరుపేట గిరిజనులు దాదాపు 100 మంది స్టేషన్‌ను ముట్టడించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గిరిజనులపై అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారని, లాకప్‌లో ఉన్న గిరిజన కూలీని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ ఎస్సై, సీఐలు అందుబాటులో లేకపోవడంతో సాయంత్రం వరకు స్టేషన్ ముందే ధర్నా చేశారు. వారికి ఫోన్‌లు చేసినా స్పందించలేదు. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని గిరిజనులు తెలిపారు.

గాంధీజీ సిద్ధాంతాలే శరణ్యం


తరగతుల్లో మాట్లాడుతున్న నిర్వాహకులు

ఇందుకూరుపేట : గాంధీజీ సిద్ధాంతాలు భారతావనికే కాకుండా ప్రపంచానికి ఆదర్శనీయమని విశ్రాంత బ్యాంకు మేనేజర్, భగవద్గీత ప్రవచకులు షేక్.నజీర్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పల్లెపాడు పినాకిని ఆశ్రమంలో గాంధీజీ ఫిలాసఫీ తరగతులను వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం, రాజకీయాలు అనే విషయాలపై వారికి బోధించారు. మతం అనేది భ్రమ మాత్రమేనని, దేవుడు విశ్వజనీయమని, సమస్త మానవులలో ఒక దైవ శక్తి ఉందన్నారు. అసలు మనిషిలోనే కొన్ని అద్భుత శక్తులున్నాయని, మనిషిని మించిన దేవుడు లేడని, మనిషిలోనే గొప్ప మానవతా విలువలు, దేవుని ప్రతిరూపమైన అంశాలెన్నో ఉన్నాయని తెలిపారు. రాజకీయాల్లో కూడా ప్రజల శాంతి, ప్రజల సుఖసంతోషాలు ఉన్నాయన్నారు. అవే నిజమైన రాజకీయమని ఆయన వివరించారు. నిర్వాహకులు గణేశం కృష్ణారెడ్డి, గూడూరు లక్ష్మీ, నేదురుమల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

యువతకు పలు పథకాలు

కోవూరు: ముఖ్యమంత్రి యువతకు ఉపాధి కోసం పలు పథకాల్ని ప్రవేశపెడుతున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. పట్టణంలోని కొత్తూరులో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలన్నింటినీ వివరిస్తూ గ్రామాల్లో ప్రచారం చేయాలని కోరారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఏలూరుకృష్ణయ్య , సూరిశెట్టి శ్రీనివాసులు, పెనుమల్లి శ్రీహరిరెడ్డి , ఇందుపూరు మురళీ కృష్ణారెడ్డి, కె సత్యనారాయణరెడ్డి,సాయి తేజారెడ్డి పాల్గొన్నారు.

27న వైసీపీ సమావేశం

కోవూరు: పడుగుపాడులోని రుక్మిణీ కల్యాణ మండపంలో ఈ నెల 27న వైసీపీ నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీల సమావేశం జరుగుతుందని మాజీ శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమారెడ్డి తెలిపారు. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

మొక్కుబడిగా వయోజనులకు ఎన్ఐఓఎస్ పరీక్షలు

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: మండలంలోని 14 పంచాయతీలలో వయోజనులకు ఆదివారం 15వ విడత నేషనల్ ఎన్‌స్టంట్ ఓపెన్ స్కూల్ పరీక్షలు మొక్కుబడిగా నిర్వహించారు. పలు గ్రామాల్లో నిర్వహించిన ఈ ఎన్ఐఓఎస్ పరీక్షలు రాయాల్సిన వయోజనులకోసం ఆయా గ్రామాల సాక్షరభారత్ వాలంటీర్లు వేచి చూడాల్సి వచ్చింది. కాగా 3 గ్రేడ్‌తోపాటు గత సంవత్సరం నిర్వహించిన పరీక్షలకు గైర్హాజరైన వారు మొత్తం 274 మంది ఈ పరీక్షలకు హాజరైనట్లు మండల కో-ఆర్డినేటర్ సంపత్ తెలిపారు. 2,3, గ్రామాల్లో మాత్రమే మండల కో-ఆర్డినేటర్ పర్యవేక్షించగా మిగిలిన గ్రామాల్లో ఆయా గ్రామాల వాలంటీర్లే పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శాఖాపరంగా ఇచ్చిన టార్గెట్ ప్రకారం 100శాతం వయోజనులతో పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలు ఆయా గ్రామ పంచాయతీల్లోని పాఠశాలలు, వయోజన విద్యా కేంద్రాల్లో నిర్వహించామని తెలియజేశారు. పలు పాఠశాల ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారని ఆయన తెలిపారు.

విషాదంలో అనంతనారాయణపురం

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: బుచ్చిమండలం నాగాయగుంట పంచాయితీ అనంతనారాయణపురం గ్రామంలో విషాదం నెలకొంది. అనంతనారాయణపురం గ్రామంలోని శాంతి కుమారి హైదరాబాద్‌లో అనుమానాస్పద స్థితిలో శనివారం మృతిచెందింది. మృతురాలి భర్త నెల్లూరు విక్రమ్‌నగర్‌కు చెందిన మహేష్. ఇతడు తన భార్య మృతదేహాన్ని ఆదివారం నెల్లూరుకు తీసుకొచ్చాడు. ఈ విషయాన్ని ఆమె కుటుంబసభ్యులకు తెలియజేయలేదు. చుట్టుపక్కల వారు తెలియజేశారు. ఈ విషయం తెలుసుకుని అనంతనారాయణపురంలో విషాదం అలుముకుంది. శాంతికుమారిని భర్తే హత్యచేసి ఉంటాడని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మృతురాలి తల్లి గోవిందమ్మ పక్షవాతంతో బాధపడుతోంది. కుమార్తె మరణవార్త విని ఆమె కన్నీళ్ల పర్యంతమైంది. అలాగే తండ్రికి మతిస్థిమితం లేదు. ఈ పరిస్థితిలో కుమార్తె మృతితో ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. తన కుమార్తెను అత్తింటివారే చంపేసి ఆత్మహత్యగా చిత్రించారని ఆరోపించింది.

అభివృద్ధే టీడీపీ ప్రభుత్వ ధ్యేయం


వైసీపీ ఉప సర్పంచుని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పోలంరెడ్డి

కొడవలూరు: అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని రేగడచెలిక పంచాయతీ పరిధిలో సుమారు రూ. 16 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీకి చెందిన రేగడచెలిక పంచాయతీ ఉప సర్పంచు చెముకుల శ్రీనివాసులు, ముగ్గురు వార్డు సభ్యులతోపాటు కొంత మంది కార్యకర్తలు ఎమ్మెల్యే పోలంరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే టీడీపీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో ఉన్న అందరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. నియోజకవర్గంలో నీరు-ప్రగతి కింద రైతులకు అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై రేగడచెలిక వైస్ సర్పంచు శ్రీనివాసులు,కార్యకర్తలు పార్టీలో చేరారని వివరించారు. 2019లో జరిగే శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఇరువూరు శ్రీధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు చెముకుల వెంకయ్య, ప్రధాన కార్యదర్శి పాటూరు రమేష్, నీటి సంఘాల అధ్యక్షులు వెంకటేశ్వర్లురెడ్డి, సతీష్‌రెడ్డి, మల్లికార్జున, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో పందుల బెడద


రోడ్డుపైనే తిరుగుతున్న పందులు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలో పందుల బెడద అధికమైంది. అంటు వ్యాధులు ప్రబలుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుచ్చి నడిబొడ్డునే పలువురు పందుల పెంపకం స్థావరాలు ఏర్పాటు చేసుకొని వాటిని పోషిస్తున్నారు. అధికారులు స్పందించి పందులు వీధుల్లో తిరగకుండా చూడాలని కోరుతున్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన

ఉదయగిరి: గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన సాధ్యమని ఉదయగిరి గ్రంథాలయాధికారి షేక్ ఫజులుల్లా అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో పుస్తకాల సేకరణ ప్రారంభించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన పెట్టెలో పలువురు తమ ఇళ్లలోని పుస్తకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల ద్వారా సేకరించిన విలువైన పుస్తకాలను అందుబాటులో ఉంచి పాఠకులకు ఉపయోగపడేలా చూస్తామన్నారు. ప్రతిఒక్కరు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నారు.

పంట కాలువలిలా..

నీరు పారేదెలా?

పంట కాలువలు నిర్వహణకు నోచు కోక పోవడంతో, పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగిపోవడం, పలు చోట్ల పూడిపోవడంతో వర్షాలు వచ్చినా, పొలాలకు నీరు అందే పరిస్థితి లేదని ఉదయగిరి నియోజకవర్గంలోని రెతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఉదయగిరి రూరల్

ఉదయగిరి నియోజకవర్గంలో వ్యవసాయానికి వర్షమే ఆధారం. చెరువుల్లో నీరు చేరితే, ఆయకట్టు భూముల్లో వరితోపాటు, ఆరుతడి పంటలుసాగు చేస్తారు. కొన్నేళ్లుగా ఆశించిన వర్షపాతం లేకపోవడంతో జలాశయాలన్నీ దాదాపుగా ఎండిపోయాయి. ఇప్పుడిప్పుడే అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలు కురిసి చెరువుల్లో నీరు చేరినా , పంట కాలువలు అధ్వానంగా ఉండడంతో తమ పొలాలకు నీరు చేరే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు-చెట్టు పథకంలో భాగంగా కోట్లాది రూపాయల నిధులు విడుదల చేసినా పంట కాలువలు అభివృద్ధికి నోచుకోవడంలేదు.

నియోజకవర్గంలో సుమారు 280 చెరువుల కింద 30 వేల హెక్టార్ల ఆయకట్టు ఉంది. ఈ చెరువుల పంట కాలువలు నిర్వహణ లేకపోవడంతో చెట్లు పెరిగిపోయి మూసుకుపోయాయి. కొన్ని చెరువుల కాలువలు, తూములు శిథిలావస్థకు చేరాయి.గండిపాళెం, మర్రివూట్ల, నక్కలగండి రిజర్వాయర్ల కింద 20 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. సమృద్ధిగా వర్షాలు కురిసి వాటిల్లో నీరు చేరినా, కాలువలు పూడిపోవడంతో నీరు వృథా అయ్యే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. నాలుగేళ్ల క్రితం రూ.25 కోట్ల జపాన్ నిధులతో గండిపాళెం జలాశయ ఆధునికీకరణ పనులు చేశారు. ఈ జలాశయం పరిధిలోని ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో కుడి, ఎడమ కాలువల కింద 17 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. ప్రస్తుతం వాటి పరిస్థితి అధ్వానంగా ఉండడంతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు చేరే పరిస్థితి లేదు. కుడి కాలువ మొదటి డిస్ట్రిబ్యూటరీ ప్రధాన కాలువ కంటే ఎత్తులో ఉండడంతో ఆ కాలువ కింద సుమారు 200 ఎకరాలకు సాగు నీరు అందడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట కాలువల్లో పూడిక తీయించి నీరు సజావుగా పారేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.


చిల్లచెట్లతో నిండిన చెరువు పంట కాలువ


జలాశయం ఎడమ ప్రధాన కాలువ దుస్థితి

అధికారులు పట్టించుకోవడంలేదు



గండిపాళెం జలాశయం కుడి కాలువ మొదటి డిస్ట్రిబ్యూటరీ ప్రధాన కాలువ కంటే ఎత్తులో ఉంది. దీంతో పంట పొలాలకు నీరు అందడంలేదు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాల్లేవు.

- నరసింహారావు, ఉప సర్పంచు, గండిపాళెం

నీరు పారడం కష్టమే



కాలువలు పూర్తిగా పూడిపోయి, చెట్లు పెరిగిపోవడంతో పొలాలకు నీరు అందడం కష్టంగా మారింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చెరువుల్లో నీరు చేరినా, ఆయకట్టులో సాగు కష్టమే.

- రమణారెడ్డి, రైతు, గుడినరవ

రేపు వైద్యశిబిరం

వింజమూరు: స్థానిక మాశిలామణి వైద్యశాలలో మంగళవారం నెల్లూరు అపోలో సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ కె.మాశిలామణి ఆదివారం తెలిపారు. గుండె, కిడ్నీ, మూత్రకోశ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

వింజమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీన సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.ప్రత్యూష ఆదివారం తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు.

ఉదయగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీన సబ్సిడీ రుణాలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరాస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓపీఎంఎంఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, స్క్రీనింగ్ కమిటీ సభ్యులు, బ్యాంకర్లు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

చిరుజల్లులతోనే సరి..

ఉదయగిరి రూరల్: ఉదయగిరి మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం చిరుజల్లులతోనే సరిపెడుతుండడంతో అటు రైతులు, ఇటు ప్రజలు నిరాశ చెందుతున్నారు. రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు పడుతున్నా ఇక్కడ మాత్రం సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నాలుగేళ్ల పరిస్థితులే పునరావృతమవుతాయని రైతులు భయపడుతున్నారు.

ప్రజా నాట్యమండలి కమిటీ ఎంపిక

వింజమూరు: ప్రజా నాట్యమండలి వింజమూరు, దుత్తలూరు నూతన కమిటీలను ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి పి.విజయకుమార్ తెలిపారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జీ.తిరుమలయ్య, ఎల్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడుగా ఏ.సింహాద్రి, కోశాధికారి లక్ష్మిరెడ్డిలను ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ ప్రజల కోసమన్నారు. అదే ఆశయంతో 1943లో ఈ సంస్థ ఏర్పడిందన్నారు. సెప్టెంబర్ 10న స్థానిక సీపీఎం కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దేశభక్తి, అభ్యుదయ గీతాల శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జే.లక్ష్మినరసయ్య, శ్రీను, రవి తదితరులున్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన


సభ్యులకు అవగాహన కల్పిస్తున్న శ్రీహరి

వింజమూరు: పంచాయతీ పరిధిలోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో నీపాప, రెమెడీ సంస్థల సహకారంతో మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీపాప మండల హైజీన్ ఎడ్యుకేటర్ వాగాల శ్రీహరి మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగంపై ప్రతి కుటుంబంలో సభ్యులు, మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరుబయట మలవిసర్జన ద్వారా ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధుల వ్యాపించే అవకాశముందన్నారు. గర్భిణులు, కిశోర బాలికలు, వయసు పైబడిన వారు మరుగుదొడ్లను వినియోగించడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వాట్సన్ ఆర్గనైజర్ ఎం.మాధవి, నీపాప అధ్యక్షురాలు రమణమ్మ, అరుణ, ఇతర కమిటీ సభ్యులు హాజరయ్యారు.

పిల్లల భవిష్యత్తుకు తల్లిదండ్రులదే బాధ్యత

వింజమూరు: పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు బాధ్యత కలిగి ఉండాలని డిగ్రీ కళాశాల బాలికల వసతిగృహ సంక్షేమాధికారిణి సుమలత తెలిపారు. ఆదివారం స్థానిక వసతిగృహంలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను కళాశాలలు, వసతిగృహాల్లో వదిలేసి బాధ్యత తీరిపోయిందని అనుకోరాదన్నారు. ప్రతి మూడు నెలలకోసారి జరిగే తల్లిదండ్రుల సమావేశానికి తప్పక హాజరై తమ పిల్లల అభివృద్ధిని తెలుసుకోవాలన్నారు. . వసతిగృహంలో ఉన్న విద్యార్థులు గతేడాది 92 శాతం ఫలితాలు సాధించారని, ఈసారి నూరు శాతం సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతాజీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాంగోపాల్, తల్లిదండ్రులు, విద్యార్థులున్నారు.

ప్రశాంతంగా ఎన్ఐవోఎస్ పరీక్ష

ఉదయగిరి: మండలంలో ఆదివారం జరిగిన సాక్షరభారత్ పరీక్ష కేంద్రాలను ఎంపీడీవో వీరాస్వామి తనిఖీ చేశారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లోని పరీక్ష కేంద్రాల్లో 247 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ తాహెర్, గ్రామ కోఆర్డినేటర్ నాజియ, ఇన్విజిలేటర్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలో ఎన్ఐవోఎస్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 24 పంచాయతీల్లో 606 మంది పరీక్షలకు హాజరయ్యారు. మండల కోఆర్డినేటర్ డీవీ రమణయ్య తనిఖీ చేశారు.

వింజమూరు: సాక్షరభారత్ ఆధ్వర్యంలో ఎన్ఐవోఎస్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. డివిజన్ కోఆర్డినేటర్ వి.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 12 పంచాయతీల సాక్షరభారత్ కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. 334 మంది వయోజనులు హాజరయ్యారు. ఊటుకూరు సాక్షరభారత్ కేంద్రంలో ఎం.చెన్నారెడ్డి పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ఎం.బాలకృష్ణారెడ్డి, గ్రామ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరి: పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

చైనా ఉత్పత్తులకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

వింజమూరు: చైనా కబంధ హస్తాల నుంచి దేశాన్ని పరిరక్షించుకునే కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వదేశీ జాగరణ్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక శివాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో చైనాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల ప్రముఖ్ వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ చైనా దురాగతాలను వివరించారు. ఆ దేశ ఉత్పత్తులను బహిష్కరించి మన దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధు, సంజీవరెడ్డి, కిశోర్, అంకిరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంకాళమ్మకు పొంగళ్లు

ఉదయగిరి రూరల్: గండిపాళెం లో ఆదివారం అంకాళమ్మకు పొంగళ్లు నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

దాడి కేసులో వీఆర్ఏ అరెస్టు

వరికుంటపాడు: దాడి కేసులో వీఆర్ఏ ప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ముత్యాలరాజు ఆదివారం తెలిపారు. భోగ్యంవారిపల్లికి చెంది ప్రసాద్ దుత్తలూరు మండలం తిమ్మాపురం వీఆర్ఏగా పని చేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం తిమ్మారెడ్డిపల్లి మద్యం దుకాణం వద్ద ఉన్న వేంపాడు సర్పంచు భర్త మల్లికార్జున తలపై కత్తితో దాడి చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు, నిందితుడిని అరెస్టు చేసి ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ ఎదుట హాజరపర్చడంతో అతనికి 12 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు.

పేరు మార్చబడినది

ఉదయగిరి మండలం దాసరిపల్లి గ్రామానికి **షేక్ మహమ్మద్ అలి**, తండ్రి పేరు ఖాజాపీర్ అనే అతని పేరు **సయ్యద్ మొహమ్మద్అలి**గా మార్చిబడినది.


దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 3


మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యా విషయాల్లో ఆటంకాలు ఎదురవుతాయి. ప్రేమ బెడిసికొట్టే అవకాశం ఉంది. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. పొదుపు పథకాలు, పెట్టుబడుల విషయంలో ఆచితూచి ముందడుగు వేయండి.


వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ వ్యవహారాలు మనస్తాపం కలిగిస్తాయి. బదిలీ ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. కార్యాలయంలో కొంత అసౌకర్యానికి గురవుతారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు.


మిథునరాశి: (మే21-జూన్21): విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాల్సి ఉంటుంది. వాహనాల కారణంగా అసౌకర్యానికి గురవుతాయి. రిప్రజెంటేటివ్‌లు, ఏజెంట్లకు శ్రమాధిక్యం. సమావేశాల్లో మాటపడాల్సి వస్తుంది.


కర్కాటకరాశి: (జూన్22-జూలై23): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులకు ఆటంకాలు కలిగే అవకాశం ఉంది. డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు. రుణప్రయత్నాలు ఫలించకపోవచ్చు. ఖర్చులు అదుపులో పెట్టుకోవాలి.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): మనసును ఏదో వెలితి బాధిస్తుంది. చేపట్టిన పనులకు ఆటంకాలు ఎదురవుతాయి. కొత్తగా చేపట్టే పనుల ప్రారంభాన్ని వాయిదా వేయండి. అన్ని విషయాల్లో శ్రమాధిక్యం తప్పకపోవచ్చు.


కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో అవాంతరాలు ఎదురవుతాయి. దీర్ఘకాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రహస్య సమాచారం అందుకుంటారు.


తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ డిపాజిట్లు, పొదుపు పథకాల వ్యవహారాలకు అనుకూల సమయం కాదు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. స్నేహానుబంధాలు బలపడతాయి.


వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఉద్యోగ, వ్యాపారాల్లో అనుకోని చికాకులు ఎదురవుతాయి. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. గౌరవ, ప్రతిష్ఠలకు భంగం కలిగే అవకాశం ఉంది. సంకల్ప సాధనకు పట్టుదలతో కృషి చేస్తారు.


ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రణాళిక లోపించడం వల్ల లక్ష్యాలు సాధించలేకపోతారు. న్యాయపరమైన వివాదాలకు ఆస్కారం ఉంది. సమావేశాలు, చర్చలు, వ్యూహరచనలకు అనుకూలం. విద్యార్థులకు శుభప్రదం.


మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఆస్పత్రులు, బ్యాంకులు, చిట్‌ఫండ్‌లు, మ్యూచ్యువల్ ఫండ్ రంగాల వారికి ఆర్థికంగా నిరుత్సాహకరం. గ్రాట్యుటీ, బీమా, పింఛన్ వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. బాధాకరమైన సమాచారం అందుకుంటారు.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఆర్థిక విషయాల్లో భాగస్వామి వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వేడుకల్లో ఖర్చులు అంచనాలు మించుతాయి. స్పెక్యులేషన్లు, పెట్టుబడుల్లో నష్టాలు తప్పకపోవచ్చు. సమావేశాల్లో కీలకపాత్ర పోషిస్తారు.


మీనరాశి:(ఫిబ్రవరి19-మార్చి20): వ్యవసాయం, పరిశ్రమలు, హోటల్ రంగాల వారు లక్ష్యసాధనకు అధికంగా శ్రమించాలి. విందుల్లో పరిమితి పాటించాలి. ఇంటర్వ్యూలలో నిరాశ తప్పకపోవచ్చు. ఆస్పత్రులు సందర్శించాల్సి రావచ్చు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సొసైటీ రుణాలకు బీమా చేయండి

● ఏపీజీబీ ఆర్ఎం శివయ్య

నెల్లూరు (సాంస్కృతికం) : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల పరస్పర సహకార సొసైటీ ఇచ్చే రుణాలకు బీమా సౌకర్యం కల్పించాలని ఆ బ్యాంకు ఆర్ఎం బీవీ శివయ్య సూచించారు. ఆ సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఉద్యోగులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివయ్య మాట్లాడుతూ సహకార సొసైటీని 22 సంవత్సరాలుగా ఉద్యోగుల తక్షణ అవసరాలకు భరోసాగా ఉందన్నారు. సొసైటీ ఇచ్చే రుణాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తే సభ్యులకు ప్రమాదం జరిగినప్పుడు రుణభారం ఉద్యోగి కుటుంబంపై పడకుండా చూసే అవకాశం ఉంటుందన్నారు. సొసైటీ సభ్యులు బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అలాగే సొసైటీ సభ్యుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి, సొసైటీ అధ్యక్షుడు పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వారా ఉద్యోగులకు అందించిన సేవలను వివరించారు. లాభాల దామాషా ప్రకారం జీతాలు పెంచాలని, వారానికి ఐదు రోజులు పని దినాలు, నగదు రహిత వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు ఐక్య ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సొసైటీ ఎండీ ఎస్‌వీకే జిలానీ సొసైటీ వార్షిక నివేదికను సభలో చదివారు. 2016 - 17 సంవత్సరానికి వచ్చిన లాభాన్ని గిఫ్టుతో కలిపి 38 శాతం షేరు హోల్డర్లకు డివిడెండ్‌గా అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం సొసైటీ జీవో, ఖర్చులు, ఆడిట్ రిపోర్టులను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సొసైటీ నూతన పాలక మండలి ఎన్నికలు జరిగాయి. 15 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. నెల్లూరుకు చెందిన జి.కృష్ణారెడ్డి ఎండీగా, కె.శోభన్‌బాబు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కాగా, ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందే కొందరు ఐదుగురి పేర్లతో ముద్రించిన పత్రాలు సభ్యులకు పంపిణీ చేయడాన్ని కొందరు ఆక్షేపించారు. దీంతో ఆసక్తికరమైన చర్చ జరిగింది.



మాట్లాడుతున్న ఆర్ఎం శివయ్య

పటిష్ఠ ప్రణాళికతో ఉద్యమించాలి

● ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ చొప్పా

నెల్లూరు(కలెక్టరేట్): ఒక పటిష్ఠ ప్రణాళికతో ఉద్యమం చేసి డిమాండ్లు సాధించుకోవాలని ఏపీజేఏసీ-అమరావతి జిల్లా చైర్మన్ చొప్పా రవీంద్రబాబు వీఆర్‌ఏలకు సూచించారు. ఆదివారం నెల్లూరులోని ఎన్జీవో హోంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో వీఆర్‌ఏలకు జీతం రూ.13500 ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.6400 మాత్రమే ఉందన్నారు. కనీస వేతనం రోజుకు రూ.450 ఉండాలన్నారు. రెవెన్యూలో ముఖ్యమైన వీఆర్‌ఏలకు కనీస వేతనం కూడా అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏలకు రెండు నెలలకోసారి కూడా జీతాలు అందటం లేదన్నా రు. మూడేళ్ల సర్వీసు పూర్తయి, అర్హత కలిగిన వీఆర్‌ఏలకు వీఆర్వో, అటెండర్లు, వాచ్‌మెన్‌లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. అనారోగ్యం, వయోభారంతో బాధపడుతున్న వీఆర్‌ఏల స్థానంలో నామినీ పద్ధతిలో వారి కుటుంబ సభ్యులలో అర్హులను నియమించాలన్నారు. అన్ని రకాల సెలవులు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ వీఆర్‌ఏల డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదనరావు, జిలా అధ్యక్షుడు ముత్యం నరసింహులు, జిల్లా కార్యదర్శి పెంచలరెడ్డి, ఏపీజేఏసీ-అమరావతి జిల్లా కార్యదర్శి సుధాకర్, వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షుడు పంట అశోక్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చొప్పా రవీంద్రబాబు

చాకిరీ చేయించుకున్న కాపులు

బీసీలలోకా..?

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

నెల్లూరు (వేదాయపాళెం) : మొదటి నుంచి బీసీలతో చాకిరీ చేయించుకున్న కాపులు ఇప్పుడు తమనూ బీసీల్లో చేర్చాలని కోరడం హాస్యాస్పదంగా ఉందని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు విమర్శించారు. ఆదివారం నెల్లూరులోని సంఘం కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడారు. కాపులకు మొదటి నుంచి వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉందన్నారు. బీసీలలో చేర్చడానికి సాంఘిక, విద్యా రంగాలలో వెనుకబాటు తనమే అర్హతగా పరిగణిస్తారని చెప్పారు. రాజకీయ రంగంలో రిజర్వేషన్లు వద్దని కాపులు చెప్పినంత మాత్రాన విద్యా, ఉద్యోగ రంగాలలో అర్హత ఉన్నట్టు కాదన్నారు. అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న కాపులను బీసీల్లో చేర్చొద్దని డిమాండ్ చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని జాట్, మార్వాడీ, పటేల్ వంటి కులాలకు వెనుకబాటుతనం లేదని, వాటిని బీసీల్లో చేర్చడం కుదరదంటూ న్యాయ స్థానాలు ఇచ్చిన తీర్పులను పట్టించుకోకుండా కాపులకు రిజర్వేషన్లు ఇస్తామని సీఎం చెప్పడం బీసీలకు అన్యాయం చేయడమేనన్నారు. అంగిరేకుల ఆదిశేషు, దేవరాల సుబ్రహ్మణ్యం, ఒట్టూరు సంపత్‌రాజ్, బెల్లంకొండ శ్రీనివాసులు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


పరీక్ష రాస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట : ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సులెరటెక్ బహుళజాతి కంపెనీలో ఉద్యోగాలకు ఫైనలియర్ సీఎస్ఈ, ఈసీఈ విభాగం విద్యార్థులకు ఎంపికలు జరిగాయి. 70శాతం మార్కులు సాధించిన 110 మంది విద్యార్థులు హాజరై బృంద, రాతపరీక్షలు రాశారు. కంపెనీ ప్రతినిధులు నాగమల్లేశ్వరరావు, శ్రావణ్‌రెడ్డి, రాజా ఉపేంద్ర 25మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఉపాధి కల్పన అధికారి డాక్టర్ కిషింధర్ పర్యవేక్షించారు.

జిల్లా సగటు వర్షపాతం 13.2 మి.మీ.

నెలూరు(కలెక్టరేట్): జిల్లాలో ఆదివారం సగటు వర్షపాతం 13.2 మి.మీ.గా నమోదైంది. అత్యధికంగా తడలో 59.2 మి.మీ. వర్షం పడగా, అత్యల్పంగా అనంతసాగరంలో 5.6 మి.మీ. వర్షం కురిసింది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు పరిశీలిస్తే... సూళ్లూరుపేట 52, కలువాయి 31.6, వెంకటాచలం 30.6, కోట 28.8, డీవీ సత్రం 26.8, పొదలకూరు 25.8, వెంకటగిరి 24.2, వాకాడు 23.4, సైదాపురం 22.8, నాయుడుపేట 20.2, నెల్లూరు 19.2, ముత్తుకూరు 19.2, దక్కిలి 18.4, గూడూరు 17.8, చిట్టమూరు 16.6, ఇందుకూరు పేట 16.6, చిల్లకూరు 15.2, టీపీ గూడూరు 15.6, బాలాయపల్లి 15.2, మనుబోలు 13.2, ఓజిలి 12.8, కోవూరు 11.4, పెళ్లకూరు 10.2, చేజర్ల 8, ఏఎస్‌పేట 8, మర్రిపాడు 7.2, విడవలూరు 7.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

రేపు ఎస్‌డీపీఐ సభ

నెల్లూరు (వేదాయపాళెం) : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మైనారిటీలు, ముస్లింలపై దాడులు ఎక్కువయ్యాయని, దీనికి వ్యతిరేకంగా అందరూ ఏకం కావాలంటూ ఎస్‌డీపీఐ చేస్తున్న ఉద్యమంలో భాగంగా మంగళవారం నెల్లూరు టౌనుహాలు రీడింగ్ రూంలో సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ గని తెలిపారు. ఆదివారం నగరంలోని బాలాజీనగర్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో కొట్టించంపే హంతకుల సమూహాలు ఎక్కువయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న సభకు లౌకికవాదులు, మతసామరస్య వాదులు, దళిత సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ కాసిఫ్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర	-	2,787
సవర (8 గ్రాములు)	-	22,296
వెండి కిలో ధర	-	42,200
వెండి గ్రాము ధర	-	42.20

చికెన్ ధరలు



వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	84
లేయర్	82
స్కిన్ చికెన్	139
స్కిన్‌లెస్ చికెన్	163
లేయర్ మాంసం	140

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	94
లేయర్ లైవ్	82
స్కిన్ చికెన్	154
స్కిన్‌లెస్	180
లేయర్	140

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.2,500 నుంచి రూ. 3,200 వరకు
పండ్లు: రూ.1,500 నుంచి రూ.2,000 వరకు

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:		78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:		6.283 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :		------------
అవుట్‌ఫ్లో	:	350 క్యూసెక్కులు
ఆవిరి	:	44 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం	: ------------
కనిగిరికాలువ :	------------
ఎడమ కాలువ :	------------
కనుపూరు కాలువ:	------------
బీపీఆర్ కాలువ :	------------
నెల్లూరుచెరువుకాలువ :	------------

ప్రకటనల కోసం : 9985411013 దినపత్రిక కోసం : 9985411424

జంబ్లింగ్ వర్డ్స్

1. WLKA ▸ ....
2. NGKI ▸ ....
3. DMBU ▸ ....
4. MEUT ▸ ....

జంతర్‌మంతర్

1. ద్భుఅతం ▸ ....
2. తణంక్ష ▸ ....
3. త్తిడిఒ ▸ ....
4. సంవికా ▸ ....

చెప్పగలరా?

పాలులో ఉన్నా కానీ వేలులో లేను
యతిలో ఉన్నా కానీ గతిలో లేను
సందులో ఉన్నా కానీ విందులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

సూక్తి

మనం ఉన్నతంగా ఎదగడానికీ, నష్టపోవడానికీ కారణం మన ఆలోచనలే.

రోబోల రికార్డ్ బ్రేక్ డ్యాన్స్

రోబో స్టెప్పు వేస్తే.. అదిరి పోతుంది కదూ! మరి ఒకేసారి వెయ్యికి పైగా రోబోలు కదం తొక్కితే.. డ్యాన్సులు చేసి అదరగొడితే అద్భుతం కదా! ఒకే సైజులోని రోబోలన్నీ కాలంలో ఒకే రీతిలో డ్యాన్స్ చేసి 'గిన్నిస్ పుటల్లో' స్థానం పొందాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి పరిచిన 1069 రోబోలు విభిన్నంగా డ్యాన్స్ చేసి చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ రికార్డును సాధించి గిన్నిస్ పుటలకెక్కాయి. డబ్ల్యు.ఎల్ ఇంటిలెజెంట్ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ వీటిని రూపొందించింది. 'వన్ గ్రూప్ కంట్రోల్ సిస్టమ్' ప్రోగ్రామ్ ఆధారంగా ఇవి ఏకకాలంలో డ్యాన్స్ చేశాయి. చిందులతో కదం తొక్కిన ఆ రోబోల పేరు 'దోబి'. చైనాలో గతంలో జరిగిన బీర్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో 1007 రోబోలు బ్రేక్ డ్యాన్స్ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాయి. ఆ రికార్డును 'దోబి' రోబోలు ప్రస్తుతం బద్దలుకొట్టాయి. ఈ దోబి రోబోల ఎత్తు - 47.3 సెంటిమీటర్లు. ఇవి పాటలు పాడటంతోపాటు, ఫుట్‌బాల్ కూడా ఆడతాయి. కుంగ్‌ఫూ కూడా చేయడం విశేషం. వీటి డ్యాన్సింగ్ వీడియోను యూట్యూబ్‌లో గంట వ్యవధిలోనే లక్షల మంది చూశారు.



మీకు తెలుసా?

షాంగై ఎక్స్‌పో పార్క్‌లో గత సంవత్సరం జరిగిన 'ఫ్రాన్స్ నేషనల్ పెవిలియన్ డే'లో సందర్శకులను అలరించేందుకు నిర్వాహకులు 20 రోబోలతో డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాదు వాటితో సాకర్ కూడా ఆడించారు.



'రోబో' స్టెప్పుల రికార్డు

ప్రభుదేవా డ్యాన్స్ మెరుపులు, చిరంజీవి స్టెప్పులు అందరికీ తెలుసు. మరి చిందులేసే రోబోలు తెలుసా? చైనా కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా 540 రోబోలు ఒకే వేదికపై డ్యాన్సులు చేసి అలరించాయి. అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక మంది వీక్షించిన టీవీ ప్రోగ్రామ్‌గా అది రికార్డులకెక్కింది. రోబోలు చిందేస్తుంటే 26 డ్రోన్లు ఆ నృత్యాన్ని వీడియో తీశాయి. చైనా సెంట్రల్ టెలివిజన్(సీసీటీవీ) ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయగా 70 కోట్ల మంది వీక్షించటం విశేషం. ప్రపంచంలోనే అత్యధిక ప్రజలు చూసిన కార్యక్రమంగా రోబో డ్యాన్స్ నిలిచింది. సాహిత్యాన్ని, సంగీతాన్ని అనుసరించి కొరియోగ్రాఫర్లు డ్యాన్స్ కంపోజ్ చేస్తారు. అదే విధంగా రోబోలు సంగీతానికనుగుణంగా నృత్యం చేసేలా వీటిని రూపొందించారు. 'ప్రతి రోబోలో 16 స్టీరింగ్ ఇంజిన్లు ఉన్నాయి. మానవుడి తల, కాళ్లు, చేతులు ఏ విధంగా అయితే కదుపుతారో అదే విధంగా రోబోలు కదలడానికి వీలుగా ఈ స్టీరింగ్ ఇంజిన్స్ ఉపయోగపడతాయి.

రోబోట్ డ్యాన్స్

రోబోలను ఇమిటేట్ చేస్తూ చేసే డ్యాన్సే 'రోబోట్ డ్యాన్స్'. మైఖేల్ జాక్సన్‌తో ఈ డ్యాన్స్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 'డ్యాన్సింగ్ మెషిన్' పాటలో - మైఖేల్, తన సోదరులతో కలిసి 'రోబోట్ డ్యాన్స్' చేశారు. 'బిల్లి జీన్' అనే పాటలో కూడా 'రోబోట్ డ్యాన్స్' చేసి అలరించాడు.


మెల్‌బోర్న్ యూనివర్సిటీలో 'రోబోగాల్స్' అనే బృందం, 318 మంది 'రోబోట్ డ్యాన్స్' చేసి వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు.

ఔనా!



వాసన పసిగట్టే శక్తి శునకాల కన్నా, చీమలకే ఎక్కువ.

బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



నవ్వుల్ నవ్వుల్

అప్పారావు : ఏరా! వెళ్లినప్పుడు నాలుగు గంటల్లో విజయవాడ వెళ్లావు కదా! వచ్చేటప్పుడు ఎనిమిది గంటలు పట్టిందేం?

సుబ్బారావు : కారు తయారు చేసిన వెధవ ఎవడో గానీ, ముందుకు వెళ్లడానికి నాలుగు గేర్లు ఇచ్చాడు. వెనక్కి రావడానికి రెండు గేర్లు మాత్రమే ఇచ్చాడు రా!

అప్పారావు : !!!!!!!!!



టంగ్ ట్విస్టర్స్

1. Upper roller lower roller Upper roller lower roller. ..
2. Swan swam over the sea,
   Swim, swan, swim!
   Swan swam back again
   Well swum, swan!
3. I saw a saw that could out saw any other saw I ever saw.

చుక్కలు కలపండి



మీకు తెలుసా?



ప్రపంచంలో రెండు శాతం మందికి మాత్రమే ఆకుపచ్చ రంగు కళ్లు ఉంటాయి.

జవాబులు

చెప్పగలరా? : పాయసం
జంతర్‌మంతర్ : 1. అద్భుతం 2. తక్షణం 3. ఒత్తిడి 4. వికాసం
జంబ్లింగ్ వర్డ్స్ : 1. WALK 2. KING 3. DUMB 4. MUTE

చినశేషవాహనంపై వెంకయ్యస్వామి



చినశేషవాహనంపై వెంకయ్యస్వామి

వెంకటాచలం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన గొలగమూడి గ్రామం ఆరాధనోత్సవాల సందర్భంగా నిత్య కల్యాణం పచ్చతోరణంలా ప్రకాశిస్తోంది. ఉత్సవాల్లో మూడో రోజైన ఆదివారం ఉదయం నిత్య పూజలు, వెంకయ్య స్వామి చినశేషవాహనంపై గ్రామ పర్యటన కావించారు. తన దృష్టిలో అందరూ ఒక్కటే అన్నట్లుగా వివిధ రంగుల పూలతో అలంకరించిన శేషవాహనంపై కొలువైన వెంకయ్య స్వామిని చూసేందుకు రెండు కళ్లు చాలవన్న భావన భక్తుల్లో కనిపించింది. ఉత్సవ విగ్రహాన్ని భక్తులు మాడ వీధుల్లో మొదట ఊరేగించారు. అనంతరం ప్రత్యేక రథంలో ఉంచి గ్రామోత్సవం జరిపించారు. వీధుల్లో స్వామి వారి కోసం చలువ పందిళ్లు వేశారు. మహిళలు లోగిళ్లలు రంగవల్లులను తీర్చిదిద్దారు. గ్రామస్థులు కర్పూర నీరాజనాలు అర్పించి మొక్కులు చెల్లించడానికి పోటీలు పడ్డారు. గ్రామస్థులు, ఆశ్రమం వారు భక్తుల దాహార్తిని తీర్చడానికి అంబలి, మజ్జిగ, మంచి నీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. చినశేష వాహన సేవకు శ్రీధర్, నరసింహారావు, సుబ్బరాజు, దిలీప్‌కుమార్‌రెడ్డి ఉభయ కర్తలుగా వ్యవహరించారు.



దండాలు ధరించి ఊరేగింపు ముందు సాగుతున్న ఉభయకర్తలు




కోలాటం ఆడుతున్న చేస్తున్న భక్తులు

హంస వాహనంపై వెంకయ్య

వెంకయ్యస్వామి శనివారం రాత్రి హంస వాహనంపై కొలువుదీరి భక్తులకు కనువిందు చేశారు. నీరు పాలను వేరు చేసినట్లుగా సమాజంలోని మంచిని ఎలా తీసుకోవాలో చెప్పడానికా అన్నట్లు ఆయన హంసవాహనంపై కటాక్షించారు. ఈ సేవకు మోచర్ల మధు, ఉప్పల మోహన్, నల్లగుండ్ల గాంధీ, కాండ్ర రవీంద్రారెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆశ్రమ మాడ వీధుల్లో స్వామిని ఊరేగించిన భక్తులు, అనంతరం గ్రామోత్సవం జరిపించారు. పూలు, విద్యుల్లతలతో అలంకరించిన వాహనంపై స్వామి వారు కొలువై భక్తులను ఆశీర్వదించారు. ఆదివారం రాత్రి నెల్లూరుకు చెందిన కుమారి వీఎస్ శ్రావ్య భక్తి రంజని, రామాజంనేయయుద్ధం, గయోపాఖ్యానం తదితర నాటకాలు, నాటక ఘట్టాలు భక్తులను విశేషంగా అలరించాయి.

ఉత్సవాల్లో నేడు

ఆరాధనోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం ఉదయం స్వామికి సూర్యప్రభవాహనసేవ జరుగుతుందని, ఈ సేవకు సన్నారెడ్డి కృష్ణారెడ్డి ఉభయకర్తగా వ్యవహరిస్తారన్నారని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. రాత్రికి గజవాహన సేవ నిర్వహిస్తామని ఈ సేవకు డీవీ నాయుడు ఉభయకర్తగా వ్యవహరిస్తారన్నారని ఆయన అన్నారు. విజయవాడకు చెందిన శ్రీరామచంద్రమూర్తి శిష్యుల భరతనాట్య ప్రదర్శన, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ వారి సంగీత కచేరీ ఉంటాయన్నారు.



కుబేర కలశ పూజ వేదికపై కొలువైన ముగ్గురు అమ్మలు

వైభవంగా మహాలక్ష్మి కుబేర కలశపూజ

నెల్లూరు (సాంస్కృతికం) : లోక కల్యాణార్థం ఆదివారం నెల్లూరులోని వీఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారికి కుబేర కలశ పూజ వైభవంగా జరిగింది. ఆయురారోగ్యాలు, నవగ్రహ శాంతి, వ్యాపారాభివృద్ధి, ధనలాభంతోపాటు జిల్లా, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీమాత్రే నమః జ్ఞానపీఠం గురువు లలితా శివకుమార స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. ఉదయం గణపతి హోమం, నవగ్రహ హోమం, సుదర్శన హోమం, శ్రీలక్ష్మి హోమం, పురుష సూక్త హోమం జరిగాయి. రాత్రి లక్ష్మీ కుబేర కలశపూజలో లక్ష్మీ పూజ, కుబేర పూజ, సకల దేవతా పూజ జరిగాయి. వీపీఆర్ ఫౌండేషన్ అధినేతలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డి, మంచికంటి శ్రీనివాసులు, కోట మధుసూదన్‌రావు, శ్రీనివాసులు, పీఠం కార్యదర్శి పీవీకేఆర్ఎస్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

హోమం నిర్వహిస్తున్న దంపతులు



పోలేరమ్మకు సామూహిక కుంకుమార్చన



అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీలో వెలసిన పోలేరమ్మ తల్లికి ఆదివారం విశేష అభిషేకాలు సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శేషయ్యశర్మ బృందం కలిశాబిషేకం జరిపించారు. ఇనగంటి నాగేశ్వరావు, నిర్మలమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పోలేరమ్మకు ఉదయం గ్రామ చల్దీ, పూలంగిసేవ, తప్పెట్లు, తాళాలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అల్లూరు మాజీ శాసన సభ్యుడు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రముఖ న్యాయవాది పర్రి రాజశేఖర్, లక్ష్మీ దంపతులు కుంకుమార్చన ఉభయకర్తలుగా వ్యవహరించగా మిట్ట సోదరులు అన్నసంతర్పణ చేశారు. విద్యుత్‌దీపాలంకరణతో అమ్మవారి ఆలయం భక్తులు స్వాగతం పలికింది.



అమ్మవారికి అభిషేకం చేస్తున్న నాగేశ్వరరావు దంపతులు

కరక్కాయ గణపతి

ప్రస్తుత వాతావరణం కాలుష్యమయమైన నేపథ్యంలో స్వచ్ఛమైన ప్రకృతి మూలికలు, కరక్కాయ ప్రధానంగా విఘ్నేశ్వరుడి ప్రతిమను తయారు చేశారు నెల్లూరుకు చెందిన చిత్రకారుడు తిరుమల శెట్టి చంద్ర. ఏటా గణేశ చవితి సందర్భంగా పర్యావరణ హిత గణపతిని తయారు చేసి పొగతోటలో ప్రతిష్ఠించి పూజించడం ఆయనకు ఆనవాయితీ. ఈ ఏడాది ప్రకృతి పరిరక్షకుడు, ఆరోగ్య కారకుడిగా ఈ బొజ్జ గణపయ్యను తీర్చిదిద్దారు. ఇందుకోసం కరక్కాయలు, వాటి చూర్ణం, మజిష్టా, సున్నం, కుంకుమ, కస్తూరి పసుపు ఉపయోగించారు. ఐదు అడుగుల ఎత్తుగల గణాధిపతిని ఐదు రోజులు శ్రమించి రూపొందించారు. కరక్కాయ కన్న తల్లిలాంటిదనే సామెతను గుర్తు చేస్తూ.... దగ్గు, గొంతు, ఉదరకోశం, దంతాలు, ఉబ్బసం, గుండె సంబంధ వ్యాధులకు కరక్కాయ దివ్య ఔషధంగా పనిచేస్తుందని తెలియజేస్తూ ఈ విగ్రహాన్ని తయారు చేసినట్లు చంద్ర చెప్పారు. తలపై శివలింగం, దానికి నాగాభరణం, మూషిక వాహనంతో ఈ విఘ్నరాజు ఆకట్టుకుంటున్నాడు.

- నెల్లూరు (సాంస్కృతిక ప్రతినిధి)



24న వెంకయ్య స్వామి ఆరాధన

అనంతసాగరం: చిలకలమర్రి గ్రామంలోని వెంకయ్య స్వామి ఆలయంలో ఈ నెల 24న ఆరాధన నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నంది మండలం వెంకట్రాజు తెలిపారు. 23వ తేదీ రాత్రి స్వామి వారి గ్రామోత్సవం, అనంతరం పండరి భజన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24వ తేదీ ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే పూజా కార్యక్రమాలు రాత్రి 7 గంటలకు పల్లకీ సేవతో ముగుస్తాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన, బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన ఉంటాయన్నారు.

• ఇంటర్వ్యూ



అభివృద్ధి పనులకు రూ.9.46 కోట్లు మంజూరు

మల్లికార్జునరావు, పీఆర్ఏఈ

?. ఏఏ పనులకు సీఎం హామీ ఇచ్చారు.

!. జన్మభూమి - మాఊరు కార్యక్రమం సందర్భంగా సంగంలో సిమెంటు రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు సీఎం హామీ ఇచ్చారు. వీటి కోసం రూ. 9.46 కోట్లు మంజూరు చేశారు.

?. అదనంగా ఏమైనా నిధులు మంజూరయ్యాయా

!. సీఎం హామీ కింద మంజూరయిన ఆర్‌డీఎఫ్ నిధులు 50 శాతం, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 50 శాతం కలిపి పనులు చేస్తాం.

?. అంగన్‌వాడీ భవన నిర్మాణాల పూర్తికి నిధులు మంజూరయ్యాయా.

!. 19 అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయడానికి ఏపీఐపీ గ్రాంటు రూ. 68.2 లక్షలు మంజూరైంది.

?. మండలంలో అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు

!. 12 పంచాయితీల్లో 4.5 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ. 1.52 కోట్లు మంజూరయ్యాయి. వీటికి రూ. 1.52 కోట్లు ఉపాధి హామీ నిధులు కలిపి సిమెంట్ రహదారులు నిర్మించాలి.

\- సంగం

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

• టీడీపీ శ్రేణులకు ఆనం పిలుపు

అనంతసాగరం: టీడీపీ బలోపేతానికి తాము 10 మెట్లు దిగివచ్చామని, పార్టీ పటిష్ఠత, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని టీడీపీ శ్రేణులకు మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అనంతసాగరంలో నిర్వహించిన మండల టీడీపీ సమన్వయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు విబేధాలు వీడి కలిసికట్టుగా పని చేసి గ్రామస్థాయి నుంచి టీడీపీని పటిష్ఠం చేయాలని సూచించారు. సమావేశానికి కొందరు గ్రామస్థాయి టీడీపీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల గైర్హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.. జన్మభూమి కమిటీ సభ్యుల పనితీరు సరిగా లేకపోవడంతో రద్దయ్యారని, నూతన కమిటీల ఏర్పాటుకు మండలస్థాయి నాయకులు బాధ్యత వహించాలన్నారు. 100 ఓట్లకు ఒక సభ్యుడు చొప్పున ఎంపిక చేసి బూత్‌కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

హై లెవెల్ కెనాల్‌పై అపోహలు వద్దు

ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి చేపడుతున్న ఆనం సంజీవరెడ్డి హైలెవెల్‌కెనాల్ పనులపై అపోహలు పెట్టుకోవద్దన్నారు. పడమటినాయుడుపల్లి వద్ద 0.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న రిజర్వాయర్‌తో అనంతసాగరం చెరువు ఆయకట్టుకు ప్రమాదం ఉండదని భరోసా ఇచ్చారు. కేతామన్నేరువాగు ద్వారా అనంతసాగరం చెరువుకు వచ్చే నీటికి గండిపడుతుందనడాన్ని ఖండించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి శాకమూరి సుబ్బారావు, వ్యవసాయ సొసైటీ ఉపాధ్యక్షుడు అల్లంపాటి జనార్ధన్‌రెడ్డి, టీడీపీ మాజీ అధ్యక్షుడు సడ్డా రవీంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ సుబ్బరాజు, క్రిస్టియన్ మైనార్టీ ఉపాధ్యక్షుడు బొర్రా బాబు, సోమశిల సర్పంచ్ ఉప్పల విజయ్‌కుమార్, పీ.కె.పాడు ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, శంకరనగరం సర్పంచ్ వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, రాపూరు జనార్దన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు చిత్తశుద్ధితో పనిచేయాలి

మర్రిపాడు: గ్రామకమిటీలు చిత్తశుద్ధితో పనిచేయాలని మర్రిపాడు మండల టీడీపీ సమన్వయకమిటీ సమావేశంలో ఆనం పిలుపునిచ్చారు. మండలంలో 24 పంచాయితీల కమిటీల సభ్యులకుగానూ 10 మంది సభ్యులు హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ పరిస్థితిని గమనించి, తానే స్వయంగా సమావేశాలకు హాజరవుతున్నానన్నారు. ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో తాను స్వయంగా పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుంటాన్నారు. బూత్ కమిటీల వివరాలను సెప్టెంబరు 30 లోగా ప్రధాన ఎన్నికల కార్యాలయానికి పంపాల్సిన బాధ్యత వున్నందున రెండు మూడు రోజుల్లో కమిటీలను సిద్ధం చేయాలని సూచించారు. పాతఅల్లంపాడు, కొత్తఅల్లంపాడు, ఇస్కపల్లి, పోలిరెడ్డిపల్లి, పల్లిపాడు గ్రామాలకు తారు రోడ్లకు నిధులు మంజూరవుతాయన్నారు. కెనాల్ కోసం పడరానిపాట్లు పడుతుంటే మండలంలోని కొంతమంది పెద్దలు కమీషన్ల కోసమే పనులు చేస్తున్నట్లు ప్రచారం చేయడం దారుణమని తెలిపారు. ఈ విషయంపై నిజానిజాలను గ్రామాల్లో తెలియజేయాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై వుందన్నారు. టీడీపీ మండల కన్వీనర్ శాకమూరి నారాయణ, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఎంపీపీ కటారి రమణయ్య, యర్రమల చిన్నారెడ్డి, మందాడి శ్రీనివాసులునాయుడు, ముటుకుంది లక్ష్మీరెడ్డి, కోనంకి శ్రీనివాసులునాయుడు, పావులూరి వెంకట్రామయ్య, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ కమిటీల సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



అనంతసాగరం: సమావేశంలో మాట్లాడుతున్న ఆనం

ఉపాధ్యాయుల సేవలు అమూల్యం

ఏఎస్‌పేట: విద్యా బోధన, పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు మురళీధర్‌రావు, లక్ష్మి, ఎద్దలయ్య, సీహెచ్ సుబ్బానాయుడు, మాధవి సేవలు అమూల్యమని సర్పంచ్ రాజ్యలక్ష్మి-రామారావు దంపతులు తెలిపారు. ఆయా ఉపాధ్యాయులు బదిలీ కావడంతో ఆదివారం చౌటభీమవరం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులు లను పూలమాలలు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వారికి జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హజరత్తయ్య, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచు

చౌటభీమవరం గ్రామంలో లైన్‌మన్‌గా పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన సుబ్రమణ్యంకు సర్పంచ్ రాజ్యలక్ష్మి-రామారావు దంపతులు పూలమాలలు, శాలువాలు వేసి సన్మానించారు.

దుర్గామల్లేశ్వరాలయంలో పూజలు

ఆత్మకూరు: కామిరెడ్డిపాడు గ్రామ సమీపంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేశారు. చిలకలమర్రి గ్రామానికి చెందిన సునంద తన భర్త పుట్టిన రోజును పురస్కరించుకుని, భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త బుట్టి భారతి, పలువురు భక్తులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఉభయకర్త సునంద

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



చేజర్ల ఈద్గా మైదానంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

చేజర్ల: ఇస్తిమా జమాద్ సందర్భంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల ముస్లింలు చేజర్ల ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేశారు. సంవత్సరానికి ఒకట్రెండు సార్లు ముస్లింలు ఒక గ్రామంలో సమావేశమై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మతపెద్దలు సందేశమిచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.

పోలేరమ్మకు పాలపొంగళ్లు

మర్రిపాడు: మర్రిపాడు గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం వద్ద మహిళలు ఆదివారం పాల పొంగళ్ల కార్యక్రమం నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

అంకాళమ్మకు ...

ఉదయగిరి రూరల్: గండిపాళెం లో ఆదివారం అంకాళమ్మకు పొంగళ్లు నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.



ఆటోడ్రైవర్లకు ఎల్‌ఎల్‌ఆర్ పత్రాలను అందచేస్తున్న మోటారు వాహనాల తనిఖీ అధికారి షేక్ బాబు

236 మందికి డ్రైవింగ్ లైసెన్సులు

ఆత్మకూరు: రాష్ట్ర రవాణాశాఖ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక మోటారువాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో ఆటో లైసెన్సు కలిగిన వారు బ్యాడ్జీ తీసుకునేందుకు నిర్వహించిన ఎల్ఎల్ఆర్ మేళాకు మంచి స్పందన లభించిందని మోటారువాహనాల తనిఖీ అధికారి షేక్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేళాలో 236 మందికి ఎల్ఎల్ఆర్ అందచేసినట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించి అర్హత కలిగిన అందరికీ బ్యాడ్జీ లైసెన్సులు ఇచ్చినట్లు తెలియజేశారు.

ప్రశాంతంగా ఎన్‌ఐవోఎస్ పరీక్షలు

ఆత్మకూరు: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో వయోజనులకు ప్రాథమిక అక్షరాస్యత పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు. మండలంలో 453 మంది వయోజనులు పరీక్షలకు హాజరయ్యారు. సాక్షరభారత్ మండల కో-ఆర్డినేటర్ దాసరి బ్రహ్మయ్య రావులకొల్లు కేంద్రంలో తనిఖీ చేశారు.

సంగం: మండలంలోని జండాదిబ్బ, దువ్వూరు, అన్నారెడ్డిపాళెం, సిద్ధీపురం, సంగంలోని సాక్షర భారతి కేంద్రాల్లో ఆదివారం ఎన్‌ఐవోఎస్ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు. ఐదు కేంద్రాల్లో 100 మంది పరీక్ష రాశారు. సాక్షరభారతి మండల కో- ఆర్డినేటర్ అశోక్, వయోజన విద్య సూపర్‌వైజర్ రమేష్‌బాబు తదితరులు పర్యవేక్షించారు.



రావులకొల్లులో పరీక్ష రాస్తున్న వయోజనులు

రోడ్డు మంజూరుపై హర్షం

అనంతసాగరం: కొత్తపల్లి నుంచి కచ్చిరిదేవరాయపల్లి, వయా పాతదేవరాయపల్లి వరకు తారురోడ్డు మంజూరు చేయడంపై దేవరాయపల్లి బిట్-2 సర్పంచ్ చల్లా పద్మమ్మ, నాయకులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, బి.శంకరయ్య, సి.నరసింహులు హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు మంజూరుకు కృషి చేసిన మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
సోమవారం,
21 ఆగస్టు 2017

కనీస సౌకర్యాలు కల్పించండి

- తాగునీటికి కటకట
- విద్యుత్ సరఫరా లేదు
- అవస్థల్లో గిరిజన కాలనీవాసులు



కాలనీలోని గుడిసెలు

సంగం: పక్కాఇళ్లు లేక రెండు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న తమకు అధికారులు నివేశన స్థలాలు మంజూరు చేశారు గానీ, ఆ ప్రాంతంలో తాగునీరు, రహదారులు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించలేదని తరుణవాయికి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరుణవాయిలోని వాటర్ ట్యాంకు సమీపంలోని గిరిజన కాలనీలు 40 కుటుంబాలు నివసించేవి. క్రమేణా ఈ కుటుంబాల్లో సభ్యులు పెరిగిపోవడంతో జనాభా 250కి చేరుకుంది. దీంతో ఒక్కో ఇంట్లో రెండు లేదా మూడు కుటుంబాలు నివసించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లు శిథిలం కావడంతో ఇబ్బందులు పడేవారు. దీంతో, తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని చాలా కాలంగా అధికారులకు విన్నవిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సర్వే చేసి, రేషన్ కార్డుల ఆధారంగా 26 మందిని గుర్తించారు. గ్రామ నత్తంలోని స్థలాన్ని కేటాయించి, పట్టాలు పంపిణీ చేశారు. ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటేనే వసతులు కల్పిస్తామని అధికారులు చెప్పడంతో, సుమారు అరకిలో మీటరు దూరం నుంచి నీరు తెచ్చుకుని గోడలు కట్టుకుని పాకలు వేసుకున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి, కాలనీకి రోడ్డు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుకుంటున్నారు. కాలనీలో పల్లంగా వున్న ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు

నీటి వసతిలేక ఇబ్బందులు



కాలనీలో మౌలిక సౌకర్యాలు కొరవడడంతో ఇబ్బందులు పడుతున్నాం. సుమారు అరకిలోమీటరు దూరం వెళ్లి నీరు తీసుకోచ్చుకోవలసి వస్తోంది.

- కత్తి వెంకయ్య, కాలనీవాసి

వీధులు లెవెలింగ్ చేయాలి



కాలనీ పల్లంలో ఉంది. దీంతో వర్షాలు వస్తే నీళ్లు నిలిచే పరిస్థితి ఉంది. నివాస స్థలాలతోపాటు వీధులు లెవెలింగ్ చేసి అభివృద్ధి చేయాలి.

- మల్లిక విజయలక్ష్మి

పాముల బెడద ఎక్కువగా ఉంది



కాలనీ చుట్టూ బీడు భూములుండడంతో పాముల సంచారం ఎక్కువగా ఉంది. సాయంత్రమైతే ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయంగా ఉంది.

- ఏటగిరి లక్ష్మి

ఉన్నతాధికారుల విన్నవిస్తాం



కాలనీని పరిశీలించి, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం. తక్షణమే నీటి వసతి కల్పించాలని పంచాయితీ కార్యదర్శికి ఆదేశాలిస్తాం

- రఫీఖాన్, ఎంపీడీవో

వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

- బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నరసారెడ్డి

ఆత్మకూరు: జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో ఈ ఏడాది మెరుగైన వసతులు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి వై.నరసారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లోని బీసీ బాలుర, బాలికల వసతిగృహాల్లో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశాల్లో పాల్గొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో మెనూను మెరుగుపరచడంతో పాటు, ట్యూటర్ల ఏర్పాటు, ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా బీసీ సంక్షేమ వసతిగృహాలు నిలిచాయన్నారు. 2016-17 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో బీసీ వసతిగృహాల విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించడం ఇందుకు నిదర్శనమన్నారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు, మెనూ అమలుపై విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశాల్లో చర్చించాల్సి ఉందన్నారు. విద్యార్థులను ఎక్కువ రోజులు ఇళ్లలో ఉంచుకోకుండా హాస్టళ్లకు పంపడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌డబ్ల్యూవో షేక్ మహబూబ్‌బాషా, బీసీ బాలికల వసతిగృహం సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, బీసీ బాలుర కళాశాల హాస్టల్ సంక్షేమ అధికారి షేక్ షకీల్, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసారెడ్డి

దళితులపై దాడులు నివారించాలి

ఆత్మకూరు: దళితులపై జరుగుతున్న అత్యాచారాలను నివారించేదిశగా పాలకులు, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కుల వివక్ష పోరాటసమితి జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు నాగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్మకూరుకు చెందిన దళితుడు వీధి వెంకటేశ్వర్లుపై దాడి చేసిన మల్లి వెంకటేశ్వర్లునాయుడును రక్షించేందుకు అధికారులు ప్రయత్నిస్తుండడం బాధాకరమన్నారు. అలాంటి అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, కరటంపాడు మాజీ సర్పంచ్ జ్యోతి గురవయ్య, డేవిడ్‌రాజు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గడ్డం ఆదినారాయణ, ఈశ్వాస్ ఎన్జీవో బి.శేషాద్రి, పలువురు దళిత నేతలు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి



అనంతసాగరం: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆత్మకూరు: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ 74వ జయంతిని పురస్కరించుకుని మున్సిపల్ బస్టాండ్‌సెంటర్‌లో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకుడు వన్నెం నాగరాజు రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కె.రాజా, కె.అనీల్, ఎన్.శ్రీనివాసులు, షేక్ రసూల్, బి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అనంతసాగరంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేము హరిబాబు, పలువురు నేతలు, కార్యకర్తలు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కృష్ణాష్టమి ముగింపు వేడుకలు



పూజల్లో పాల్గొన్న ఆదిశేషయ్య దంపతులు

ఆత్మకూరు: బట్టేపాడు గ్రామంలో ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక నేతృత్వంలో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి ముగింపు వేడుకలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం గ్రామోత్సవం చేశారు. టీడీపీ ఆత్మకూరు పట్టణా ధ్యక్షుడు డాక్టర్ ఆదిశేషయ్య, మున్సిపల్ కౌన్సిలర్ చిల్లూరు మంజూష దంపతులు, టీడీపీ మహిళ నాయకురాలు పులిమి శైలజారెడ్డి, టీడీపీ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి చిల్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మన బడిని మనమే బాగుచేసుకుందాం

- పూర్వవిద్యార్థినుల పిలుపు

ఆత్మకూరు: మనం చదివిన బడులను మనమే బాగు చేసుకుందామంటూ పలువురు పూర్వవిద్యార్థులు ముందుకొస్తుండడం హర్షణీయమని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖ ఏడీఏ అనూరాధ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థినుల సమ్మేళనం నిర్వహించారు. 1977 నుంచి 2010 వరకు ఆ పాఠశాలలో చదివిన విద్యార్థినులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పలువురు విరాళాలు ప్రకటించారు. ఈ పాఠశాలలో చదివి 10వ తరగతిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందచేస్తామని ఆ పాఠశాల పూర్వవిద్యార్థిని, ప్రస్తుత జిల్లా ఉద్యానవన సహాయ సంచాలకులు అనూరాధ, మరో పూర్వవిద్యార్థిని ఛాయాదేవి ప్రకటించారు. చిత్రలేఖన ఉపాధ్యాయుడు వాసిలి శ్రీనివాసరావు కుమార్తెలు వి.రాజేశ్వరి, డాక్టర్ సుగుణ, నిర్మల, విమల పాఠశాలలో ఆర్వో ప్లాంట్, సరస్వతీ మందిరం నిర్మిస్తామన్నారు. ముందుగా రూ.17 వేల నగదును ఆ పాఠశాల పూర్వవిద్యార్థిని గిరిజకు అందచేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థినులు ప్రకటించిన మొత్తానికి సమానంగా, మున్సిపాలిటీ నుంచి మ్యాచింగ్‌గ్రాంట్ మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు లక్ష్మీకాంతమ్మ, రామేశ్వరమ్మ, నారాయణ, లలితమ్మతో పాటు ప్రస్తుత హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులను ఘనంగా సన్మానించారు. సమ్మేళనం అనంతరం బరువెక్కిన హృదయాలలో తీపి జ్ఞాపకాలను పదిలం చేసుకుని వెళ్లారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థినులు

అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించాలి

సంగం: సంగం మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని దళిత నాయకుడు టి. కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక సొసైటీకి సమీపంలో ఉన్న 365 సర్వే నెంబరులోని ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కేటాయించాలని తహసీల్దారు నుంచి కలెక్టర్ వరకు అన్ని స్థాయిల అధికారులకు విన్నవించినా, స్థలం కేటాయించలేదన్నారు. ఇప్పుడు అదే స్థలంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండానే భవనం నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు.

ప్రమాదకరంగా పాడుబడిన బావులు

ఏఎస్‌పేట: మండలంలోని పలు గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న పాడుపడిన బావులు ప్రమాదకరంగా మారిఉన్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా బావుల్లో నీరు ఎండిపోయి శిథిలావస్థకు చేరి ఉన్న వాటితో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ నడిబొడ్డున, గ్రామాల సమీపంలోని బావుల సమీపంలో పిల్లలు ఆటలాడుకుంటుండడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చిన్నచిన్న బోరు రంధ్రాల్లోనే చిన్నారులు ప్రమాదవశాత్తూ పడి ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటిది నేలబావులతో మరింత ప్రమాదం ఉందంటున్నారు. హసనాపురం ఐటీఐ కళాశాల, ఏఎస్‌పేట బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కనే వున్న బావుల కారణంగా పలువురు ప్రమాదాలకు గురయ్యారని, ఇలాంటి బావులపై అధికారులు దృష్టిసారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బావి వద్ద ఆడుకుంటున్న చిన్నారులు

బోరుబావులపై నిర్లక్ష్యం వద్దు

ఏఎస్‌పేట: నిరుపయోగంగా ఉన్న బోరుబావులను నిర్లక్ష్యంగా వదిలేయవద్దని హార్ట్ సొసైటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు హసనాపురంలో ఉన్న బోరుబావులను పూడ్చివేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోరుబావులను నిర్లక్ష్యంగా వదిలేయడంతో చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు పడని బోర్లను వెంటనే పూడ్చివేయాలన్నారు. అనంతరం గ్రామంలోని చర్చ్ సమీపంలోని బోరుబావిని మట్టి, రాళ్లు వేసి పూడ్చివేశారు. ఈ కార్యక్రమంలో హార్ట్ సొసైటీ సభ్యులు శ్రీహరి, అనీల్‌కుమార్, యశ్చేంద్ర, మోహన్‌కృష్ణ, పవన్‌కళ్యాణ్, బాలాజీ, జగదీష్, శ్రీనివాసులు, చెంచుకృష్ణ, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కటాలమ్మకు పూజలు

గూడూరు(రూరల్): మండలంలోని చెన్నూరు గ్రామ సమీపంలో గల గ్రామదేవత కటాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశిష్ట పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాలలోని ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజలకు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తాము కోరిన కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ


ఆహారపొట్లాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

గూడూరు(టౌన్): ఎంఎఫ్ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్ ప్రాంతంలో పేదలకూ, వికలాంగులకూ ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఆదివారం సంస్థ తరపున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని విస్తృత పరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా ఇప్పటికే నూరు వారాలు పైబడి ఆహారపొట్లాలను అందజేయడం ద్వారా సంతృప్తి పొందుతున్నామన్నారు. భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను విస్తృతపరచడంతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సర్దాజుద్దీన్, అమ్మద్దీన్, జావిద్అలీ, తదితరులు పాల్గొన్నారు. రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో యాచకులు, పేదలకు ఆహారపొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ రోడ్ల వెంబడి భిక్షాటన చేసే వారికి, పేదలకు తమ సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆహారపొట్లాలను అందజేస్తున్నామన్నారు.

క్రమశిక్షణతో విద్యకు ప్రాధాన్యం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఏవీఎస్ ప్రసాద్

గూడూరు: క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఏవీఎస్ ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో అత్యున్నత విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు.దీంతో జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో తమ కళాశాలలో చదివిన విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుండటంతో రాష్ట్ర స్థాయిలో తమ విద్యార్థుల ప్రతిభ చాటుతున్నారన్నారు. మన సంస్కృతి, సంప్రదాయం, విలువపై విద్యార్థులకు అవగాహన పెంచుతున్నామన్నారు. తమ కళాశాలలో ర్యాగింగ్‌కు చోటు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. విద్యాబోధనలో వస్తున్న మార్పులను తమ అధ్యాపకులు అందిపుచ్చుకుని మెరుగైన బోధన చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులలోని స్కిల్స్‌ను పెంపొందించి ఉపాధి అవకాశాలు పొందేలా ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ బహుళజాతి కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని క్యాంపస్ ఎంపికలు జరిపి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.తమ సంస్థ నుంచి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ పరమేశ్వరరావు, హెచ్ఓడీలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

23న సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

గూడూరు(టౌన్): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 23న ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ వర్గాలకు అందించే సబ్సిడీ రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని తెలిపారు. ఉదయం 11 గంటలకు హాజరుకావాలన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నవయువసేన నిర్వాహకులు

హెల్మెట్‌లతో ప్రాణాలు కాపాడుకోండి

గూడూరు: ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్‌లు ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని నవయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు సద్దాం అన్నారు. ఆదివారం స్థానిక బజారు వీధిలో 'సేవ్ యువర్ లైఫ్' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో హెల్మెట్ వాడకంపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ క్రమంలో హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపేవారికి హెల్మెట్ అవశ్యకతను తెలియజేస్తున్నామన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో బత్తిన సుధాకర్, సమద్, కలాం, జామాల్లుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యేక ఎల్ఎల్ఆర్ మేళా


బ్యాడ్జీలను అందజేస్తున్న ఆర్టీవో చందర్

గూడూరు(రూరల్): నాన్ ట్రాన్స్‌పోర్ట్ లైసెన్స్ కలిగిన ఆటో డ్రైవర్లకు ఆదివారం ప్రత్యేక ఎల్ఎల్ఆర్ మేళా నిర్వహించి బ్యాడ్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీవో చందర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు బ్యాడ్జీ తప్పనిసరన్నారు. డివిజన్ పరిధిలోని నాన్ ట్రాన్స్‌పోర్ట్ లైసెన్స్ కలిగిన ఆటో డ్రైవర్లకు బ్యాడ్జీలను అందించేందుకు ప్రత్యేక ఈ ఎల్ఎల్ఆర్ మేళాను స్థానిక ఆర్టీవో కార్యాలయంలో నిర్వహించామన్నారు. మేళాకు విశేష స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు జకీర్, కరుణాకరన్, ఏవో మదాని తదితరులు పాల్గొన్నారు.

జాతరకు వెంకటగిరి ముస్తాబు


ముస్తాబవుతున్న పోలేరమ్మ ఆలయం

- ఆలయాలకు రంగులు
- అప్పుడే ఎగ్జిబిషన్ సందడి
- సంచార దుకాణాలకు అడ్వాన్సు

వెంకటగిరి(టౌన్): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందర్భంగా ఆలయానికి రంగులు అద్ది ముస్తాబు చేస్తున్నారు. పోలేరమ్మ జాతర వచ్చే నెల 11, 12వ తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం కమిటీ, దేవాదాయశాఖ నిర్ణయించాయి. జాతరకు జిల్లా తోపాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూస్తున్నారు. పట్టణంలోని సంచార దుకాణాలు, రంగులరాట్నం, ఎగ్జిబిషన్‌లు ఇప్పటికే ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో జాతర సందడి నెలకొంది. చిన్నారులకు ఆట విడుపు కలిగించేందుకు జయింట్‌వీల్, బోటు, మోటారు సైకిల్ విన్యాసం, రైలుబండ్లు తదితర ఆట పరికరాలను ఏర్పాటు చేసేందుకు మహారాష్ట్ర, చెన్నై తదితర ప్రాంతాల వారు వెంకటగిరికి చేరుకున్నారు. ఎగ్జిబిషన్‌ల ఏర్పాటు కోసం తాత్కాలిక రేకుల షెడ్ల నిర్మాణ పనుల్లో దుకాణా దారులు నిమగ్నమయ్యారు. ఏటా జాతర సందర్భంగా ఏర్పాటయ్యే సంచార దుకాణాలు వినాయక చవితికే సిద్ధం చేసేందుకు స్థలాల కోసం ఇప్పటికే అడ్వాన్సులు ఇస్తున్నారు. రెండు రోజులుగా అమ్మవారి ఆలయం, ఆర్చి వద్ద రంగులతో నూతన మెరుగులు తీర్చిదిద్దుతున్నారు. ఏటా మాదిరి జాతర సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. అందరి సహకారంతో జాతరను ప్రశాంతంగా ముగిసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్

హిందూ ధర్మం గొప్పది

వెంకటగిరి(టౌన్): హిందూ ధర్మం చాలా గొప్పదని కమలానంద భారతిస్వామిజీ అన్నారు. ఆదివారం మండలంలోని పారవోలు, సీసీ కండ్రిగ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రతి రోజు ధూప, దీపారాధన చేయాలన్నారు. అప్పుడు గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు కేవీకే ప్రసాద్, ఏయంసీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

• ఇంటర్వ్యూ



మద్యం తెచ్చుకోవాలంటే పర్మిట్ తప్పనిసరి

ప్రసాద్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ

? పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చుకోవాలంటే ఎలా

! పొరుగు రాష్ట్రాల నుంచి వ్యక్తిగతంగా అక్కడ కొనుగోలు చేసిన మద్యాన్ని వెంట తెచ్చుకోవాలంటే బిల్లుతోపాటు ఆ రాష్ట్ర నిబంధనలమేర ట్రాన్స్‌పోర్టు పర్మిట్ పొంది చెక్‌పోస్టుల్లో అనుమతితో తెచ్చుకోవచ్చు.

? ఒక వ్యక్తి గరిష్ఠంగా ఎన్ని మద్యం సీసాలను ఇంటిలో ఉంచుకోవచ్చు

! మన రాష్ట్రంలో ఒక వ్యక్తి గరిష్ఠంగా ఆరు సీసాల మద్యాన్ని ఇంటిలో ఉంచుకుని వినియోగించుకోవచ్చు.

? బెల్టు దుకాణాల కట్టడికి తీసుకుంటున్న చర్యలేమిటి.

! గ్రామీణ ప్రాంతాలలో బెల్టు దుకాణాలను కట్టడి చేసేందుకు ఆయా గ్రామాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి బెల్టు దుకాణాలు నడపకుండా చర్యలు తీసుకుంటున్నాం. అతిక్రమించి మద్యాన్ని అక్రమంగా నిల్వ చేసి అమ్మితే కేసులు నమోదు చేస్తున్నాం

- గూడూరు(టౌన్)

సినిమా గైడ్

గూడూరు

శ్రీనివాస్ తేజ:	నేనే రాజు నేనే మంత్రి
సుందరమహల్:	జయ జానకి నాయక
సీవీ :	ఫిదా
సంగం:	లై

కోట

ఆర్ఆర్‌టి :	ఫిదా
రామ్‌రాజ్:	జయ జానకి నాయక
అరుణ:	నేనే రాజు నేనే మంత్రి

ఎన్‌ఎస్‌యూఐ నుంచి అనిల్ సస్పెన్షన్

గూడూరు(రూరల్): ఎన్‌ఎస్‌యూఐ నుంచి గూడూరు డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్టు ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కేశవ నారాయణ తెలిపారు. ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వెబ్‌సైట్ ప్రక్రియ ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎన్‌ఎస్‌యుఐ సభ్యత్వం లేని విద్యార్థులను, నాయకులను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో అనిల్‌ను తొలగించామని తెలిపారు. సంఘ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు.

రహదారిపై మూగజీవాలు

పెరుగుతున్న ప్రమాదాలు

- మేత కోసం వెళ్తూ రహదారిపై అడ్డంగా
- వేగాన్ని నియంత్రించ లేక ప్రమాదాలు
- పశువులతోపాటు మనుషులు మృత్యువాత

ఇప్పుడు జాతీయరహదారిపై మూగజీవాలే వేగనిరోధకాలుగా మారాయి. వాహనాల వేగానికి కళ్లెం వేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పలువురు మృత్యువాతపడుతున్నారు. ఒక్కోసారి అవి మృత్యువాతపడుతున్నాయి. జాతీయ రహదారిపై మలుపులు, ప్రధాన కూడళ్ల వద్ద తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. వాటిని ప్రభుత్వం అరికట్టలేకుంది



జాతీయ రహదారిపై మూగజీవాలు

చిల్లకూరు: . రెండేళ్లుగా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవటం కరువు తాండవిస్తోంది. పంటలు సరిగా పండడం లేదు. సాగుతో తాగు నీరు కరువైంది. పశువులకు మేత ఎక్కడా కనిపించడం లేదు. గ్రాసం కోసం పశువులను దూర ప్రాంతాలకు తోలుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొని వుంది. ఈ క్రమంలో పశువులు మేతకు వెళ్లే సమయంలో పలు ప్రాంతాలలో జాతీయ రహదారులు, గ్రామ రహదారులు దాటాల్సి వస్తోంది. సాధారణంగా జాతీయ రహదారిపై వాహనాలు అతి వేగంగా వెళుతుంటాయి. పశువులు రోడ్డు దాటే సమయంలో వాహనదారుల వేగానికి బ్రేకులు పడుతున్నాయి. కొన్ని సమయాల్లో అతి వేగంతో వెళుతున్న వాహనాలకు పశువులు బలవుతున్నాయి. లక్షల రూపాయల విలువైన సంపదను పాడి రైతులు పోగొట్టుకుంటున్నారు. ఏడాది ఆరంభం నుంచి ఇప్పటి వరకు20 గేదెలు మృతి చెందాయి. పలు జీవాలు గాయాలపాలయ్యాయి. వాహన చోదకులు 10 మంది వరకూ గాయపడ్డారు. భారీ వాహనాలు వెళ్లేటప్పుడు పశువులు అడ్డు రావడంతో వేగాన్ని అదుపు చేయలేక మరో వాహనాన్ని ఢీ కొనడమో లేక బోల్తాపడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పశువులు రాత్రి సమయాల్లో రహదారులపై సంచరిస్తుంటాయి. ఆ సమయంలో ద్విచక్రవాహనదారులు దగ్గరికి వచ్చేవరకు పశువులు కనిపించకపోవడంతో వాటిని ఢీ కొని మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. గతేడాది కమ్మవారిపాళెం గ్రామానికి నూతన వరుడు పాలడెయిరీ నుంచి ఇంటికి వస్తుండగా అకస్మాతుగా పశువులు అడ్డురావడంతో వాటిని ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ నెలలో నల్లయగారిపాళెం గ్రామ సమీపంలో ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తూ గెదేను ఢీ కొని గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదాలను ఆరికట్టేందుకు గతేడాది పోలీసుశాఖ చర్యలు చేపట్టింది. పశువుల కొమ్ములకు రంగులు వేసే కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో పశువులు రాత్రి సమయంలో జాతీయ రహదారులపైకి వస్తే వాహనాల లైటు వెలుతురికి కొమ్ములకు ఉన్న రంగు వల్ల పశువులను గుర్తించవచ్చు. దీంతో ప్రమాదాలు అరికట్టే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాలలో కొన్ని పశువులకు కొంత మేర రంగులు వేశారు. పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమం చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ఈ ప్రమాదాలను అరికట్టేందుకు పశువులను జాతీయ రహదారిపై నుంచి అంతర్గత మార్గాలలో తరలించేలా చర్యలు తీసుకోవాలి. అంతేగాక రాత్రి సమయాల్లో జాతీయ రహదారిపై పశువుల రాకపోకలు జరగకుండా హైవే సిబ్బంది చూడాలి. పశువుల కొమ్ములకు గతంలో వేసిన విధంగా రంగు వేయాలని, ఈ తరహా చర్యల వల్ల అటు మనుషులు, జీవాల ప్రాణాల కాపాడుకోవచ్చునని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి సమయాలలో ఇక్కట్లు



రాత్రి సమయాలలో గ్రామ సమీపంలో అక్కడక్కడ పశువులు వస్తున్నాయి. దీంతో జాతీయ రహదారిపై వేగం వస్తున్న వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

-సాయి

కొమ్ములకు రంగులు వేయాలి



పశువుల కొమ్ములకు ఫ్లోరోసెంట్ కలర్స్‌తో రంగులు వేస్తే వాహనదారులు వాటి కదలికలను కనిపెట్టి వేగాన్ని నియంత్రించి ప్రమాదాలకు లోను కాకుండా ఉంటారు. అధికారులు స్పందించాలి/

- లోకేష్

వయోజనులకు పరీక్షలు



వెంకన్నపాళెంలో పరీక్షలు రాస్తున్న వయోజనులు

కోట: మండలంలోని 21 పంచాయతీలలో సాక్షర భారత్ కేంద్రాలలో ఆదివారం వయోజనులకు సామర్థ్య అర్హత పరీక్షలు జరిగాయి. వెంకన్నపాళెం, కోట, కొత్తపాళెం, తిమ్మానాయుడుపాళెం, వంజివాకల తదితర కేంద్రాలలో 820 మంది పరీక్షలు రాశారు. పరీక్షలను కోఆర్డినేటర్ సుజన ప్రియ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు సునీత, ఏడుకొండలు ఉన్నారు.

కొనసాగుతున్న దోమల నివారణ

కోట : కోటతో పాటు పరిసర కాలనీలలో మూడవ రోజు ఆదివారం కూడా వైద్య, ఆరోగ్య సిబ్బంది చేపట్టిన దోమల నివారణ చర్యలు కొనసాగుతున్నాయి. ఏఎన్‌ఎం, ఆశవలంటరీల ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని పలు కాలనీలలో ఉన్న డ్రైనేజీలలో బ్లీచింగ్ చల్లారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'కోట డెంగ్యూ బాట' అన్న కథనానికి పాలకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది స్పందించారు. డెంగ్యూ జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయా ప్రాంతాల ప్రజలకు వివరించారు. ఎక్కువ నీటిని నిల్వ చేయడం వల్ల ఎడిస్ దోమ చేరుతుందని, అదిగుడ్లను పెట్టి దోమల ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

కోటమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకారంలో కోటమ్మ

కోట : గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని చందన, పుష్పాలంకారంలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, ఓజిలి మండలాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు పాలక మండలి ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: మండల పరిధిలో తూర్పుకనుపూరు గ్రామంలో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహి ంచారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు వచ్చి పొంగ ళ్లు పెట్టుకుని ప్రత్యేక అలంకణలో వున్న ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బంది భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఈవో కోవూరు జనార్ధన్‌రెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

గోదాములో అగ్నిప్రమాదం

- షార్ట్‌సర్క్యూటే కారణం
- లక్ష విలువైన సరుకుల దగ్ధం
- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



ప్రమాద స్థలం వద్ద గుమికూడిన జనం

గూడూరు(టౌన్): స్థానిక హైస్కూల్ రోడ్డులోని ఓ గోదాములో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఓ వ్యాపారికి చెందిన గోదాములో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి గోదాములోని సరుకులు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో సమాచారమందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో లక్షకు పైబడి నష్టం వాటిల్లిందని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

దేశమ్మకు పొంగళ్లు



అమ్మవారి ముగ్గు వేసి నైవైద్యం సమర్పిస్తున్న భక్తులు

చిల్లకూరు: మండలంలోని ఉడుతావారిపాళెం గ్రామంలో గ్రామదేవత దేశమ్మకు ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందు అమ్మవారి భారీ ముగ్గును వేసి అక్కడ నైవేద్యం సమర్పించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, హోమపూజలు నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం ఘనంగా జరిపార్ను.

పోలేరమ్మకు అంబళ్లు

తడ : మండల పరిధిలోని చేనిగుంట దళితవాడలో ఆదివారం పోలేరమ్మ తల్లికి భక్తులు అంబళ్లను సమర్పించుకున్నారు. ఆడిమాసం వెళ్లిపోయి మొదటి ఆదివారం కావడంతో ఈ మేరకు గ్రామస్థులు ఉదయమే అంబళ్లను పెట్టుకొని ఊరేగింపుగా పోలేరమ్మ బండ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ సంప్రదాయ ప్రకారం అమ్మణ్ణికి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. కొబ్బరికాయలు కొట్టారు. కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

పరిశ్రమల చెంత.. తీరని చింత

- చిగురుపాడులో వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



రాళ్లుతేలిన చిగురుపాడు ప్రధాన రహదారి (ఇన్‌సెట్‌లో) దుస్థితిలో వాటర్ ట్యాంక్

నాయుడుపేటరూరల్ : పరిశ్రమల చెంతన ఉన్నా... గ్రామంలో నిరుద్యోగ చింత తీరనేలేదు. అక్కడి పరిశ్రమలు ఆయా ప్రాంతాలలోని గ్రామాల అభివృద్ధికి కొంత నిధులు వెచ్చించాల్సి ఉన్నా ఎక్కడా రూపాయి ఖర్చుపెట్టిన దాఖలాలు లేవు. దాంతో ఆ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి.

మౌలిక సదుపాయాలు శూన్యం

స్వర్ణముఖినది పరివాహక ప్రాంతం నాయుడుపేట మండలంలోని చిగురుపాడు పంచాయతీలో దాదాపు మూడు వేల జనాభా ఉన్నారు. నది పక్కనే ఉన్నప్పటికీ వీరిని తాగునీటి సమస్య వేధిస్తోంది. గతంలో చిగురుపాడు వద్ద ఇసుకరీచ్‌లు ఉండటంతో వేలాది వాహనాలు ఇసుక రాకపోకలు సాగించేవి. మైనింగ్ అధికారులు సూచించిన పరిమాణం కన్నా అధికంగా ఇక్కడ ఇసుక తరలించడంతో భూగర్భజలాలు బాగా అడుగంటిపోయాయి. ఫలితంగా సాగునీటికి, తాగునీటికి జనం కటకటలాడుతున్నారు. అంతర్గతరోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. డ్రైనేజీ సదుపాయాలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఆ మురుగు దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులు ముక్కు మూసుకుని జీవనం సాగిస్తున్నారు. మురుగుకాలువలు దోమలకు నిలయంగా మారాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది. ఇక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నారులు బిక్కుబిక్కుమంటూ భయాందోళనతో చదువు సాగిస్తున్నారు. వాటర్‌ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. కూలేందుకు సిద్ధంగా ఉంది. గ్రామంలో నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. గ్రామం నుంచి అగ్రహారానికి వెళ్లే రోడ్డు పక్కనే పొర్లుకట్టలు వేశారు. ఆ పొర్లుకట్టల మట్టి రోడ్డును కప్పేయడంతో గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు.

నిరుద్యోగ సమస్య

మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలు, గ్రామంలో నెలకొన్న రెండు పరిశ్రమలు చెంతనే ఉన్నా ఆ గ్రామస్థులు ఉపాధి కోసం వలసపోక తప్పలేదు. సమీప పరిశ్రమలు పంచాయతీలకు పన్నులు సక్రమంగా చెల్లించకపోవడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. నాయుడుపేట - మేనకూరు రహదారి నుంచి గ్రామానికి వేసిన తారురోడ్డు ఈ రెండు పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాల కారణంగా పూర్తిగా దెబ్బతింది. ఐదుకిలోమీటర్ల మేరకు రోడ్డు రాళ్లుతేలిపోయింది. గర్భిణులు, రోగులు రాకపోకలు సాగించలేక ఇబ్బంది పడుతున్నారు.

పాఠశాల భవనం తక్షణమే పూర్తి చేయాలి

పాఠశాలను తక్షణమే పూర్తిచేసి విద్యార్థులను నూతన భవనంలోకి తరలించాలి. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం ఎటువంటి ప్రమాదం జరగకమునుపే చర్యలు చేపట్టాలి.



\- పుల్లాచారి



అర్ధాంతరంగా ఆగిన పాఠశాల భవనం

గ్రామంలో సౌకర్యాలు కల్పించాలి



గ్రామంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు నిల్వచేరుతుండటంతో రోగాలబారిన పడుతున్నాం. అధికారులు స్పందించి మురుగునీటి వ్యవస్థను బాగుచేయాలి. మా ఆరోగ్యాన్ని కాపాడాలి. అలాగే పాఠశాల భవనాన్ని త్వరగా నిర్మించాలి. విద్యార్థులకు త్వరగా వినియోగంలోకి తేవాలి.

\- బత్తల వెంకటేశ్వర్లు

ప్రధాన రహదారి ఏర్పాటు చేయాలి



నాయుడుపేట-మేనకూరు నుంచి గ్రామం వరకు వేసి ఉన్న తారురోడ్డు రెండు పరిశ్రమల భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా ధ్వంసమైంది. దాంతో గ్రామస్థులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రాత్రివేళల్లో రాకపోకల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రధానంగా రహదారిని తక్షణం నిర్మించాలి. అందుకోసం అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలి. నా వంతు సహకారం ఉంటుంది.

\- సర్పంచ్ ఆనంద్ కృష్ణయ్య

నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట నగరపంచాయతీ కార్యాలయంలో 21వ తేదీ సోమవారం ఓబీఎంఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న అన్ని వర్గాల సబ్సిడీ రుణాల మంజూరుపై మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని కమిషనర్ అవినేని ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లబ్ధిదారులు తమ ఆధార్, కుల, ఆదాయ, విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

మండల పరిషత్‌లో..

మండలంలో ఓబీఎంఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు అన్ని వర్గాల సబ్సిడీ రుణాల మంజూరుపై ఈ నెల 21వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని మండల సబ్సిడీ రుణాల కన్వీనర్, ఎంపీడీవో శివయ్య ఆదివారం తెలిపారు. దరఖాస్తుదారులు తమ సర్టిఫికెట్లతో మండల పరిషత్ కార్యాలయంలో హాజరుకావాలని ఆయన కోరారు. మండలంలో ఎస్సీ కార్పొరేషన్‌కు 953, ఎస్టీ కార్పొరేషన్‌కు 361, కాపు వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు 183, బీసీ కార్పొరేషన్‌కు 426, రజక కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్‌కు 16, వడ్డేర కార్పొరేషన్ సొసైటీ ఫెడరేషన్‌కు 40, కుమ్మరి, సాలివాహన, కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్‌కు 14, తోడీట్యాపర్స్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 11, ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 35, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 5 దరఖాస్తులు అందాయన్నారు. వీరందరూ హాజరుకావాలని కోరారు.

ఎల్ఎల్ఆర్ మేళాకు అనూహ్య స్పందన



ఆటో డ్రైవర్లకు ఎల్ఎల్ఆర్ అందిస్తున్న ఎంవీఐ

కావలి(క్రైం): రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం కావలిలో నిర్వహించిన ఆటోడ్రైవర్ల బాడ్జీ ఎల్ఎల్ఆర్ మేళాకు అనూహ్య స్పందన వచ్చిందని కావలి మోటారు వాహనాల తనిఖీ అధికారి కె.మురళీమోహన్ తెలిపారు. ఈ మేళాలో 285 మంది ఆటో డ్రైవర్లు విద్యార్హతతో సంబంధం లేకుండా బాడ్జీ నెంబరు కోసం ఎల్ఎల్ఆర్ పొందారన్నారు. ఆదివారం మేళాలో సాంకేతిక కారణాల వలన ఎల్ఎల్ఆర్ పొందని వారికి సోమవారం ఇస్తామన్నారు. వాహనచోదకులందరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఏఎంవీఐ జీ భాస్కర్‌రావు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ భవన పరిశీలన

కావలి(క్రైం): కావలి ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ భవనాన్ని ఆదివారం సాయంత్రం డీఐజీ గోపాల్‌రావు పరిశీలించారు. నెల్లూరు నుంచి గుంటూరుకు వెళ్తూ మార్గ మధ్యంలో కావలిలో ఆగిన ఆయన కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. భవన నిర్మాణం అద్భుతంగా ఉందని స్థానిక అధికారులను ప్రసంశించారు. నాణ్యతాప్రమాణాలలో రాజీ పడవద్దని ఆయన అధికారులకు సూచించారు. త్వరలో భవన ప్రారంభోత్సవం చేస్తారని ఆయన తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ఈ భవనం ఎంత ఉపయోగపడుతుందని వివరించారు.

వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

- బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నరసారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నరసారెడ్డి

ఆత్మకూరు: జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో ఈ ఏడాది మెరుగైన వసతులు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి వై.నరసారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లోని బీసీ బాలుర, బాలికల వసతిగృహాల్లో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశాల్లో పాల్గొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో మెనూను మెరుగుపరచడంతో పాటు, ట్యూటర్ల ఏర్పాటు, ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా బీసీ సంక్షేమ వసతిగృహాలు నిలిచాయన్నారు. 2016-17 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో బీసీ వసతిగృహాల విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించడం ఇందుకు నిదర్శనమన్నారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు, మెనూ అమలుపై విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశాల్లో చర్చించాల్సి ఉందన్నారు. విద్యార్థులను ఎక్కువ రోజులు ఇళ్లలో ఉంచుకోకుండా హాస్టళ్లకు పంపడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌డబ్ల్యూవో షేక్ మహబూబ్‌బాషా, బీసీ బాలికల వసతిగృహం సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, బీసీ బాలుర కళాశాల హాస్టల్ సంక్షేమ అధికారి షేక్ షకీల్, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మన బడిని మనమే బాగుచేసుకుందాం



టీచర్లను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థినులు

ఆత్మకూరు: మనం చదివిన బడులను మనమే బాగు చేసుకుందామంటూ పలువురు పూర్వవిద్యార్థులు ముందుకొస్తుండడం హర్షణీయమని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖ ఏడీఏ అనూరాధ అన్నారు. ఆదివారం ఆత్మకూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థినుల సమ్మేళనం నిర్వహించారు. 1977 నుంచి 2010 వరకు ఆ పాఠశాలలో చదివిన విద్యార్థినులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పలువురు విరాళాలు ప్రకటించారు. ఈ పాఠశాలలో చదివి 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తామని ఆ పాఠశాల పూర్వవిద్యార్థిని, ప్రస్తుత జిల్లా ఉద్యానవన సహాయ సంచాలకులు అనూరాధ, మరో పూర్వవిద్యార్థిని ఛాయాదేవి ప్రకటించారు. చిత్రలేఖన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు కుమార్తెలు వి.రాజేశ్వరి, డాక్టర్ సుగుణ, నిర్మల, విమల పాఠశాలలో ఆర్వో ప్లాంట్, సరస్వతీ మందిరం నిర్మిస్తామన్నారు. రూ.17 వేల నగదును పూర్వవిద్యార్థిని గిరిజకు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థినులు ప్రకటించిన మొత్తానికి సమానంగా మున్సిపాలిటీ నుంచి మంజూరు చేస్తామన్నారు. టీచర్లులక్ష్మీ కాంతమ్మ, రామేశ్వరమ్మ, నారాయణ, లలితమ్మతో పాటు ప్రస్తుత హెచ్ఎం శ్రీనివాసులును సన్మానించారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

సూళ్లూరుపేట : వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిం చేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకొని వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఇంద్రసేనారెడ్డి తెలిపారు. పరిసర ప్రాంతాలలో శబ్ద కాలుష్యంలేకుండా మైక్‌లు పెట్టుకోవాలని చెప్పారు. రాకపోకలకు అడ్డులేకుండా వినాయక ప్రతి మలను ప్రతిష్ఠించుకోవాలని చెప్పారు. అనుమతి తీసుకో కుండా ఉత్సవాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ ఎన్‌ఎంయూ గోల్డన్ జూబ్లీ సంబరాలు



కేక్‌ను కట్ చేస్తున్న ఎన్‌ఎంయూ నేతలు

సూళ్లూరుపేట : ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం పేట ఆర్టీసీ డిపోలో ఎన్‌ఎంయూ గోల్డన్ జూబ్లీ సంబరాలను కోలాహలంగా నిర్వహించారు. ఎన్‌ఎంయూ రీజనల్ ప్రెసిడెంట్ పీఎస్‌రెడ్డి, ఎన్‌ఎంయూ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్‌ఎంయూ వ్యవస్థాపకులు స్వర్గీయ రామమోహన్ రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కేక్‌ను కట్‌చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ఎన్‌ఎంయూ అలుపెరగని పోరాటాలు చేస్తోందని నేతలు తెలియజేశారు. డిపో కార్యదర్శి ఎం శేఖర్, అధ్యక్షులు యు. వేణుగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. భాస్కర్, ఎ. సుబ్రహ్మణ్యం, కెఎస్ మన్యం, పి. గోపాలయ్య, జెఎస్ వాసు, ఇరత కార్మికులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛభారత్



రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న సిబ్బంది

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని రైల్వే సిబ్బంది నిర్వహించారు. రైల్వే స్టేషన్‌తోపాటు టిక్కెట్ బుకింగ్ కార్యాలయం, ప్లాట్‌ఫారం, తదితర ప్రాంతాలను శుభ్ర పరిచారు. ఆర్‌పీఎఫ్‌కు చెందిన కెకె బిజు, సంతోష్, సునీల్, స్టేషన్ మాస్టర్ ఎస్‌ఎం. రమణయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులపై ఎక్సైజ్ కానిస్టేబుల్ దౌర్జన్యం

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను గిరిజనులు ముట్టడించారు. ఆదివారం గంగపట్నం, ఇందుకూరుపేటకు చెందిన గిరిజనులు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో బైఠాయించి వారికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. గంగపట్నంలో ఆక్వా కయ్యల్లో పనిచేస్తున్న గిరిజన కూలీలు కొందరు 11 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి వెళుతుండగా ఎక్సైజ్ కానిస్టేబుల్ బెల్టు షాపుల కోసమేనని వారిని అడ్డుకున్నారు. బెల్టుషాపులకు కాదని గిరిజనులు చెప్పినా పోలీసులు పట్టించుకోలేదు. ఒక గిరిజనుడిని బలవంతంగా గంగపట్నం నుంచి ఇందుకూరుపేట ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై గంగపట్నం, ఇందుకూరుపేట గిరిజనులు దాదాపు 100 మంది స్టేషన్‌ను ముట్టడించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గిరిజనులపై అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారని, లాకప్‌లో ఉన్న గిరిజన కూలీని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ ఎస్సై, సీఐలు అందుబాటులో లేకపోవడంతో సాయంత్రం వరకు స్టేషన్ ముందే ధర్నా చేశారు. వారికి ఫోన్‌లు చేసినా స్పందించలేదు. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని గిరిజనులు తెలిపారు.



ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

వాస్తు లేదు.. చేరేది లేదు..!

- నివాసాలకు ముందుకు రాని టీచర్లు
- ఇంజినీరింగ్ అధికారుల ప్లాన్ ప్రకారమే నిర్మాణమంటున్న కాంట్రాక్టర్

దొరవారిసత్రం: విద్యార్థులకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో నిర్మించిన ఉపాధ్యాయ గృహనివాస భవనాలు అవి.. వాటి నిర్మాణం కోసం సుమారు కోటి రూపాయలు వెచ్చించారు.. తీరా ఆ భవనాలకు వాస్తు లేదని వాటిలో చేరడానికి ఉపాధ్యాయులు సంకోచిస్తున్నారు. ఇది దొరవారి సత్రంలోని బీసీ గురుకుల పాఠశాలలోని ఉపాధ్యాయ నివాస గృహా భవనాల పరిస్థితి. దొరవారిసత్రంలోని మహాత్మ జ్యోతిరావుపూలే ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ (ఎంజేపీ ఏపీ బీసీ డబ్ల్యూఆర్‌ఇఎస్) పాఠశాల ఉంది. ఈ పాఠశాలకు 2014-15లో ఉపాధ్యాయులు ఉండేందుకు గృహ నివాస భవనాలు మంజూర య్యాయి. రెండు బ్లాక్‌లు జీ ప్లస్‌టుతో 8 క్వార్టర్స్ నిర్మాణానికి రూ.1.3 కోట్లు మంజూ రు చేశారు. పనులను దక్కిం చుకున్న కాం ట్రాక్టరు పాఠశాల ప్రాంగణంలో



పాఠశాల ఆవరణంలో నిర్మించిన భవనాలు

వాస్తుభయం

వాటికి కేటాయిం చిన స్థలాలో భవ నాలు నిర్మిం చా రు. గత మార్చి నా టికి దాదాపుగా భవనాల పనులను పూర్తి చేసి పాఠశాలకు అప్పగిం చాడు.

నివాసా గృహాలే కాక, ఆఫీసు కార్యాలయాల్లో వాస్తు చూసి భవనాలు నిర్మిస్తారు. ఇక్కడ కాపురాలు చేయాల్సిన గృహాల్లో వాస్తుకు విర్ధుంగా నిర్మించేశారు. ఇక్కడ కాపురాలు ఉండాలంటే భయపడుతున్నాం. అసలే ఈ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉండేది ఇద్దరే.. మిగిలిన వారంతా సీఆర్‌టీలు, గెస్ట్ టీచర్స్. వారు భయపడుతున్నారు. ఇప్పుడే వాస్తు సరిచేయాలి. **- టి. మస్తానయ్య, ఉపాధ్యాయుడు**



వాస్తు గ్రహణం

ఈ నివాసా గృహాలకు వాస్తు గ్రహణం పట్టుకుంది. రెండు బ్లాక్‌లుగా జీప్లస్‌టుతో 8 క్వార్టర్స్ నిర్మింప చేసిన ఈ భవనాలు తూర్పు దిక్కున మెయిన్ ద్వారం వచ్చేలా నిర్మించాల్సి ఉంది. గుత్తే దారు డు దక్షిణవైపుగా భవనాలు నిర్మించాడు. ఇలా నిర్మించిన గృహాలకు నైరుతి మూలలో గృహం ప్రధాన ద్వారం ఏర్పాటు చేశారు. ఇది వాస్తు విరుద్ధమని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ నివాసగృహంలో కాపురాలు చేయలేమని వాపోతున్నారు. గుత్తేదారుడు ఇటీవల స్వాధీన పరచిన భవనాలకు అదే కాంట్రాక్టరు చేత వాస్తుకు అనుకూలంగా మార్పులు చేయించాలని కోరుతున్నారు. ఇలాగే వదిలేస్తే ఈ నివాసా గృహాల్లో చేరబోమని వారు అంటున్నారు. మరి ఉన్నతాధికారులు ఏం చర్యలు చేపడుతారో చూడాల్సి ఉంది.

ప్లానింగ్ మేరకు నిర్మించాం

గురుకుల పాఠశాల నివాస గృహాలను ఇంజనీరింగ్ అధికారుల ప్లానింగ్ ప్రకారం నిర్మించాం. మేము కూడా మొదట్లో చెప్పాము. తూర్పు వైపు భవనాలు నిర్మించాలని, స్థలం ప్రకారం ప్లానింగ్ చేసినట్లు వారు చెప్పారు. అందుకే మాకు ఎలాంటి సంబంధం లేదు. మార్పులు చేయాలన్నా మాకు అదనపు నిధులు ఇవ్వాల్సిందే. **- ఈశ్వరరెడ్డి, గుత్తేదారుని ప్రతినిధి**



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యవేదిక ఏర్పాటు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేధికను సూళ్లూరుపేటలో ఆదివారం ఏర్పాటు చేశారు. అగ్రవర్ణాలకు ధీటుగా దళితులు అభివృద్ధి చెందలేకున్నారని అందుకే పార్టీలకు అతీతంగా ఐక్యవేధికను ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. వచ్చేనెల 3వ తేదీ నియోజకవర్గంలోని 6 మండలాల కార్యవర్గాలను ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికను రూపొందించి ముందుకు సాగుతామని తెలిపారు. ఆవుల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బూదూరు వెంకటేశ్వర్లు, బూరగ మనోహర్, కె.రామకృష్ణ, రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ఐక్యవేదికను ఏర్పాటు చేసుకొంటున్న ప్రతినిధులు

విషాదంలో అనంతనారాయణపురం

బుచ్చిరెడ్డిపాళెంరూరల్: బుచ్చిమండలం నాగాయ గుంట పంచాయితీ అనంతనారాయణపురం గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామంలోని శాంతి కుమారి హైదరాబాద్‌లో అనుమానాస్పద స్థితిలో శనివారం మృతిచెందింది. మృతురాలి భర్త నెల్లూరు విక్రమ్‌నగర్‌కు చెందిన మహేష్. ఇతడు తన భార్య మృతదేహాన్ని ఆదివారం నెల్లూరుకు తీసుకొచ్చాడు. శాంతికుమారిని భర్తే హత్యచేసి ఉంటాడని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తు న్నారు. మృతురాలి తల్లి గోవిందమ్మ పక్షవాతంతో బాధ పడుతోంది. కుమార్తె మరణవార్త విని ఆమె కన్నీళ్ల పర్యం తమైంది. అలాగే తండ్రికి మతిస్థిమితం లేదు. ఈ పరిస్థితిలో కుమార్తె మృతితో ఆ తల్లి బోరున విలపించింది.

చెంగాళమ్మ ఆలయంలో వైద్య శిబిరం

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయంలో మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక వైద్యులు పరుచూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. చెంగాళమ్మ ఆలయ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి శిబిరాన్ని ప్రారంభింపచేశారు. మూత్రపిండ వ్యాధుల నిపుణులు డాక్టర్ ఎ. నిశ్చల ప్రసాద్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఆర్. సుధ, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ పోకల రవి, స్త్రీ సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ లలిత, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ తులసీరామ్, జీర్ణకోశ వైద్యనిపుణులు డాక్టర్ లక్ష్మణ్‌చంద్ర వైద్య పరీక్షలు చేశారు. చెంగాళమ్మ ఆలయ ఇవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు పెరుమాల్, ఆకుతోట రమేష్, పి. శ్రీనివాసులురెడ్డి, పేట పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ ఎంఎం. శ్రీనివాసులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు

అభివృద్ధే టీడీపీ ధ్యేయం

కొడవలూరు: అభివృద్ధే టీడీపీ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని రేగడచెలిక పంచాయతీ పరిధిలో సుమారు రూ. 16 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీకి చెందిన చేగడచెలిక పంచాయతీ ఉప సర్పంచు చెముకుల శ్రీనివాసులు, ముగ్గురు వార్డు సభ్యులతోపాటు కొంత మంది కార్యకర్తలు ఎమ్మెల్యే పోలంరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే టీడీపీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో ఉన్న అందరికీ సముచిత స్థానం ఉంటుంద న్నారు. నియోజకవర్గంలో నీరు-ప్రగతి కింద రైతులకు అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై రేగడచెలిక వైస్ సర్పంచు శ్రీనివాసులు,కార్యకర్తలు పార్టీలో చేరారని వివరించారు. 2019లో జరిగే శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఇరువూరు శ్రీధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు చెముకుల వెంకయ్య, ప్రధాన కార్యదర్శి పాటూరు రమేష్, నీటి సంఘాల అధ్యక్షులు వెంకటేశ్వర్లురెడ్డి, సతీష్‌రెడ్డి, మల్లిఖార్జున, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల ప్రచారంలో పొదలకూరు నేతలు


నంద్యాల ప్రచారంలో పొదలకూరు టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి

పొదలకూరు : స్థానిక టీడీపీ నాయకులు నంద్యాల ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారు. ప్రచారం చివరి ఘట్టానికి చేరుకోవడంతో రెండు రోజులుగా సీఎం సహ ప్రముఖ నాయకులంతా అక్కడే తిష్టవేశారు. మంత్రి సోమిరెడ్డి ప్రతి పక్షనేత వ్యాఖ్యలను ఎదుర్కొంటూ, రాజకీయ వ్యూహాలు రచిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పొదలకూరు మండల టీడీపీ అధ్యక్షుడు మోపూరు శ్రీనివాసులురెడ్డి, మండల టీడీపీ నాయకులతో కలిసిమూడు రోజులుగా అక్కడే ఉంటూ టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయం కోసం ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. మంత్రి సోమిరెడ్డికి చేదోడు వాదోడుగా రాజకీయ సమీకరణలో సహకరిస్తున్నారు. అలాగే ప్రతిపక్ష పార్టీకి చెందిన సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి నంద్యాలలోనే ఉంటూ వైసీపీ అభ్యర్థి గెలుపునకు ప్రచారం చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా స్థానిక వైసీపీ నేతలు వెళ్లివచ్చారు. నంద్యాల ఎన్నికల వేడి పొదలకూరును తాకింది. ఎక్కడ ఇద్దరు కలిసినా నంద్యాల విజయంపైనే మాట్లాడుకుంటున్నారు.

కష్ట నష్టాల ట్రాన్స్‌ఫార్మర్



మనుబోలు : స్థానిక కోదండరామపురంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ ట్రాన్స్ ఫార్మర్ విద్యుత్ సిబ్బందికి కష్టాలు..గ్రామస్థులను నష్టాలు తెచ్చి పెడుతోంది. తరుచూగా ట్రాన్స్ ఫార్మర్‌లో సాంకేతిక లోపాలు ఏర్పడడంతో ఇళ్లలో ఉన్న విద్యుత్ ఉపకరణాలు కాలిపోతున్నాయి. శనివారం రాత్రి 7 గంటల సమయంలో ట్రాన్స్ ఫార్మర్ నుంచి సరఫరా ఆగిపోయింది. ఒకే ట్రాన్స్ ఫార్మర్ పరిధిలో అధిక కనెక్షన్లు ఇవ్వడంతో నాణ్యమైన విద్యుత్ అందడం లేదు. రాత్రంతా పిల్లలు, వృద్ధులకు జాగారం తప్పలేదు. ఆదివారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. 15 రోజుల వ్యవధిలోనే రెండు సార్లు సరఫరాలో అంతరాయం ఏర్పడడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదంటున్నారు. గ్రామంలో ఎక్కడా ఏబీ స్విచ్‌లు లేకపోవడంతో ఎక్కడైనా విద్యుత్ సమస్య ఏర్పడితే మనుబోలు పట్టణం అంధకారంలో మగ్గాల్సి వస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాలని, లేదంటే సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

గోదాములో అగ్నిప్రమాదం

గూడూరు(టౌన్): స్థానిక హైస్కూల్ రోడ్డులోని ఓ గోదాములో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది.. స్థానికుల కథనం మేరకు ఓ వ్యాపారికి చెందిన గోదాములో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి గోదాములోని సరుకులు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం మందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో లక్షకు పైబడి నష్టం వాటిల్లిందని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.


ప్రమాద స్థలంలో గుమికూడిన స్థానికులు

అవినీతి 'మరుగు'న అధికార గణం

- ఎన్జీవోలకు నోట్లు ● లబ్ధిదారులకు పాట్లు ● రూ. 30లక్షల పైగా అక్రమాలు
- రికార్డులు సరిచేసే పనిలో సాక్షరభారత్ వీసీలు


ప్రమాదాలకు కారణమవుతున్న వరల గుంత


బిల్లు చేసుకున్న శ్లాబు వేయని మరుగుదొడ్డి

పొదలకూరు: పొదలకూరు ఆత్మగౌరంలో జరిగిన అవినీతిలో అధికారుల పాత్ర 'మరుగు'న దాక్కొంటోంది. ఇంజనీర్లు నిర్మాణాలను పరిశీలించి ఎంబుక్‌లో నమోదు చేశాకే బిల్లులు మంజూరు కావాలి. దీన్ని బట్టి చూస్తే అధికారులు క్షేత్ర పరిశీలన లేకుండానే కాసులు పుచ్చుకొని బిల్లులు మంజూరు చేసినట్లు స్పష్టమవుతోంది. లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్న మరుగుదొడ్లకూ బిల్లులు ఎన్జీవోల ఖాతాలో చేరాయి. దీంతో అప్పో సప్పో చేసి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు బిల్లులందక లబో...దిబో మంటున్నారు. ఒక్క పొదలకూరు పంచాయతీ పరిధిలోనే 30 లక్షల మేర అవినీతి జరిగిందన్నది సమాచారం.

పొదలకూరు పంచాయతీ పరిధిలో ఆత్మగౌరం పథకంలో భాగంగా 1056మరుగుదొడ్లు నిర్మించారు. వీటిలో కొన్ని లబ్దిదారులే నిర్మించుకోగా, మరికొన్ని ఎన్జీవోల ద్వారా నిర్మాణాలు చేయించారు. మరుగు నిర్మాణంలో అవినీతిని ఆంధ్రజ్యోతి శుక్రవారం వెలుగులోకి తేవడంతో అధికారుల్లో కలవరం మొదలైంది. వెంకటేశ్వరనగర్, విష్ణేశ్వరపురం కాలనీ, శ్రామికనగర్ తదితర కాలనీల్లో విచారిస్తే అధికారులు, ఎన్జీవోల లీలలు వెలుగు చూసే అవకాశం ఉంది.

విచారణపై అనుమానాలు

ఆత్మగౌరంలో జరిగిన అక్రమాలపై ఇన్‌చార్జి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈకి స్థానిక నేతలు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయి నుంచి విచారణ జరిపిస్తామని ఎస్ఈ బదులిచ్చారు. ఈ మేరకు శనివారం ఓ అధికారి వెంకటేశ్వరనగర్‌లోని మరుగు నిర్మాణాల తనిఖీకి వచ్చాడు. ఆయన ఎన్జీవోలతో కలిసి విచారణ చేపట్టడంతో అవినీతి వెలికి వస్తుందన్న అనుమానాలు కలుగుతున్నాయి.

రికార్డులు సరిచేసే పనిలో..

అధికారులు అక్రమాలను కప్పిపుచ్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో సాక్షరభారత్ విలేజ్ కో-ఆర్డినేటర్ల(వీసీలు) ద్వారా ఎంబుక్‌లు రహస్య ప్రదేశంలో తయారు చేయిస్తున్నట్లు తెలిసింది. పొదలకూరు-రాపూరు మార్గంలో అటవీ ప్రాంతంలోని గెస్ట్‌హౌస్ దీనికి వేదికైందని తెలిసింది. కాగా విష్ణేశ్వరపురం కాలనీకి సంబంధించి ఎంబుక్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న వీఆర్ఏ ఈ చంద్రశేఖర్‌ను ఆంధ్రజ్యోతి ఈ విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నింగా ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉన్నారు.

పూర్తి కాకుండనే బిల్లు చేసుకున్నారు



మా ఇంటిలో మరుగుదొడ్డి నిర్మిస్తానని ఓ ఎన్జీవో వచ్చాడు. గోడలు కట్టారు, లోపల లెట్రిన్ షీట్, పైన రూఫ్ వేయలేదు. ఆరు నెలలుగా ఇలానే వదిలేశారు. నిర్మాణం పూర్తి కాకుండానే ఎన్జీవో బిల్లు చేసుకున్నట్లు తెలిసింది. అధికారులు విచారించి మాకు న్యాయం చేయాలి.

- దేవళ్ళ చినఅంకమ్మ, విష్ణేశ్వరపురం కాలనీ

చులకనగా చూస్తున్నారు



కాలనీలో ప్రతి కుటుంబానికి మరుగుదొడ్డి మంజూరైంది. ఏ ఒక్కటి కూడా పూర్తి నిర్మాణానికి నోచుకోలేదు. కొందరు కష్టపడి అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారివి అలానే ఉన్నాయి. మరుగుదొడ్డికి సంబంధించి తలుపులు ఏర్పాటు చేయలేదు. డ్రైనేజీ నీరు వెళ్ళేందుకు గుంతలు ఏర్పాటు చేయలేదు. వరలు వేసిన చోట మూత బండలు వేయకుండా వదిలేశారు. నిర్మాణాలు చేపట్టిన ఎన్జీవోను అడిగితే తమను గిరిజనులమనే చులకన భావంతో చూస్తున్నాడు.

- చలంచర్ల శాంతి, శ్రామికనగర్

పిల్లలు గుంతల్లో పడుతున్నారు



కాలనీలో మరుగుదొడ్లు ఏర్పాటు చేసిన ఎన్జీవో వాటిని అసంపూర్తిగా వదిలేశాడు. కొంత మంది ఇళ్లలో గుంతలు తవ్వి వరలు వేసి మూత బండలు వేయలేదు. పిల్లలు వాటిలో పడి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. వర్షపు నీరు ఆ గుంతల్లో చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కాలనీలోని నిర్మాణాలకు సంబంధించి ఎన్జీవో మాత్రం పూర్తిగా బిల్లు చేసుకొని మరుగ దొడ్లను అసంపూర్తిగా వదిలేశాడు. మాకు అసంపూర్తి మరుగు దొడ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలి.

- కొండా పాండు, శ్రామికనగర్

వైద్య శిబిరం

తోటపల్లిగూడూరు : మండల పరిధిలోని తోటపల్లిగూడూరు గ్రామంలో ఆదివారం ఆయుష్ దంతవైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు ఉస్మాన్ దాదాపు 100మందికి పైగా పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ దంత వైద్యశాల పీఆర్‌వో కొండయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛభారత్

వెంకటాచలం: వెంకటాచలం రైల్వే స్టేషన్‌లో ఆదివారంఅధికారులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆదివారం పలువురు అధికారులు స్టేషన్‌లోని చెత్తను చీపుర్లు పట్టి ఊడ్చారు. పరిశుభ్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రైల్వే శాఖ ప్రజల ఆస్తి కాబట్టి పరిశుభ్రంగా ఉంచుకోవడం సమష్టి బాధ్యత అన్నారు. రైళ్లను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎలక్ట్రికల్ సెక్షన్ ఇంజనీర్ సురేంద్రబాబు, సీనియర్ వర్క్స్ సెక్షన్ ఇంజనీర్ కే నారాయణరెడ్డి, జూనియర్ వర్క్స్ సెక్షన్ ఇంజనీర్ సత్యనారాయణ, సిగ్నల్, టెలికాం అధికారి పురుషోత్తం కుమార్, స్టేషన్ మాస్టర్ ముఖేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశంలో సూర్యగ్రహణం కనిపించదు

ముత్తుకూరు: భారత దేశంలో సోమవారం సూర్యగ్రహణం కనిపించదని ముత్తుకూరుకు చెందిన జ్యోతిషమామణి జీవీబీ మురళీకృష్ణ తెలిపారు. ఈ సూర్యగ్రహణం కేవలం ఉత్తర అమెరికాలో మాత్రమే కనపడుతుందన్నారు. అందువల్ల గ్రహణ పరిహారాలు ఆచరించాల్సిన అవసరం లేదన్నారు. సూర్యగ్రహణంకి సంబంధించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం అమావాస్య వస్తున్నందున సోమవతి అమావాస్యగా పిలుస్తారన్నారు. శివాలయంలో రుద్రాభిషేకాలు, శనికి తైలాభిషేకాలు చేయిస్తే శుభ ఫలితాలు కలుగుతాయన్నారు. ఆశ్లేష నక్షత్రంలో జన్మించిన వారు ఒకటింపావు కిలో ముడి పెసలు దానం చేసి విష్ణుమూర్తి ఆయలంలో ఆర్చన చేయిస్తే మంచిదన్నారు.

నేడు చింతాలమ్మ కొలుపు

వెంకటాచలం: చెముడుగుంట గ్రామదేవత చింతాలమ్మ ఆలయంలో సోమవారం కొలుపు నిర్వహిస్తున్నామని భక్తులు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయని, మధ్యాహ్నం మూడు గంటల నుంచి అమ్మవారికి బోనాలు సమర్పిస్తారన్నారు. సోమవారం రాత్రి ఆలయం సమీపంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని వారు తెలిపారు.

వీరంపల్లిలో ఆర్ఆర్ నోటీసులు జారీ

మనుబోలు : మండలంలోని వీరంపల్లిలో ఆదివారం ఆత్మగౌరవం లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. వీరంపల్లిలో మరుగుదొడ్ల నిర్మాణంలో అవినీతి జరిగిందన్న విషయమై ఆడిట్ సుగుణమ్మ, వీఆర్‌వో గుణశేఖర్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆర్ఆర్ యాక్ట్ (రెవెన్యూ రికవరీ) నోటీసులు పంపిణీ చేశారు. నోటీసులు తీసుకునేందుకు లబ్ధిదారులు నిరాకరించారు. సొంతంగా కట్టుకున్న మరుగుదొడ్లకు ప్రభుత్వం నుంచి అందిన నగదు తిరిగి చెల్లించాలని నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. ఈనెల 28వ తేదీలోగా నోటీసుల్లో చూపిన మొత్తాన్ని చెల్లించాలని లేదంటే తదుపరి చర్యల్లో భాగంగా వేలం పాటలు వేయాల్సి ఉంటుందని హెచ్చరించడంపై వీరంపల్లి గ్రామస్థులు మండిపడుతున్నారు. ఆందోళన చేయాలన్న ఆలోచనలో వారున్నారు.

అక్షరాస్యత వృద్ధికి చిత్తశుద్ధితో కృషి

ముత్తుకూరు: అక్షరాస్యత అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ముత్తుకూరు ఎంఈవో మధుసూదన పేర్కొన్నారు. ముత్తుకూరు మండలంలో ఆదివారం సాక్షరతా భారత్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్ఐఓఎస్ పరీక్ష లను ఆయన పర్యవేక్షించారు. గ్రామాల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచే బాధ్యత సాక్షరతా భారత్ కార్యకర్తలదేనన్నారు. చదువు మనిషిలో ఆలోచనను, వివక్షణను పెంచుతుందన్నారు. ప్రజలు సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల్లో గతంలో సీ-గ్రేడ్ వారిని గుర్తించి వారి కోసం ఈసారి పరీక్ష నిర్వహించామని మండల సాక్షరతాభారత్ కో ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం 20 కేంద్రాల్లో జరిగిన పరీక్షల్లో 610 మంది పరీక్షలు రాశారన్నారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రోత్సహించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
సోమవారం,
21 ఆగస్టు 2017

చేనేత కుటుంబానికి పరామర్శ

వెంకటగిరి(టౌన్): పట్టణంలోని బంగారుపేటలో చేనేత కార్మికుడు కొంపల మనోహర్ కుటుంబ సభ్యులను ఎన్‌వీఆర్ ట్రస్టు అధినేత నక్కా వెంకటేశ్వర్లు ఆదివారం పరామర్శించారు. ఇటీవల మనోహర్ మృతిచెందిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం చేనేతలను ఆదుకుంటే బాగుంటుందని అన్నారు. చేనేతను నమ్ముకుని వెంకటగిరిలో చాలా మంది జీవిస్తున్నారని అన్నారు. వారిని అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అనంతరం బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో కాంతారావు, లోకేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు

జాతరకు వెంకటగిరి ముస్తాబు



ముస్తాబవుతున్న పోలేరమ్మ ఆలయం

- ఆలయాలకు రంగులు
- అప్పుడే ఎగ్జిబిషన్ సందడి
- సంచార దుకాణాలకు అడ్వాన్సు

వెంకటగిరి(టౌన్): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందర్భంగా ఆలయానికి రంగులు అద్ది ముస్తాబు చేస్తున్నారు. పోలేరమ్మ జాతర వచ్చే నెల 11, 12వ తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం కమిటీ, దేవాదాయశాఖ నిర్ణయించాయి. జాతరకు జిల్లా తోపాటు ఇతర ప్రాంతాల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూస్తున్నారు. పట్టణంలోని సం చార దుకాణాలు, రంగులరాట్నం, ఎగ్జిబిషన్‌లు ఇప్పటికే ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో జాతర సందడి నెల కొంది. చిన్నారులకు ఆట విడుపు కలిగించేందుకు జయింట్‌వీల్, బోటు, మోటారు సైకిల్ విన్యాసం, రైలుబండ్లు తదితర ఆట పరికరాలను ఏర్పాటు చేసేందుకు మహారాష్ట్ర, చెన్నై తదితర ప్రాంతాల వారు వెంకటగిరికి చేరుకున్నారు. ఎగ్జిబిషన్‌ల ఏర్పాటు కోసం తాత్కాలిక రేకుల షెడ్లు నిర్మాణ పనుల్లో దుకాణా దారులు నిమగ్నమయ్యారు. ఏటా జాతర సందర్భంగా ఏర్పాటయ్యే సంచార దుకాణాలు వినాయక చవితికే సిద్ధం చేసేందుకు స్థలాల కోసం ఇప్పటికే అడ్వాన్సులు ఇస్తున్నారు. రెండు రోజులుగా అమ్మవారి ఆలయం, ఆర్చి వద్ద రంగులతో నూతన మెరుగులు తీర్చిదిద్దుతున్నారు. ఏటా మాదిరి జాతర సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. అందరి సహకారంతో జాతరను ప్రశాంతంగా ముగిసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్

ఎన్ఐవోఎస్ పరీక్ష కేంద్రాల తనిఖీ

కలువాయి : మండలంలోని తోపుగుంట, చింతలాత్మకూరులో ఎన్ఐవోఎస్ పరీక్షా కేంద్రాలను ఆదివారం వయోజన విద్యా జిల్లా సహాయ సంచాలకులు కె.శ్రీనివాసులు తనిఖీ చేశారు. సాక్షరభారత్ కేంద్రాల్లో విద్యనభ్యసించిన 699 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరైనట్టు మండల కోర్డినేటర్ పి.సునీల్ తెలిపారు.

'కోఆర్డినేటర్స్'కు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నడుస్తున్న నవ చైతన్య వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఎన్‌సిడబ్ల్యూవో)తరపున జిల్లా, డివిజన్, పట్టణం, మండలాల్లో కో ఆర్డినేటర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ అధ్యక్షుడు మునయ్య కోరారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు ఉన్న స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్హత 10 నుంచి డిగ్రీ ఉత్తీర్ణత అయి ఉండాలని తెలిపారు.

హిందూ ధర్మం గొప్పది

వెంకటగిరి(టౌన్): హిందూ ధర్మం చాలా గొప్పదని కమలనంద భారతిస్వామిజీ అన్నారు. ఆదివారం మండలంలోని పారవోలు, సీసీ కండ్రిగ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రతి రోజు ధూప, దీపారాధన చేయాలన్నారు. అప్పుడు గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని తెలిపారు. ప్రపంచంలోనే హిందూ ధర్మం సాంస్కృతికమైందన్నారు. హిందూ ధర్మంలో పుట్టి మతాలను మార్చడం చాలా అవివేకం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు యవత అధ్యక్షుడు కేవీకే ప్రసాద్, ఏయంసీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

వెంకటగిరి(టౌన్): చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి వైసీపీ సమన్వయ కర్త బియ్యపు మధుసుధన్ రెడ్డి పారవోలు గ్రామంలో ఆదివారం నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని పారవోలు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చప్పిడి బాలకృష్ణారెడ్డి కుమారుడు మనోహర్ రెడ్డికి స్వాతితో వివాహమైంది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవి యాదవ్, వైసీపీ నాయకుడు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

వెంకటగిరి(టౌన్): పట్టణంలోని సెంట్‌ఫ్రాన్సిస్ పాఠశాలలో ఆదివారం ఆదిశేషయ్య వర్ధంతి సందర్భంగా వారి మనువలు వినోద్, శివశంకర్, శంకర్ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సింహపురి యూత్ అసోసియేషన్, ఉజ్వల సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వెంకటేష్, బాలు, భవాని, సాయితేజ, మోహన్, దీక్షత్, మదన్, ధనుంజయ, ధరణి, చిన్నా పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా- డ్రైవర్‌కు గాయాలు

కలువాయి : మండలంలోని వెదనపర్తి శివాలయం సమీపాన ఆదివారం ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ ఏడుకొండలకు గాయాలయ్యాయి. వెదనపర్తి నుంచి చేజర్ల మండలం పాడేరుకు వెళుతుడగా అడ్డంగా మేక పిల్లలు వచ్చాయి. వాటిని తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. బాధితుడిని 108లో ఆస్పత్రికి తరలించారు.

పాలూరు దళితవాడలో వైద్యశిబిరం

సైదాపురం: మండలంలోని పాలూరు గ్రామ దళితవాడలో ఆదివారం డాక్టర్ పాల్‌జాన్సన్ వైద్యశిబిరం నిర్వహించారు. వర్, కిడ్నీ వ్యాధి, జ్వరంతో కడివేటి నారాయణమ్మ లిమృతి చెందిందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ తిరుపతి పాల్గొన్నారు.



పరీక్ష చేస్తున్న వైద్యులు

మానవ సేవే మాధవ సేవ

- మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర

వెంకటగిరి: నిస్వార్థంతో ప్రజలకు అందించే సేవలన్నీ దేవునికి చేసినవాటితో సమానమని రాజకుటుంబీకులు, మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పద్మశ్రీ ఘంటసాల సేవాసమితి ఆధ్వర్యంలో వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్ ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య సేవాకార్యక్రమాలు చేపడుతున్న సేవాసంఘ నిర్వాహకులను ఆయన అభినందించారు. శిబిరానికి వచ్చిన రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి 19 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. ఆపరేషన్‌ల కోసం వారిని వెంకటాచలంలోని ఎల్‌వి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో రాజకుటుంబీకులు కుమార్ రాజా సర్వజ్ఞకుమార యాచేంద్ర, సేవా సంఘ అధ్యక్షుడు బీకే ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వంటా విజయలక్ష్మి, కార్యదర్శి అరవ మోహన్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర

దొంగలు పడ్డారు

వెంకటగిరి: వెంకటగిరిలోని 12వ వార్డు మల్లమ్మ గుడి వీధి రెండవ లైన్‌లో ఉన్న జీ రమాదేవి ఇంటిలో దొంగలు పడ్డారు. స్థానికుల కథనం మేరకు ఆమె శనివారం గుంటూరులో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లింది. ఆదివారం తెల్లవారు జామున ఇంటి తలుపులు తెరిచి ఉండడం స్థానికులు గమనించారు. ఇంటిలోకి వెళ్లి చూడగా తలుపులు, బీరువాను పగలగొట్టి ఉన్నారు. సామగ్రి చెల్లాచెదరుగా పడి ఉంది. వెటనే ఇంటి యజమానికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలిపారు. ఇంటిలో నగలు, నగదు లేవని, పోలీసులకు ఫిర్యాదు చేయొద్దని తెలిపారు.

రేపు రాయితీ ఇంటర్వ్యూలు

బాలాయపల్లి: స్థానిక మండల కార్యాలయంలో ఈనెల 22వ తేదీన రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. దరఖాస్తుదారులు కుల, ధ్రువీకరణ, ఆధార్, నమోదు పత్రాలతో హాజరుకావాలని కోరారు.

23న ఇంటర్వ్యూలు

కలువాయి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 23న రాయితీ రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో మాణిక్యం తెలిపారు. ఉదయం 10 నుంచి 12గంటల వరకు ఎస్సీ కార్పొరేషన్, ఎస్టీ, మైనారిటీ మధ్యాహ్నం 1 నుంచ 2గంటల వరకు, బీసీ కార్పొరేషన్, 2 నుంచి 3గంటల వరకు, కాపు కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు 3గంటల నుంచి 4గంటలు వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని కోరారు.

వైభవంగా రుద్రాభిషేకం

కలువాయి : మండలంలోని చారిత్రక వెదనపర్తి శివాలయంలో ఆదివారం రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. ఆలయంలో దాత పాలకొండ సుబ్బారెడ్డి సహకారంతో ధ్వజస్తంభం, దాసరి వెంకటేశ్వర చౌదరి సహాయంతో కవచం ఏర్పాటు చేశారు. ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంకమ్మకు పొంగళ్లు

రాపూరు. మండలంలోని తుమాయి రోడ్డు వద్ద గల గ్రామ దేవత అంకమ్మతల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పొంగళ్లు పెట్టారు. ఉదయం 5గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేసి పూలంగిసేవ నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహాళలు ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నంద్యాలలో టీడీపీదే విజయం

ఏఎంసీ చైర్మన్ పులికొల్లు

డక్కిలి : నంద్యాల ఉపఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి పదివేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు అన్నారు. ఆయన ఎమ్మెల్యే రామకృష్ణతో కలిసి వారంపాటు నంద్యాలలో ప్రచారం నిర్వహించి వచ్చారు. ఆదివారం డక్కిలిలో విలేఖర్లతో మాట్లాడారు. వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఓడిపోవటం ఖాయమన్నారు భూమా కుటుంబం పట్ల ఆ ప్రాంత ప్రజలు ఎంతో విధేయతతో ఉన్నారని చెప్పారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా నంద్యాలలో టీడీపీ విజయాన్ని ఎవరూఅడ్డుకోలేరన్నారు. నంద్యాలలో ఎటుచూసినా అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని చెప్పారు. తెలుగుదేశం పార్టీకే ఓటు వేయాలని ఇప్పటికే నంద్యాల ప్రజలు ఓ నిర్ణయానికి వచ్చేశారని తెలిపారు. ఉప ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకొన్న జగన్ పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నరని విమర్శించారు. నద్యాల ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీ కార్యాల యాలన్నీ ఏపిలో మూతపడటం ఖాయమన్నారు.

రాయితీలను వినియోగించుకోండి

రాపూరు: ఏపీఎస్ ఆర్టీసీ అందిస్తున్న రాయితీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రాపూరు ఆర్టీసీ డిఎం ఫయాజ్ అహ్మద్ అన్నారు. ఆర్టీసీ ప్రచార కార్యక్రమాల కోసం చేపట్టిన ప్రచార రథాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రూ.100కే వనిత కార్డును ఇస్తున్నామని తెలిపారు. దాని ద్వారా కుటుంబంలోని అందరూ ఏడాది పాటు 10శాతం రాయితీతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడంతో పాటు అందరికీ బీమా సౌకర్యం కూడా ఉంటుం దన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేక రాయితీలు అందుబాటేలో ఉన్నాయన్నారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లే వారి కోసం ప్రత్యేక రాయితీలను ప్రవేశపెట్టామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



రథాన్ని ప్రారంభిస్తున్న డిఎం

సినిమాగైడ్

వెంకటగిరి

త్రిభువని:	లై
జ్యోతిమహల్:	నేనే రాజు నేనే మంత్రి
భ్రమరాంభ :	జయ జానకి నాయక

రాపూరు

శ్రీనివాసమహల్:	నేనే రాజు నేనే మంత్రి
వేంకటేశ్వరమహల్:	జయ జానకి నాయక